www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 27-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 102 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా. 9.20 తదుపరి అష్టమి; నక్షత్రం: రేవతి మ. 1.00 తదుపరి అశ్విని; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 5.56-7.23; అమృతఘడియలు: ఉ. 10.45-12.15, తె. 4.57 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.46 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఒలింపిక్స్‌పై కుట్ర

ఫ్రాన్స్‌లో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌పై దాడులు

ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు ముందు

ఐదు కీలక ప్రాంతాల్లో పట్టాల ధ్వంసం

రైల్వే కేబుళ్లు, సిగ్నల్ బాక్సులకు నిప్పు

వామపక్ష తీవ్రవాదులు, పర్యావరణ ఆందోళనకారులపై అనుమానాలు

2



రైల్వే సేవల్లో అంతరాయంతో పారిస్‌లోని ఓ రైల్వేస్టేషన్‌లో చిక్కుకున్న ప్రయాణికులు

అప్పుల కుప్ప

మొత్తం రుణాలు రూ.9.74 లక్షల కోట్లు

ఏడాదికి చెల్లించాల్సిన అసలు, వడ్డీ 71,881 కోట్లు

100 ఆదాయానికి రూ.113 ఖర్చు

పెండింగ్ బిల్లులు 1.35 లక్షల కోట్లు

అడ్డగోలుగా అప్పులు.. ప్రభుత్వ ఆస్తుల తాకట్టు

ప్రజలపై చార్జీలు, పన్నుల బాదుడు

33 ప్రభుత్వ శాఖల నుంచి నిధుల మళ్లింపు

పోలవరంపై నిర్లక్ష్యంతో 53 వేల కోట్ల నష్టం

అమరావతి ధ్వంసంతో 2-3 లక్షల కోట్ల ఆస్తి ఆవిరి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో శ్వేతపత్రం

ఇంకా సమాచారం రావాల్సి ఉందని సీఎం వ్యాఖ్య



అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల సందర్భంగా గణాంకాల పత్రాలను చూపిస్తున్న సీఎం చంద్రబాబు

ఎమ్మెల్యేలు వచ్చి తమ ప్రాంతాలకు రోడ్లు అడుగుతుంటే ఏమీ చేయలేకపోతున్నాను. నా జీవితంలో ఇలా వెనక్కి పంపడం ఇదే మొదటిసారి. ఇదంతా జగన్ చేసిన ఆర్థిక విధ్వంసం వల్లే. పీపీపీ, వీజీఎఫ్ విధానంలో రోడ్లు వేయాలన్న ఆలోచన ఉంది. - చంద్రబాబు

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేదు. పాత పథకాలకే పేర్లు, అమలు తీరు మార్చి 'బటన్' నొక్కడం మినహా పెద్దగా చేసిందేమీ లేదు. అయినా అడ్డగోలుగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పులు రూ.9.74 లక్షల కోట్లు! తేలాల్సిన లెక్కలు ఇంకా చాలా ఉన్నాయి. జగన్ ఐదేళ్ల విధ్వంసకర పాలనలో భారీగా జరిగిన ఆర్థిక నిర్వహణ లోపాలపై శుక్రవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఇంకా తవ్వాల్సినవి ఉన్నాయని, పూర్తి సమాచారం రాలేదని తెలిపారు. అప్పులు, బకాయిల వివరాలు

మిగతా 11వ పేజీలో...

'నిప్పు' వెనుక నిజమిదేనా?!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఏకంగా నాడు 2.19 లక్షల ఎకరాలకు నిషేధ విముక్తి

అందులో అసైన్డ్ 1.82 లక్షల ఎకరాలు.. చుక్కల భూములు 26,465 ఎకరాలు

నిషేధ విముక్తిలో అన్నమయ్య జిల్లా టాప్.. మొత్తం 98,978 ఎకరాలకు విముక్తి

సగం మదనపల్లె సబ్ డివిజన్‌లోనే.. భారీగా మింగేసిన పెద్దిరెడ్డి, అనుచరులు

జగన్ ఓటమితో షాక్.. ఆఫీస్‌కు నిప్పు.. సిసోడియా విచారణలో గుట్టు రట్టు

12

ఢిల్లీలో మాధవరెడ్డి?

వైసీపీ పెద్దల రక్షణలో

ఫైళ్ల దహనం నిందితుడు!

వైసీపీ పోలీసుల అండతోనే పరార్



అసెంబ్లీపై అలిగిన జగన్

ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేదాకా రాను

బయట మీడియాతోనే మాట్లాడతా!

పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి మంచోళ్లు

వాళ్లను అభాసుపాలు చేస్తున్నారు

మీడియాతో వైఎస్ జగన్

'మదనపల్లె'ది ప్రమాదమే అని సూత్రీకరణ

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీపై అలకబూనారు! 'నాకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేదాకా సభకు వచ్చేది లేదు' అని స్పష్టం చేశారు. అసెంబ్లీ జరిగినన్ని రోజులు... అదే సమయంలో బయట మీడియాతో మాట్లాడతానని తెలిపారు. శుక్రవారం ఆయన తాడేపల్లి ప్యాలెస్‌లో విలేకరులతో మాట్లాడారు. "ప్రతిపక్ష నేత హోదా ఇస్తే ముఖ్యమంత్రి ఎంత సమయం మాట్లాడితే.. అంతే సమయం నాకూ ఇవ్వాల్సి వస్తుంది. ప్రతిపక్షనేతగా నేను చేయి ఎత్తితే వెంటనే స్పీకర్

మిగతా 11వ పేజీలో...

ఆరు నెలల కిందట..

అవన్నీ నిజాలే!

జగన్ వ్యాఖ్యలపై జనం చురకలు

విపక్షంలోకి రాగానే 'అరాచక' మాటలు

ఐదేళ్ల గతం మరచి 'రివర్స్' వ్యాఖ్యలు

11

జగన్ పత్రికకు

జనం సొమ్ము

ఐదేళ్లలో రూ. 371 కోట్ల ప్రకటనలు

ఇతర పత్రికలన్నింటికీ కలిపి 488 కోట్లు

'ఆంధ్రజ్యోతి'కి పూర్తిగా నిలిపివేత

ప్రకటనల జారీలో పక్షపాత ధోరణి

శాసనసభ సాక్షిగా ప్రభుత్వం వెల్లడి

ఈ వ్యవహారంపై విచారణ చేయిస్తాం

అవసరమైతే సభా సంఘం ఏర్పాటు

మంత్రి పార్థసారథి వెల్లడి

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జగన్ తన సొంత పత్రికకు ఐదేళ్లపాటు జనం సొమ్మును దోచిపెట్టారు. గత ప్రభుత్వంలో 'సాక్షి' పత్రికకు ఏకంగా రూ.371 కోట్ల విలువైన ప్రకటనలు ఇచ్చారు. మిగిలిన అన్ని పత్రికలకూ కలిపి రూ.488 కోట్ల విలువైన ప్రకటనలు జారీ చేశారు. 'ఆంధ్రజ్యోతి'కి ఉద్దేశపూర్వకంగా ప్రకటనలు ఇవ్వలేదు. శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం గణాంకాలతో సహా ఈ వివరాలను వెల్లడించింది. గత ప్రభుత్వం ప్రకటనల జారీలో సర్క్యులేషన్‌ను ప్రాతిపదికగా తీసుకోలేదని, పక్షపాత ధోరణితోనే ప్రకటనలు జారీ చేసిందని తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేయిస్తామని, అవసరమైతే సభాసంఘాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. గత ప్రభుత్వంలో వార్తా పత్రికలకు ప్రకటనల జారీ అంశంలో పక్షపాత ధోరణిపై ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, బెందాళం అశోక్, తెనాలి శ్రవణ్ కుమార్‌లు అడిగిన ప్రశ్నలపై శుక్రవారం ప్రశ్నోత్తరాల

మిగతా 11వ పేజీలో...

వరద బాధిత కుటుంబాలకు

3,000 తక్షణ సాయం

25 కిలోల బియ్యం, కిలో చొప్పున నిత్యావసర సరుకుల పంపిణీ

నిబంధనలకన్నా ఎక్కువ పరిహారమే అందజేస్తాం

శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

బాధితులకు అండగా ఉండాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆదేశం

11



12

ఏపీకి అదనపు ఐపీఎస్‌లు

కేడర్ స్ట్రెంత్ పెంచిన కేంద్ర హోంశాఖ

144 నుంచి 174కు పెంపు

చంద్రబాబు విన్నపంపై కేంద్రం స్పందన

విభజన తర్వాత అదనపు కేటాయింపు ఇప్పుడే!

ఒలింపిక్స్‌పై కుట్ర

» ప్రారంభ వేడుకలకు ముందు ఐదు కీలక ప్రాంతాల్లో

పట్టాల ధ్వంసం.. రైల్వే కేబుళ్లు, సిగ్నల్ బాక్సులకు నిప్పు

ప్రపంచం నలుమూలల నుంచీ అత్యుత్తమ క్రీడాకారులందరూ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు పారిస్ మహానగరానికి వచ్చిన వేళ.. ఆ క్రీడా సంబరాల ప్రారంభానికి కొన్ని గంటల ముందు.. గుర్తు తెలియని వ్యక్తులు ఫ్రెంచ్ హైస్పీడ్ రైల్ (టీజీవీ) నెట్‌వర్క్‌పై వరుస దాడులు చేశారు. పారిస్ నగరాన్ని దేశంలోని నలు మూలలకూ అనుసంధానం చేసే ట్రాకులను లక్ష్యంగా చేసుకున్నారు. తెల్లవారితే శుక్రవారం అనగా రాత్రి ఒంటిగంట నుంచి తెల్లవారుజామున 5.30 గంటలవరకూ విధ్వంసం సృష్టించారు. కొన్నిచోట్ల పట్టాలను ధ్వంసం చేశారు. కొన్నిచోట్ల సిగ్నల్ బాక్సులకు నిప్పుపెట్టారు. కేబుళ్లను ముక్కలు ముక్కలు చేసి తగలబెట్టారు. ఈ

ఫ్రాన్స్‌లో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌పై దాడులు



దెబ్బతిన్న కేబుళ్లను సరిచేస్తున్న సిబ్బంది

అనూహ్యదాడులతో చాలా రైళ్లను రద్దు చేయాల్సి వచ్చిందని, కొన్ని రైళ్లను దారి మళ్లించామని ఫ్రాన్స్ రైల్వే వ్యవస్థ ఎస్ఎన్‌సీఎఫ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. "మా టీజీవీ నెట్‌వర్క్‌ను స్తంభింపజేసేందుకు పెద్ద ఎత్తున జరిపిన దాడి ఇది" అని పేర్కొంది. ముఖ్యంగా.. ఈ నెట్‌వర్క్‌లో అత్యంత కీలకమైన ఐదు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగినట్టు వివరించింది. ఈ ఐదు ప్రాంతాలూ పారిస్‌ను తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణాల్లో ఉన్న నాలుగు ప్రధాన నగరాలను కలిపే కీలకమైన స్ట్రాటజిక్ నెర్వ్ సెంటర్స్ అని వెల్లడించింది. పెద్ద సంఖ్యలో రైళ్ల రద్దుకావడం, దారి మళ్లడంతో పలు రైల్వే స్టేషన్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడిపోయాయి. అథ్లెట్లు, సాధారణ ప్రయాణికులు కలిపి.. 80 వేలమందికి పైగా ఈ అంతరాయంతో ఇబ్బంది పడ్డారు. కాగా.. ఈ దాడులపై దర్యాప్తు ప్రారంభించినట్టు అధికారులు తెలిపారు. దాడులు ఎవరి పని అనే విషయం ఇప్పటివరకూ తెలియనప్పటికీ.. వామపక్ష తీవ్రవాదులు, అరాచకవాదులే ఈ దాడులకు పాల్పడినట్టు నిఘా వర్గాలు తెలిపాయంటూ ఫ్రెంచ్ మీడియా కథనాలను ప్రచురించింది. అదే సమయంలో.. ఇది పర్యావరణ ఆందోళనకారుల పనేనన్న వాదనలూ వినిపిస్తున్నాయి. మరోవైపు.. ఉక్రెయిన్‌పై దాడికి పాల్పడినందుకు నిరసనగా రష్యాను ఈ ఒలింపిక్స్‌కు ఆహ్వానించలేదని, కాబట్టి ఈ దాడుల వెనుక పుతిన్ హస్తాన్నీ కొట్టిపారేయలేమని కొందరు భద్రతా నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఫుట్‌బాల్ మ్యాచులు సహా.. పలు ఈవెంట్లు పారిస్ నగరానికి ఆవల జరగనున్న నేపథ్యంలో అక్కడికి వెళ్లడానికి ఇప్పటికే రైలు టికెట్లు బుక్ చేసుకున్నవారి ప్రణాళికలు శని, ఆదివారాల్లో ఈ మార్గంలో తిరగాల్సిన రైళ్లలో నాలుగోవంతు రైళ్లను రద్దు చేశారు.

-సెంట్రల్ డెస్క్

లోకం తీరు



పదేళ్లలో తొలిసారి మీడియా పాయింట్‌కు కేసీఆర్

నీట్-యూజీ ఫలితాల ప్రకటన

» పాత టాపర్లలో 44 మందికి ఫుల్ మార్క్స్

న్యూఢిల్లీ, జూలై 26: వివాదాస్పదంగా మారిన నీట్-యూజీ పరీక్షల తుది ఫలితాలను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శుక్రవారం ప్రకటించింది. ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉండడంతో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఆ బిట్‌కు మార్కులు ఇచ్చినట్టు ఎన్‌టీఏ తెలిపింది. దాని ప్రకారం ర్యాంకులు రూపొందించింది. తొలుత ఫలితాలు ప్రకటించినప్పుడు 67మంది టాపర్లుగా గుర్తింపు పొందారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మూడోసారి ర్యాంకుల తుది జాబితాను రూపొందించగా వారిలో 44 మంది టాపర్లుగా నిలిచారు. అభ్యర్థుల 'రీ-రివైజ్డ్ స్కోర్ కార్డులు' సిద్ధంగా ఉన్నాయని ఎన్‌టీఏ తెలిపింది.

'కావడి యాత్ర పేర్ల'పై సుప్రీం స్టే కొనసాగింపు

న్యూఢిల్లీ, జూలై 26: కావడియాత్ర మార్గంలో హోటళ్ల యజమానులు తమ పేర్లను, సిబ్బంది పేర్లను ప్రదర్శించాలంటూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలపై ఇచ్చిన స్టే కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈనెల 22వ తేదీన ఈ అంశంలో సుప్రీంకోర్టు మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం విచారణ కొనసాగింది. హోటళ్ల యజమానులు ఎవరైనా స్వచ్ఛందంగా తమ పేర్లను ప్రదర్శించాలనుకుంటే ఆ పని చేయవచ్చని, కానీ, దీని కోసం ఎవరినీ బలవంతపెట్టవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వాలు, పిటిషన్‌దార్లు తమ వాదనలను సమర్పించాలని పేర్కొంటూ విచారణను ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది. కావడియాత్ర ఆగస్టు 6వ తేదీ వరకు కొనసాగనుంది.

దేశంలో 5 కోట్ల పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ, జూలై 26: దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో 5 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఓ లిఖితపూర్వక సమాధానం ద్వారా లోక్‌సభకు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 1.18 కోట్ల కేసులు, సుప్రీంకోర్టులో 84,045 కేసులు, వివిధ హైకోర్టుల్లో 60,11,678 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. తగినన్ని మౌలిక వసతులు, తగినంత మంది సిబ్బంది లేకపోవడం కూడా ఇందుకు కారణాలని తెలిపారు.

ప్రచారం కోసమే నాపై పరువు నష్టం కేసు: రాహుల్



సుల్తాన్‌పూర్‌లో ఓ చెప్పుల షాపులో రాహుల్

సుల్తాన్‌పూర్ (యూపీ), జూలై 26: పరువు నష్టం కేసులో విచారణ నిమిత్తం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం సుల్తాన్‌పూర్‌లోని ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ప్రస్తుత కేంద్ర హోం మంత్రి, అప్పటి బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ 2018లో రాహుల్‌పై స్థానిక బీజేపీ నాయకుడు విజయ్ మిశ్ర ఈ దావా వేశారు. ప్రత్యేక జడ్జి శుభం వర్మ ముందు హాజరైన రాహుల్ తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. ఎవరినీ కించపరిచేలా తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. చౌకబారు ప్రచారం కోసమే ఈ దావా వేశారని ఆరోపించారు. వాదనలు విన్న జడ్జి తదుపరి విచారణను వచ్చే నెల 12కు వాయిదా వేశారు. కోర్టు నుంచి తిరిగి లఖ్‌నవూ వెళ్తూ దారిలో ఓ చెప్పులు కుట్టే షాపు దగ్గర రాహుల్ ఆగారు. షాపు యజమాని రాం చేట్ రాహుల్‌కు కూల్‌డ్రింక్ ఇచ్చారు. రాహుల్ అక్కడ అరగంట సేపు ఉన్నారు. కాగా, విపక్ష నేత రాహుల్‌గాంధీకి ఢిల్లీలోని సునేహ్రీబాగ్ మార్గంలో 5వ నంబరు బంగ్లాను లోక్‌సభ హౌస్ కమిటీ కేటాయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

గూగుల్‌కు పోటీగా.. ఓపెన్ ఏఐ 'సెర్చ్ జీపీటీ'

న్యూయార్క్, జూలై 26: సెర్చింజన్ అనగానే ప్రపంచంలో 99.9 శాతం మందికి మొదట గుర్తొచ్చే పేరు.. గూగుల్! దాని ధాటికి మైక్రోసాఫ్ట్ కూడా తట్టుకోలేకపోయింది. కానీ.. ఇప్పుడు దానికో సవాల్ ఎదురవుతోంది. చాట్ జీపీటీ పేరుతో కృత్రిమ మేధను సామాన్యులకూ అందుబాటులోకి తెచ్చిన ఓపెన్ ఏఐ సంస్థ గూగుల్‌కు పోటీగా అత్యంత శక్తిమంతమైన కృత్రిమ మేధ సెర్చింజన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. దాని పేరు.. సెర్చ్ జీపీటీ. ప్రస్తుతానికి ఇది టెస్టింగ్ దశలో ఉంది. ఇది చాట్‌జీపీటీకి, చాట్‌బాట్‌కు అనుసంధానమై పనిచేస్తుందని సమాచారం.

రైల్వే లెవల్ క్రాసింగ్ మధ్యలో స్కూల్ బస్సు

» లోకో అప్రమత్తతతో 40 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు

నాగ్‌పూర్, జూలై 26: రైలు లోకో పైలెట్ సమయానికి బ్రేకులు వేయడంతో నాగ్‌పూర్‌లో ఓ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం త్రుటిలో ముప్పు తప్పింది. నాగ్‌పూర్‌లోని ఓ లెవల్ క్రాసింగ్ దగ్గర గురువారం సాయంత్రం 4 గంటలకు రెడ్ సిగ్నల్ కనిపిస్తున్నా స్కూల్ బస్ డ్రైవర్ ఆపకుండా ముందుకు వెళ్లాడు. బస్సు రైలు పట్టాలపైకి వెళ్లాక రెండు వైపులా గేట్లు మూసుకున్నాయి. ఛింద్వారా నుంచి నాగ్‌పూర్‌లోని ఇట్వారి వెళుతోన్న ప్యాసింజర్ రైలు అప్పుడే వస్తోంది. దీంతో చుట్టుపక్కల ఉన్న జనం తక్షణం స్పందించి రైలు పట్టాలపైకి చేరుకుని లోకో పైలెట్‌ను అప్రమత్తం చేశారు. రైల్వే గేటు కాపలాదారు రైల్వే అధికారులను వాకీటాకీ ద్వారా అప్రమత్తం చేశారు. పట్టాలపై జనాన్ని చూసిన లోకోపైలెట్ బ్రేకులు వేసి సరిగ్గా లెవల్ క్రాసింగ్‌కు ముందు రైలును ఆపారు. ఆ వెంటనే స్కూల్ బస్సును పట్టాలపై నుంచి సురక్షితంగా అవతలకు పంపించారు.

పాక్ ఆట కట్టిస్తాం

గతం నుంచి అది ఏమీ నేర్చుకోలేదు

» ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్వరం

» కార్గిల్ యుద్ధ విజయ్ దివస్‌కు పాతికేళ్లు

» ద్రాస్‌లో సైనికులతో గడిపిన ప్రధాని

» కార్గిల్ అమరులకు సీడీఎస్ నివాళులు



కార్గిల్ యుద్ధస్మారకం వద్ద మోదీ



కార్గిల్ అమరవీరుడి ఫొటోను ముద్దాడుతున్న సైనికుడి తల్లి

ద్రాస్ (లద్దాఖ్), జూలై 26 : దాయాది పాకిస్తాన్ ఉగ్ర కుట్రలను సైన్యం తిప్పికొడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. "ఉగ్రవాద ఘాతుకాలు, దొంగ యుద్ధాలతో కవ్వింపు చర్యలకు పాకిస్తాన్ పాల్పడుతూనే ఉంది. దాని ఆట కట్టిస్తాం. ముష్కరుల దుశ్చర్యలను అణచివేస్తాం" అంటూ తీవ్ర స్వరం వినిపించారు. భారత వీర జవాన్ల శౌర్యానికి ప్రతీకగా నిలిచిన కార్గిల్ యుద్ధానికి నేటితో పాతికేళ్లు. విజయ్‌దివస్‌గా ఈ సందర్భాన్ని భారతావని శుక్రవారం ఘనంగా జరుపుకొంది. ఆ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన అమర జవాన్లకు, ఆ యుద్ధం జరిగిన కార్గిల్ ప్రాంతంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాళులు అర్పించారు. విధుల్లో ఉన్న సైనికులతో కలిసి విజయ్‌దివస్‌ను జరుపుకొన్నారు. అక్కడ ఏర్పాటుచేసిన కార్గిల్ యుద్ధ స్మారకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌కు మోదీ గట్టి హెచ్చరిక చేశారు. జమ్మును కేంద్రం చేసుకుని గత నెల రోజుల్లోనే ఉగ్రవాదులు ఆరుకు పైగా భారీ దాడులు చేశారు. ఈ నేపథ్యంలో మోదీ తీవ్రంగా స్పందించారు. "పాక్ చరిత్ర అంతా ఓటములతో నిండిపోయింది. అయినా ఇప్పటికీ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. వారి నీచ ఉద్దేశ్యాలు ఏనాటికీ నెరవేరవు. ఉగ్రవాద పోషకులు కూడా వినగలిగే చోటులో నిలబడి నేను ఈ మాట చెబుతున్నాను" అని హెచ్చరించారు. అసత్య కథనాలు, ఉగ్రవాద ఉన్మాదంపై సత్యం సాధించిన విజయమే కార్గిల్ యుద్ధమని మోదీ అభివర్ణించారు. కార్గిల్‌లో భారత్ యుద్ధాన్ని మాత్రమే గెలవలేదని, తిరుగులేని తన సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, అసాధారణ రీతిలో సత్యాన్ని ఆవిష్కరించిందని మోదీ అన్నారు. కాగా, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్.. కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాలు వృథా కాబోవన్నారు. కాగా, పార్లమెంటులో సభ్యులు కార్గిల్ అమరవీరుల కోసం మౌనం పాటించారు. వారి మహోన్నత త్యాగాలకు దేశం రుణపడి ఉంటుందని రాహుల్‌గాంధీ అన్నారు.

అగ్ని వీరులకు ఉద్యోగాలు

ప్రధాని మోదీ అభిలాష మేరకు అగ్నివీరులుగా పనిచేసి వచ్చిన వారికి పోలీసు, ప్రాదేశిక సైనిక దళాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తాజాగా బీజేపీ పాలిత ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ప్రకటించాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా సైతం అగ్నివీరులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి. హరియాణా ఇదివరకే ఈ తరహా ప్రకటన చేసింది.

అగ్నిపథ్.. గొప్ప సంస్కరణ

అగ్నిపథ్ పథకంపై విపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రధాన మంత్రి మోదీ తిప్పికొట్టారు. జవాన్లను యుద్ధ సన్నద్ధులను చేయడానికి ఈ పథకం ఎంతగానో తోడ్పడిందన్నారు. యువసేనగా ఆర్మీని మార్చాలని దశాబ్దాలుగా పార్లమెంటులో, వివిధ కమిటీల్లో జరుగుతున్న చర్చలు అగ్నిపథ్ రూపంలో సాకారం అయ్యాయన్నారు. ఆర్మీలో సేవలు అందిస్తున్న జవాను వయసు ప్రపంచవ్యాప్త వయోసగటుతో పోల్చితే భారత్‌లోనే నిన్నటివరకు అధికంగా ఉండేదని గుర్తు చేశారు. ఎంతగానో బాధిస్తున్న ఈ సమస్యను గుర్తించి, దానిపై ముఖ్యమైన సంస్కరణను సైన్యం చేపట్టిందన్నారు. అయినా, జాతీయ భద్రతతో ముడిపడిన ఇటువంటి సున్నితమైన అంశంపైనా కొందరు రాజకీయం చేస్తున్నారని, స్వప్రయోజన కాంక్షతో అబద్ధాలు వల్లిస్తున్నారని మోదీ మండిపడ్డారు. కాగా, అగ్నిపథ్‌పై మోదీ వ్యాఖ్యలను విపక్షాలు తప్పుబట్టారు. కార్గిల్ విజయ దివస్ నాడు కూడా మోదీ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. ఆర్మీ కోరితేనే కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని అమలు చేస్తోందన్న రీతిలో మోదీ వ్యాఖ్యలు ఉన్నాయని, ఇది పచ్చి అబద్ధమన్నారు. శౌర్య జవానులకిది మరిచిపోలేని అవమానమని మండిడ్డారు. ఈ పథకాన్ని రద్దు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. అగ్నిపథ్‌ను సైన్యానికి తెలియకుండా హఠాత్తుగా కేంద్రం ప్రవేశపెట్టిందని కాంగ్రెస్‌కు చెందిన మరో నేత జైరామ్ రమేశ్ విమర్శించారు. ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ఈ పథకాన్ని ఏకపక్షంగా తెచ్చారని అదే పార్టీకి చెందిన ఎంపీ వివేక్ టంఖా అన్నారు.

ఏనుగుల దాడుల్లో 2,853 మంది మృతి

గడిచిన ఐదేళ్ల గణాంకాల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 26: ఏనుగుల దాడుల వల్ల గత ఐదేళ్ల కాలంలో 2,853 మంది మృత్యువాత పడినట్లు ప్రభుత్వ గణాంకాలు పేర్కొన్నాయి. ఈ ఐదేళ్లలో అత్యధికంగా 2023 సంవత్సరంలో 628 మంది చనిపోయారు. 2019లో 587 మంది, 2020లో 471 మంది, 2021లో 557 మంది, 2022 లో 610 మంది, 2023లో 628 మంది మృతికి ఏనుగులు కారణమైనట్టు కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. ఐదేళ్లకాలంలో ఒడిశాలో 624 మంది మృత్యువాత పడగా.. ఝార్ఖండ్‌లో 474 మంది, బెంగాల్‌లో 436 మంది, అసోంలో 383 మంది, ఛత్తీస్‌గఢ్‌లో 303 మంది, తమిళనాడులో 256 మంది, కర్ణాటకలో 160 మంది, కేరళలో 124 మంది చనిపోయారని గణాంకాలు చెబుతున్నాయి.

ఐదేళ్లలో 628 పులుల మృత్యువాత

గత ఐదేళ్ల కాలంలో దేశంలో 628 పులులు మృత్యువాత పడినట్టు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. వేటాడటంతో సహా సహజ, ఇతర కారణాల వల్ల ఈ మరణాలు సంభవించాయి. అలాగే ఇదే కాలంలో పులుల దాడుల వల్ల 349 మంది మరణించారు. ఇందులో ఒక్క మహారాష్ట్రలోనే 200 మరణాలు నమోదయ్యాయి. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ప్రకారం.. 2019లో 96, 2020లో 106, 2021లో 127, 2022లో 121, 2023లో 178 పులులు మరణించాయి. 2012 నుంచి చూస్తే 2023లో అత్యధికంగా పులులు మృత్యువాతపడ్డాయి. కాగా 2019, 2020లో 49 మంది చొప్పున, 2021లో 59 మంది, 2022లో 110 మంది, 2023లో 82 మంది పులుల దాడుల్లో మృతి చెందారని కీర్తి వర్ధన్ సింగ్ గురువారం రాజ్యసభలో తెలిపారు.

'బెంగాల్ విభజన'పై రాజకీయ రగడ

» నీతి ఆయోగ్ సమావేశంలో ప్రస్తావిస్తాం: మమత

» ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్

» నేడు నీతి ఆయోగ్ భేటీ



న్యూఢిల్లీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): బెంగాల్ విభజనపై నీతిఆయోగ్ సమావేశంలో ప్రస్తావిస్తానని.. దాన్ని ప్రతిఘటిస్తానని మమత ప్రకటించారు. శనివారం జరగనున్న ఈ భేటీలో పాల్గొనేందుకు శుక్రవారం ఢిల్లీకి చేరుకున్న మమత.. మీడియాతో మాట్లాడారు. నీతి ఆయోగ్‌ను రద్దు చేసి, ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర భాగాన్ని ఈశాన్య రాష్ట్రాల్లో కలపాలంటూ బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సుకాంత్ మజుందార్ ప్రధాని మోదీకి ప్రతిపాదన చేయడం రాజకీయంగా కలకలం రేపుతోంది. ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి కూడా అయిన మజుందార్.. ఉత్తర బెంగాల్‌ను ఈశాన్య భారతంలో కలిపితే కేంద్రం నుంచి అధిక నిధులు వస్తాయని, అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికీ అభ్యంతరం ఉంటుందని తాను భావించడం లేదన్నారు. తన ప్రతిపాదనపై మోదీ దృష్టిసారిస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. ఢిల్లీ నుంచి ఈ మేరకు ఆయన వీడియో ప్రకటన విడుదల చేశారు. అయితే, మంజుదార్ సూచనపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ విభజన అంటే దేశ విభజనే అని మండిపడ్డారు. కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు చేస్తున్న ఈ ప్రయత్నాలను శనివారం ప్రధాని ఆధ్వర్యంలో జరిగే నీతీ ఆయోగ్ సమావేశంలో నిలదీస్తానని తెలిపారు. ఒకవేళ పట్టించుకోకుంటే సమావేశం నుంచి వాకౌట్ చేస్తానని హెచ్చరించారు. "బడ్జెట్‌లో మా రాష్ట్రంపై ఆర్థిక వివక్ష చూపారు. ఇప్పుడు భౌగోళికంగానూ విభజన చేయాలని చూస్తున్నారు. పార్లమెంటు జరుగుతుండగానే కేంద్ర మంత్రి ప్రతిపాదన చేశారు. దీనిని సహించేది లేదు. బెంగాల్‌తో పాటు బిహార్, జార్ఖండ్, అసోంలను విభజిస్తామంటూ ఒక్కో నాయకుడు ఒక్కోలా మాట్లాడుతున్నారు" అని మమత వ్యాఖ్యానించారు. కాగా.. ఉత్తర బెంగాల్‌లో బీజేపీకి పట్టు ఎక్కువ. ఇటీవలి ఎన్నికల్లో కూచ్‌బెహార్ తప్ప ఇక్కడి అన్ని ఎంపీ సీట్లనూ ఆ పార్టీనే గెలుచుకుంది. టీఎంసీకి మాత్రం దక్షిణ బెంగాల్‌లో గట్టి పట్టు ఉంది. అందుకే బీజేపీ 'ఉత్తర బెంగాల్' అంశాన్ని తెరపైకి తెస్తోందనే అభిప్రాయం వినిపిస్తోంది.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

» భద్రాచలం, పాపికొండలు, పోలవరం స్పిల్‌వే, రాజమహేంద్రవరం, కోనసీమలో ఉధృతంగానే

» ఇప్పటికే 743 టీఎంసీల నీరు సముద్రం పాలు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి), పోలవరం, జూలై 26: ఎగువ భాగంలో ఓ మోస్తరు వర్షాలు పడడంతో గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. ప్రస్తుతం గోదావరి జిల్లాల్లో వర్షాలు లేవు. కానీ బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల మూడు రోజులపాటు ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు హెచ్చరిక ఉంది. అయితే వచ్చిన వరద వచ్చిన వరద వచ్చినట్టు సముద్రంలోకి వెళ్లిపోతే గోదావరి జిల్లాలకు పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ రోజుల తరబడి నీరు నిలవడం వల్ల లంకల్లోని గ్రామాలతోపాటు, స్లూయిజ్‌ల నుంచి నీరు వెనక్కి రావడంతో డ్రైన్లు పొంగుతున్నాయి. ఈ పరిస్థితి వల్ల పొలాలు, ఊళ్లు మునిగిపోతున్నాయి. ఏజెన్సీ, లంక గ్రామాల్లోని నివాస ప్రాంతాలు నీటిలో నానిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్లు కూడా కూలిపోయే ప్రమాదం ఉంది. పశువుల మేత కొరత ఏర్పడుతోంది. 22న ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. అప్పటికే భద్రాచలం వద్ద మొదటి హెచ్చరిక అమలులో ఉంది. తర్వాత రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినా.. వరద తగ్గుముఖం పట్టాక ఉపసంహరించారు. ఇప్పుడు మళ్లీ వరద పెరగడంతో ప్రస్తుతం భద్రాచలం, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరికకు దగ్గరగా ఉంది. ఇక కోనసీమలోనూ లంకలన్నీ నీళ్లలో ఉండిపోవడంతో అక్కడ జీవనం కష్టమైంది. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజి నుంచి జూన్ 1నుంచి ఇప్పటివరకూ 743 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లింది. పోలవరం కడితే చాలా వరకూ నీటిని నిల్వ చేయవచ్చు. శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటి మట్టం 13.60 అడుగులు ఉండగా, 12,52,949 క్యూసెక్కులు సముద్రంలోకి పోతోంది. గోదావరి పాండ్ లెవల్ 14.81 మీటర్లతో నిండుకుండలా ఉంది.



పట్టిసీమ నుంచి 3,540 క్యూసెక్కులు విడుదల

ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడికాల్వకు శుక్రవారం 3,540 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్టు పట్టిసీమ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు. పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగి 23.877 మీటర్లకు చేరుకుంది. వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 11,06,947 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఈఈ మల్లిఖార్జునరావు, డీఈ మాధవరావు తెలిపారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం, జూలై 26: శ్రీశైలం జలాశయానికి శుక్రవారం భారీగా వరద కొనసాగింది. సాయంత్రం 6 గంటలకు 2,11,208 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత 861.00 అడుగులుగా ఉంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 109.0060 టీఎంసీలుగా నమోదైంది. ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 35,315క్యూసెక్కులు, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 9,921 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేశారు.

అక్రమాల అధికారికి అందలం?!

» వైసీపీ నేతలతో అంటకాగిన ప్రతాప్‌రెడ్డికి మరో కీలక పదవి

» డిప్యుటేషన్ పొడిగించి పదోన్నతి కల్పించేందుకు ప్రయత్నాలు

» వైసీపీకి చేసిన సేవలకేనా అని పరిశ్రమల శాఖలో విస్మయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నాయకులతో అంటకాగుతూ పరిశ్రమల శాఖలో అనేక అక్రమాలకు పాల్పడుతున్న ఓ అధికారికి కూటమి ప్రభుత్వం మరో వరమాల వేయనుంది. సదరు అధికారి డిప్యుటేషన్‌ను పొడిగించడంతోపాటు పదోన్నతి కూడా కల్పించేందుకు ఫైల్ కదులుతున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి రెండు, మూడు కీలక స్థానాల్లో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన కొత్త ప్రభుత్వంలోనూ చక్రం తిప్పేందుకు సిద్ధమవుతున్నారు. 2019 ఎన్నికల్లోనూ, ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా వైసీపీకి చేసిన సేవలకు గుర్తింపునిస్తూ.. ఆ అధికారికి ఓ మంత్రి మద్దతుగా నిలిచి పని పూర్తిచేస్తున్నారు. తెలంగాణలో పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పి.ప్రతాప్‌రెడ్డి రాష్ట్ర విభజనకు ముందునుంచే వైసీపీ నేతలతో టచ్‌లో ఉండేవారు. 2019 ఎన్నికల్లో ఆయన ఏపీలోనే తిష్ట వేసుకుని ఆ పార్టీ విజయానికి కృషి చేసినట్లు వార్తలొచ్చాయి. ఈ సేవలను గుర్తించిన వైసీపీ నాయకులు.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. ప్రతాప్‌రెడ్డిని డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వం ఆయన్ను ఏపీఐఐసీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించింది. ఏపీఐఐసీ 8వ అంతస్థులో అద్దాలతో ఇంటీరియర్ డెకరేషన్ చేయించి ఏకంగా రూ.12కోట్ల బిల్లులు డ్రా చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. ఆయన వ్యవహార శైలిపై నిరసన వ్యక్తం చేస్తూ ఆయనను తొలగించాలంటూ అప్పట్లో సంస్థ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఇది వివాదంగా మారడంతో అప్పటి ఏపీఐఐసీ ఎండీ ఒక మెమో జారీచేసి ప్రతాప్‌రెడ్డిని విధుల నుంచి తొలగించారు. తర్వాత ప్రభుత్వ పెద్దల వద్ద తనకున్న పలుకుబడిని ఉపయోగించుకొని చక్రం తిప్పడంతో ప్రతాప్‌రెడ్డిని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్(ఏపీటీపీసీ) వైస్ చైర్మన్, ఎండీగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టేనాటికి ఏపీటీపీసీలో రూ.40 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉండగా.. వాటిని ఇష్టానుసారం దుర్వినియోగం చేసేశారని, ఇప్పుడు ఉద్యోగుల జీతాలకు కూడా డబ్బుల్లేని పరిస్థితికి తీసుకువచ్చారని చెబుతున్నారు. ఇదికాకుండా రామాయపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా ప్రతాప్‌రెడ్డినే వైసీపీ ప్రభుత్వం నియమించింది. అక్కడా ఆయన అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం ప్రతాప్‌రెడ్డి తెరవెనుక విశేషంగా కృషి చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ప్రతాప్‌రెడ్డి పని అయిపోయిందని అందరూ భావించారు. ఆయన డిప్యుటేషన్ పీరియడ్ కూడా పూర్తికావడంతో తిరిగి తెలంగాణకు వెళ్లిపోతారని అనుకున్నారు. కానీ అందుకు భిన్నంగా కొత్త ప్రభుత్వం ఆయన్ను ఇంకా అందలమెక్కించింది. ఇప్పటికే ఏపీటీపీసీ ఎండీగా, రామాయపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవోగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన్ను.. ఇటీవలే మచిలీపట్నం పోర్టు డైరెక్టర్‌గా కూడా నియమించింది. ఈ స్థానంలో ఉన్న దయాసాగర్‌ను బదిలీ చేసి మరీ ప్రతాప్‌రెడ్డిని నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రతాప్‌రెడ్డి డిప్యుటేషన్‌పై వచ్చి ఐదేళ్లు పూర్తయింది. దీంతో ఆయనను తెలంగాణకు పంపించాలని పరిశ్రమల శాఖ ఇటీవలే ప్రభుత్వానికి లేఖ రాసింది. అయితే ఆయన డిప్యుటేషన్‌ను మరో రెండేళ్లపాటు పొడిగించి ఇక్కడే కొనసాగించేందుకు అధికార పార్టీకి చెందిన ఓ మంత్రి, కొంతమంది నాయకులు తెర వెనుక పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయనకు ఎక్స్‌టెన్షన్ రావచ్చని భావిస్తున్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

» ద్రోణి ప్రభావంతో కోస్తా, సీమల్లో వర్షాలు

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండు రోజుల్లో పశ్చిమ వాయవ్యంగా పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ మీదుగా పయనించనుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే దీని ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండబోదని వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. కాగా దక్షిణ ఒడిశా మీదుగా తూర్పు, పడమరగా కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావంతో శుక్రవారం కోస్తాలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా, రాయలసీమలో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

ముంబైలో రికార్డు స్థాయి వర్షపాతం

ముంబైను వర్షాలు ముంచెత్తుతున్నాయి. జూలై 1నుంచి గురువారం వరకు ముంబైలో అసాధారణంగా 1,543.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. నెలాఖరులోగా మరికొన్ని రోజులు అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఏపీకి 7.5 టీఎంసీల కృష్ణా జలాలు

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఆంధ్రప్రదేశ్ 7.5 టీఎంసీల నీటిని వాడుకునేందుకు సహకరించాలని సీఆర్‌పీఎఫ్ ఆఫీసర్ కమాండెంట్‌ను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం కేఆర్ఎంబీ సూపరింటెండింగ్ ఇంజనీరు వరలక్ష్మి దేవి సీఆర్‌పీఎఫ్ కమాండెంట్‌కు లేఖ రాశారు. రోజుకు 5,500 క్యూసెక్కుల జలాలను నుంచి విడిచిపెట్టేలా సహకరించాలని, ఈ విషయంలో ఏపీ అధికారులకు సహకరించాలని స్పష్టంచేశారు.

ఏపీకి 6 ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు స్కిల్ సెంటర్లు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ఆరు నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు స్కిల్ సెంటర్లు (ఎన్ఈఎల్ఎస్ఎస్‌సీ) మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. శ్రీవేంకటేశ్వర, ఆంధ్ర, గుంటూరు, రంగరాయ, సిద్ధార్థ, ఎయిమ్స్ మెడికల్ కళాశాలలకు నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు స్కిల్ సెంటర్లను మంజూరు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 120 లైఫ్ సపోర్టు స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

పంచాయతీల్లో బ్లీచింగ్‌కూ డబ్బుల్లేవు



పారిశుద్ధ్య కార్మికులు 23 వేల మందికి జీతాలు 103 కోట్లు పెండింగ్

- నిధుల్లో అవకతవకలనేకం, దారి మళ్లింపు
- శ్వేత పత్రం విడుదల చేయాలని భావిస్తున్నాం
- ఎన్నికల నిర్వహణలో రెండున్నరేళ్లకు పైగా ఆలస్యం
- పీఎఫ్ఎంఎస్‌తో అనుసంధానంలోనూ నిర్లక్ష్యం
- అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'పంచాయతీలకు భారీగా నిధులున్నట్లు ఖాతాల్లో డబ్బులు కనిపిస్తున్నాయి. అయితే బ్లీచింగ్ పౌడర్ కొనేందుకు కూడా వాటిని డ్రా చేసుకోలేని పరిస్థితి' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 14, 15 ఆర్థిక సంఘాల నిధుల గురించి ఎమ్మెల్యేలు కూన రవికుమార్, చింతమనేని ప్రభాకర్, బీఎన్ విజయ్‌కుమార్, గొండు శంకర్, గౌరు చరితారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'గత ప్రభుత్వం నుంచి ఆర్థిక దుర్నిర్వహణ మాకు వారసత్వంగా వచ్చింది. ఇది చాలా ప్రతికూలంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ నిధుల విషయంలో అనేక అవకతవకలు జరిగాయి. దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆలోచిస్తున్నాం. 14, 15 ఆర్థిక సంఘాల నుంచి ఏపీకి రూ.8,283 కోట్లు వచ్చాయి. కేంద్రం నుంచి సకాలంలో నిధులు వచ్చినా, వైసీపీ ప్రభుత్వం తన వాటా విడుదలలో జాప్యం చేసింది. సకాలంలో నిధులు ఇవ్వకపోవడం వల్ల 23,000 మంది పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు రూ.103 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా రూ.2,281 కోట్లను నేరుగా డిస్కంలకు చెల్లించారు. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా రెండు సంవత్సరాల ఏడు నెలలు ఆలస్యం చేశారు. కేంద్రానికి గ్రాంట్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లను ఇవ్వడంలోనూ ఆలస్యం చేశారు. ఆర్థిక సంఘం నిధుల కోసం పంచాయతీలను పీఎఫ్ఎంఎస్‌తో అనుసంధానం చేయకుండా నిర్లక్ష్యం చేసింది' అని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనాభాలో మార్పులు లేనప్పుడు కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో తేడా ఎందుకు వచ్చింది? అని ప్రశ్నించిన ఎమ్మెల్యే కూన రవికుమార్.. రాష్ట్రంలో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు.

మడ అడవుల విస్తీర్ణం పెంపునకు కృషి

- ఐదేళ్లలో 700 హెక్టార్లలో పెంచడమే లక్ష్యం: పవన్

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సహకారంతో 'మిష్టీ' ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో మడ అడవులు విస్తీర్ణం పెంచుతామని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. శుక్రవారం అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని అరణ్య భవన్‌లో అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... 'పర్యావరణంపై నాకు ప్రత్యేక అసక్తి ఉంది. ప్రకృతి సౌందర్యంతో పాటు జీవవైవిధ్యం, వన్యప్రాణులు, మడ అడవులను కాపాడాల్సిన అవసరముంది. వీటి విధ్వంసానికి పాల్పడితే పునరుద్ధరణకు శతాబ్దకాలం పడుతుంది. వచ్చే ఐదేళ్లలో 700 హెక్టార్లలో మడ అడవులను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మడకు చట్టపరమైన రక్షణ అవసరం. వీటిని కాపాడేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. స్వామినాథన్ ఫౌండేషన్ సహకారం తీసుకోవాలి. ప్రభుత్వ భూముల్లో మడ ఉంటే అటవీశాఖ పరిధిలోకి తేవాలి. గత ప్రభుత్వం 110 ఎకరాల మడ అడవుల్ని తొలగించి, గృహ నిర్మాణానికి కేటాయించింది. ఇలాంటివి సీఎంతో చర్చించి, మడ అడవుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. మడ అడవుల విస్తరణకు 50% నిధులు కేంద్రం ఇస్తుంది' అని పవన్ చెప్పారు.

కుంకీ ఏనుగులపై కర్ణాటకతో చర్చిస్తాం

చిత్తూరు, మన్యం జిల్లాల్లో ఏనుగులు పంటలను నాశనం చేయడం, జనవాసాల్లోకి రావడంపై పవన్ కల్యాణ్ అటవీ శాఖ అధికారులతో చర్చించారు. ఏనుగుల గుంపును తిరిగి అడవుల్లోకి పంపేందుకు కుంకీ ఏనుగుల కొరత ఉందని, అవి కర్ణాటకలో ఉన్నాయని అధికారులు చెప్పగా, కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి, కనీసం ఐదు కుంకీ ఏనుగులను తెప్పించేందుకు కృషి చేస్తామని పవన్ చెప్పారు.



మహనీయుల ఆదర్శాలను ఆచరించాలి

- మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు

న్యూఢిల్లీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అరవిందఘోష్ వంటి మహనీయుల ఆదర్శాలను ఆచరించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. ఢిల్లీలో 'అరవిందఘోష్- హిందీ ఔర్ వికసిత భారత్' అంశంపై జరుగుతున్న రెండు రోజుల సదస్సు ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. హిందీ భాష వికాసానికి, భారతీయ సంస్కృతి ప్రచారానికి విశ్వ హిందీ పరిషత్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా హరిబాబు 10 గ్రంథాలను ఆవిష్కరించారు. పలువురు హిందీ అధికారులను సత్కరించారు.

ఆరోగ్య శాఖలో ఆర్థిక ఉగ్రవాదం

- మంత్రి సత్యకుమార్

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య శాఖలో ఆర్థిక ఉగ్రవాదం చోటుచేసుకుందని ఆ శాఖ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలపై ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన స్పందిస్తూ... 'గత ప్రభుత్వం కేవలం అబద్ధపు ప్రచారం చేసింది. అన్ని చోట్లా రాజకీయ జోక్యం, నియామకాల్లో అవకతవకలే మిగిలాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను దారిమళ్లించారు. ఆరోగ్యశ్రీలో రూ.2,000 కోట్లకు పైగా బకాయిలు పెట్టారు. 17 వైద్య కళాశాలలు తీసుకుని పనులను నిర్లక్ష్యం చేశారు. నియామకాల నోటిఫికేషన్ ఇచ్చినా ప్రభుత్వ ఆసుపత్రులు అంటే డాక్టర్లు ముందుకు రాని దుస్థితి ఏర్పడింది' అని అన్నారు.

హుద్‌హుద్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై విచారణ: మంత్రి పార్థసారథి

విశాఖలో హుద్‌హుద్ తుపాను బాధితులకు నిర్మించిన ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై విచారణ చేస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి... 'అర్హుల జాబితాలను గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసింది. అనర్హులు ఆ ఇళ్లలో ఉంటే వారిని ఖాళీ చేయిస్తాం. 185 గృహాలను ఈ ఆగస్టులోగా లబ్ధిదారులకు ఇస్తాం. మిగిలినవి వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేస్తాం. ఇప్పటి వరకూ మొత్తం 3,685 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు' అని పేర్కొన్నారు. నిత్యావసర ధరలను ప్రతిరోజూ సమీక్షిస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఫైన్ రైస్, కందిపప్పు అమ్మకాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,153 కౌంటర్లను తెరిచామన్నారు. స్టీమ్ రైస్ కిలో రూ.49, ముడి బియ్యం కిలో రూ.48, కందిపప్పు కిలో రూ.160 చొప్పున విక్రయిస్తున్నామన్నారు.


రాజధాని పనులపై డ్రోన్!

- వీడియో కమ్ ఫొటోల చిత్రీకరణకు నిర్ణయం
- టెక్నికల్ కమిటీ తొలి క్షేత్ర స్థాయి పర్యటన
- రాజధానిలో రోడ్లు, భవనాలు, మెటీరియల్ పరిశీలన
- త్వరలో కాంట్రాక్టర్లతో సమావేశం

విజయవాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ ప్రాంతాన్ని డ్రోన్ ఫొటో కమ్ వీడియో చిత్రీకరణ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టెక్నికల్ కమిటీ నిర్ణయించింది. గత పుటేజీ, ప్రస్తుత పుటేజీ ఆధారంగా అధ్యయనం చేయాలని భావిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణ పనులను ఈ కమిటీ శుక్రవారం పరిశీలించింది. ప్రాథమిక అవగాహన కోసం .. పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ ఆనందరావు నేతృత్వంలోని ఇంజనీరింగ్ టెక్నికల్ కమిటీ రాజధాని ప్రాంతాన్ని జల్లెడ పట్టింది. కమిటీ ఏర్పడిన తొలి క్షేత్ర స్థాయి పర్యటన ఇది. ప్రాథమిక అవగాహన కోసం శుక్రవారం రాజధానిలో ఈ కమిటీ పరిశీలించింది. రాజధాని ప్రాంతంలో సీడ్ యాక్సెస్ రోడ్డు, ఎన్ 9, ఎన్ 4 రహదారులను పరిశీలించారు. మిగిలిన రహదారులు, అంతర్గత రహదారులను పరిశీలించటానికి ముళ్ల కంపలు ఉండటంతో సాధ్యం కాలేదు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు, అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలు, ఎన్‌జీఓ భవనాలు, గవర్నమెంట్ టైప్ 1, టైప్ 2 భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునే ప్రయత్నం చేశారు. శాశ్వత సచివాలయ నిర్మాణ భవనాలను సాంకేతిక బృందం ఆసాంతం పరిశీలించింది. మొత్తం ఐదు టవర్ల ప్రాంతాలకు వెళ్లి పరిశీలించింది. నీళ్లలో నాని ఉన్న టవర్ల భవనాలను పరిశీలించింది. కాంక్రీట్ పరంగా బాగానే ఉందని గుర్తించింది. కాంక్రీట్ లోపల ఉన్న స్టీల్, బయటకు వచ్చిన స్టీల్ తుప్పు పట్టిందా? దాని పరిస్థితి ఏవిధంగా ఉందన్నది ప్రాథమికంగా పరిశీలించారు. స్టీల్ సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు నిపుణులను పిలిపించి పరిశీలించేందుకు నిర్ణయించారు. ఇంతకుముందు కూడా చెన్నై ఐఐటీ, వరంగల్ ఎన్ఐటీ వంటి సంస్థలతో అధ్యయనం చేయించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. టెక్నికల్ కమిటీ ఏ సంస్థలతో పరిశీలించాలని సూచిస్తుందన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. పైపులైన్ల పనులను కూడా పరిశీలించారు. పైపులైన్లపై పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ బృందంతో నివేదిక తయారు చేయించాలని చైర్మన్ నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. మలి విడతగా కాంట్రాక్టు సంస్థలతో భేటీ అవ్వాలని టెక్నికల్ కమిటీ నిర్ణయించింది. కాంట్రాక్టు సంస్థలు ఎంత వరకు పనులు చేపట్టారు ? సమస్యలు ఏమిటన్నది వారి తో ప్రజంటేషన్స్ రూపంలో తెలుసుకుంటారు. అనంతరం ఏం చేయాలన్నదానిపై కమిటీ ముందుకు వెళుతుంది. మరో వారం రోజుల్లో టెక్నికల్ కమిటీ పూర్తి ప్రక్రియను చేపట్టి, ప్రభుత్వం నిర్దేశించిన నెల రోజుల లోపే నివేదికను ఇవ్వాలని భావిస్తోంది.

ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.1.5 కోట్ల విరాళం

తిరుమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు శుక్రవారం రూ.1.5 కోట్లు విరాళంగా అందాయి. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సత్యశ్రీనివాస్ (నేషనల్ స్టీల్స్ సీఎఫ్‌వో) ఈ విరాళాన్ని తిరుమలలో టీటీడీ ఈవో శ్యామలరావుకు అందజేశారు.



టీటీడీ ఈవోకు చెక్ అందజేస్తున్న సత్యశ్రీనివాస్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.





తిరుమల ఆలయం ముందు జస్టిస్ సుజాత, జస్టిస్ శివశంకర్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి ఎప్పటికి?

గాజా సంక్షోభం విషయంలో ఇక ఎంతమాత్రం మౌనంగా ఉండలేననీ, అక్కడి దయనీయమైన పరిస్థితులను చూస్తూ ఊరుకోలేనని అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ గురువారం వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఓ కఠినమైన, తీవ్రమైన ప్రసంగం చేసిన తరువాత, అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులతో భేటీ అయ్యారు. ఆయనతో చర్చల సందర్భంగా తాను వీలైనంతవెంటనే హమాస్‌తో కాల్పుల ఒప్పందానికి రావాల్సిందిగా సూచించానని, గాజాలో పెరుగుతున్న మరణాలపై ఆందోళన వ్యక్తంచేశానని కమల తెలియచేశారు. ఎట్టిపరిస్థితుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఖరారుచేసుకోవాలని గట్టిగా చెప్పానని ప్రకటించారు. నెతన్యాహూతో ఇలా చెప్పా, అలా అన్నా అంటూ ఆమె మీడియాముందు చేసిన వ్యాఖ్యలు నిజానికి ఆయనతో అన్నవాటికంటే తీవ్రంగా ఉన్నాయని కొందరు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా, గత తొమ్మిదినెలలుగా గాజాలో దయనీయమైన, అమానవీయమైన పరిస్థితులు చూస్తున్నామంటూ వాటి వర్ణనలు, వ్యాఖ్యలు తీవ్రంగా, లోతుగా ఉండటం విశేషం. డెమోక్రాటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ఆమె ఖరారుకావడం ఖాయమని ప్రచారం జరుగుతున్న తరుణంలో ఆమె వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఉంటుంది. హమాస్‌పై తమ పోరు కొనసాగుతుందని, దానిని పూర్తిగా తుడిచిపెట్టేవరకూ, తమకు తుదివిజయం లభించేవరకూ యుద్ధం ఆగదని అమెరికన్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి నెతన్యాహూ ఎంతో ఆవేశంగా ప్రసంగించిన విషయం తెలిసిందే.

యుద్ధానికి వెంటనే ముగింపుపలకాలని నెతన్యాహూతో భేటీకి ముందు మీడియాతో మాట్లాడుతూ డోనాల్డ్ ట్రంప్ కూడా అన్నారు. కానీ, ట్రంప్ కంటే కమలాహారిస్ మాటలు నెతన్యాహూ ప్రభుత్వాన్ని ఎక్కువగా కలవరపెట్టినట్టుగా కనిపిస్తోంది. గాజాలో ఘోరాలు జరిగిపోతున్నాయని ఆమె అనడం వల్ల శత్రువుకు అమెరికా–ఇజ్రాయెల్ మధ్య దూరం పెరిగిన సందేశం వెడుతుందని, బందీల విడుదల వెనకడుగువేసే ప్రమాదం ఉన్నదని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది. బైడెన్ ప్రభుత్వం అప్పుడప్పుడు ఇజ్రాయెల్‌ను తప్పుబడుతూ, హెచ్చరిస్తూ, మారణకాండమీద ఆందోళన వెలిబుచ్చుతూ దానికి అందించాల్సిన సాయాన్ని మాత్రం నిరంతరాయంగా అందిస్తున్న విషయం తెలిసిందే.

రేపు అమెరికాలో ఎవరు అధికారంలోకి వచ్చినా, ఇజ్రాయెల్ విషయంలో సమూలమైన విధానమార్పులు ఉంటాయన్న భ్రమలు అక్కరలేదు. నెతన్యాహూ అమెరికా ప్రయాణంలో ఉండగానే గాజాపట్టీ అన్నిదిక్కుల్లోనూ ఇజ్రాయెల్ దాడులుచేసింది. గతంలో అనేక రోజుల పాటు మారణహోమం సాగించి వదిలిపెట్టిన ఖాన్ యూనిస్ నగరంమీద ఇప్పుడు మళ్ళీ విరుచుకుపడుతోంది. గతంలో ఆస్పత్రులను సైతం ధ్వంసం చేసి, రోగులను సజీవంగా పాతిపెట్టిన ఈ నగరం మీద మరోమారు దాడిచేసి నలభైఎనిమిది గంటల్లోనే యాభైమందిని పొట్టనబెట్టుకుంది. హమాస్ ఉగ్రవాదులు కందకాల్లో దాక్కున్నారని, సాధారణ పౌరులతో కలగలసిపోయారని వాదిస్తూ సామాన్యులను ఊచకోతకోయడం ఇజ్రాయెల్ యథేచ్ఛగా కొనసాగిస్తున్నది. అమెరికా అండదండలు దండిగా ఉన్నందున అంతర్జాతీయ సంస్థలు, వేదికలకు అది వెరవడం లేదు. భద్రతామండలి తీర్మానాలంటే భయంలేదు. ఐక్యరాజ్యసమితి హెచ్చరించినప్పుడు, ఆవేదన వెలిబుచ్చినప్పుడు ఆ సంస్థ అధినేత ఉగ్రవాదులతో అంటకాగుతున్నారంటూ ఇజ్రాయెల్ అత్యంత కఠినమైన ప్రతివిమర్శలు చేస్తోంది. తనను ప్రశ్నించినవారంతా ప్రపంచశాంతికి శత్రువులు, ఉగ్రవాదానికి మిత్రులు అంటోంది. నలభైవేలమందిని చంపి, లక్షలమందిని తరిమివేసిన ఇజ్రాయెల్ వైఖరిని తప్పుబడుతూ, శరణార్థులు తలదాచుకున్న స్థావరాలమీద సైనికదాడులు ఆపాలని, ఆహారసరఫరాలను అనుమతించాలని అంతర్జాతీయ న్యాయస్థానం గతంలో వెలువరించిన తీర్పు కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దశాబ్దాలుగా పాలస్తీనాభూభాగాలను ఇజ్రాయెల్ ఆక్రమించుకొని ఉండటం చట్టవిరుద్ధం, దీనిని సాధ్యమైనంత వెంటనే సరిదిద్దాలి అంటూ అంతర్జాతీయ న్యాయస్థానం ఈనెల 19న వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ వీటిని బేఖాతరుచేయవచ్చునేమో కానీ, ప్రజాభిప్రాయం దానికి వ్యతిరేకంగా ఉన్నదనీ, గాజాదుస్థితిపట్ల ప్రపంచవ్యాప్తంగా సానుభూతి పెరుగుతున్నదని అన్ని దేశాలూ గుర్తించాలి. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలను ఉల్లంఘిస్తున్న ఇజ్రాయెల్‌ను దారికి తేవాల్సిన బాధ్యత ఐక్యరాజ్యసమితిమీద ఉన్నది. ప్రతీ సభ్యదేశం ఆ కర్తవ్యంలో భాగస్వామి కావలసిందే.

దగాపడిన పేదలు, యువకులు

సాధారణ జీవితంలో చాలా మంది వ్యవహార రీతులు లావాదేవీల సంబంధితంగా ఉండడం కద్దు. ఇద్దరు వ్యక్తుల మధ్య రెండు మానవ బృందాల మధ్య లావాదేవీల సంబంధమేమిటి? 'నేను ఆశిస్తున్నది మీరు ఇస్తే లేదా చేస్తే మీరు కోరింది నేను ఇస్తాను' అనేదే ఆ బంధం. దీన్నే వ్యవహారికంలో 'క్విడ్ ప్రొ కో' (ప్రతిఫల సిద్ధాంతం) అంటారు. అధికారిక నిర్ణయాలకు ముడుపులు చెల్లించడం ఇటువంటి లావాదేవీల వ్యవహారమే. ప్రశ్నపత్రాల లీకేజీ కూడా అంతే. ఈ తరహా ప్రవర్తనారీతుల స్థాయిని మోదీ ప్రభుత్వం పెంచింది. వాటిని బాగా ప్రోత్సహించింది. ఎన్నికల బాండ్లు ఇందుకొక ఉదాహరణ. వీటిని ఎందుకు కొనుగోలు చేశారు? ప్రభుత్వం తమకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలకు, తీసుకుబోయే నిర్ణయాలకు ప్రతిఫలంగానే కాదూ? ఎన్నికల బాండ్ల అసలు లక్ష్యం అందరికీ తెలుసు. సుప్రీంకోర్టు ఆలస్యంగానే అయినప్పటికీ ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దుచేయడం పూర్తిగా సరైన చర్యే అనడంలో సందేహం లేదు. అయితే ప్రభుత్వం ఆ పథకాన్ని ప్రవేశపెట్టడం వెనుక ఉన్న ఉద్దేశాలపై వ్యాఖ్యానించడలో బాగా సంయమనం పాటించింది.

జూలై 23, 2024న ఎన్డీఏ ప్రభుత్వం ఈ లావాదేవీల ప్రవర్తనను మరింత పై స్థాయికి తీసుకువెళ్లింది 2024–25 వార్షిక బడ్జెట్‌కు ప్రధాన ప్రేరణ 'ప్రభుత్వాన్ని ఎలా కాపాడుకోవాలి' అన్న ఆరాటమే సుమా! అది కుర్సీ బచావో బడ్జెట్. ఆ బడ్జెట్ రూపకర్త ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. ఆమె ఆ విధిని ఎలాంటి విచారభావానికి లోను కాకుండా నిర్వర్తించారు. బడ్జెట్‌పై ఆర్థికమంత్రి, ఆమె మంత్రిత్వ శాఖ కార్యదర్శులు ఇచ్చిన వివరణలను గమనిస్తే ప్రభుత్వ మనుగడకు రెండు మిత్రపక్షాల మద్దతును సాధించుకోవడానికి చేసిన ప్రయత్నమే బడ్జెట్ ప్రతిపాదనలు అని స్పష్టమవుతుంది. మోదీ మూడో ప్రభుత్వం ఏర్పాటుకు 16 మంది సభ్యులు ఉన్న తెలుగుదేశం పార్టీ, 12 మంది సభ్యులు ఉన్న జనతాదళ్ (యునైటెడ్) పార్టీల మద్దతుకు ప్రతిఫలంగా మోదీ సర్కార్ బిహార్‌కు పారిశ్రామిక కేంద్రాలు, కనెక్టివిటీ ప్రాజెక్టులు, విద్యుత్కేంద్రాలను మంజూరు చేసింది. ఇక ఆంధ్రప్రదేశ్‌కేమో పోలవరం పారిశ్రామిక కారిడార్‌లు, విద్యుత్కేంద్రాలు, పోలవరం ప్రాజెక్టుకు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు మంజూరు చేసేందుకు సర్కార్ సమ్మతించింది. బాహ్య ఆర్థిక సహాయాన్ని సత్వరమే సమకూర్చేందుకు లేదా 'ఏర్పాటు' చేస్తామనే వింత హామీ నొకదాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చారు. అయితే ఇదొక అసాధ్య హామీ.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

కేంద్ర ప్రభుత్వం, బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య క్విడ్ ప్రొ కొ మూలంగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసిన రాష్ట్రాలు భారీగా నష్టపోయాయి. ఆ రాష్ట్రాలు పశ్చిమబెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర పంజాబ్, ఢిల్లీ. ఆ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఎంపీలు అందరూ, బీజేపీకి ఓటు వేయని కారణంగా ఎన్డీఏ ప్రభుత్వం తమ రాష్ట్రాలకు ఎన్నడూ లేని రీతిలో దగా చేసిందని ఆక్రోశించారు.

దేశ జనాభాలో అత్యధికుల శ్రేయస్సు విషయమై అసలు శ్రద్ధే చూపలేదు. ఈ నిర్లక్ష్య వైఖరి మూలంగా యువత బాగా నష్టపోయింది. నిరుద్యోగిత ప్రబలిపోతోంది. యువజనులు నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. అఖిల భారత స్థాయిలో నిరుద్యోగిత రేటు జూన్ 2024లో 9.2 శాతంగా ఉందని సిఎమ్ఐఈ వెల్లడించింది. పట్టభద్రులలో 40 శాతం మంది నిరుద్యోగులే. ఉద్యోగులుగా ఉన్న వారిలో కేవలం 20.9 శాతం మంది మాత్రమే క్రమబద్ధంగా వేతనాలు పొందుతున్నారని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించింది. పెద్దగా చదువు సంధ్యలు లేనివారిలో చాలా తక్కువ మంది మాత్రమే నిరుద్యోగులుగా ఉండడం ఒక విచిత్ర విశేషం.



యువజనులు, పేద ప్రజల చేతిలో ఓటు అనే ఒక శక్తిమంతమైన ఆయుధం– ఉందనే వాస్తవాన్ని ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి గుర్తుంచుకోవాలి. 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వారు ఒక తీవ్ర హెచ్చరిక చేశారు. ఇటీవలి 13 ఉప ఎన్నికలలో దేశ పాలక పక్షానికి ఒక చెంపపెట్టు లాంటి తీర్పు నిచ్చారు. ఈ సంవత్సరాంతంలోగా మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జూలై 23, 2024న ఎన్డీఏ ప్రభుత్వం తమకు చేసిన దగాను యువజనులు, పేద ప్రజలు ఎట్టి పరిస్థితులలోను మరచిపోరు.

ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం ఉద్యోగ కల్పనకు ప్రోత్సాహకాల పథకంపై హామీ ఇచ్చింది. ఈ పథకం ప్రకారం యాజమాన్యాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం ద్వారా 290 లక్షల మందికి ఉద్యోగకల్పనకు ప్రభుత్వం హామీ పడుతుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మంది యువజనులకు నైపుణ్యాల శిక్షణ నిచ్చేందుకు, 500 కంపెనీలలో 1 కోటి మందికి ఇంటర్న్‌షిప్ (అనుభవం గడిచే ఉద్యోగం) సమకూర్చేందుకుగాను యాజమాన్యాలకు భారీ ఆర్థిక పోత్సాహకాలు ఇస్తామని ఆమె పేర్కొన్నారు. భారీగా ఉన్న ఈ అంకెలు అన్నీ మరో బ్రహ్మాండమైన ఎన్నికల అనంతర వంచనను సూచిస్తున్నాయి.

మరి కేంద్ర ప్రభుత్వంలోను, ప్రభుత్వ నియంత్రణ సంస్థలలోను 30 లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీ విషయమేమిటి? ఈ విషయాన్ని ఆర్థికమంత్రి గానీ, ప్రభుత్వంలోని వేరే వారు గాని అసలు ప్రస్తావించడమే లేదు. అలాగే ఉత్పాదకతను పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇచ్చే పథకం కింద వేల కోట్ల రూపాయలు వ్యయం చేశారు. అయినా చెప్పుకోదగిన ఫలితాలే లేవు. ఎందుకని? సరే, విద్యా రుణాల రద్దు విషయమేమిటి? విద్యాభ్యాసం కోసం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నానా అవస్థలు పడుతున్నారు. ఆ రుణాలను పూర్తిగానో, పాక్షికంగానో రద్దు చేయాలనే డిమాండ్ ఒకటి గట్టిగా ఉన్నది. దీనిపై ప్రభుత్వ నిర్ణయమేమిటో బడ్జెట్ వెల్లడించలేదు. ఒక సైనికుడికి, మరో సైనికుడికి మధ్య వివక్ష చూపుతున్న అగ్నిపథ్ పథకం భవిష్యత్తు విషయమై బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావనే లేదు.

యువజనులే కాదు, పేద ప్రజలు సైతం మోదీ ప్రభుత్వం తమను దగా చేసిందని భావిస్తున్నారు. దేశ జనాభాలో పేదలు 5 శాతం కంటే అధికంగా లేరని నీతి ఆయోగ్ సీఈఓ సెలవిచ్చారు. ఆ పెద్ద మనిషి అభిప్రాయంతో ఆర్థికమంత్రి కూడా ఏకీభవిస్తున్నట్టున్నారు ప్రభుత్వ కుటుంబ వినియోగ వ్యయ సర్వే దేశ ప్రజల నెలవారీ తలసరి వ్యయాన్ని ప్రస్తుత ధరల ప్రకారం లెక్క కట్టింది. నెలవారీ తలసరి వ్యయం గ్రామీణ ప్రాంతాలలో రూ.3,094 కాగా పట్టణ ప్రాంతాలలో రూ. 4,963గా ఉందని ఆ సర్వే వెల్లడించింది. అంటే 71 కోట్ల మంది భారతీయులు రోజుకు కేవలం రూ.100–150 వ్యయంతో జీవిస్తున్నారు. ఆ సర్వే వివరాలను మరింత నిశితంగా పరిశీలిస్తే మనం మరింత నైరాశ్యంలోకి జారిపోతాం. అట్టడుగున ఉన్న 20 శాతం మంది రోజుకు కేవలం రూ.70–100 వ్యయంతో జీవిస్తుండగా మరీ దిగువన ఉన్న 10 శాతం మంది కేవలం రూ.60–90 దినసరి వ్యయంతో బతుకులు ఈడుస్తున్నారు. వీరందరూ పేదలు కాదా? పేదలకు సహాయమందించేందుకు పలు మార్గాలు ఉన్నాయి. గ్రామీణ ఉపాధి హామీ పనులతో సహా అన్ని రకాల ఉద్యోగాలలోను కనీస దినసరి వేతనాన్ని రూ.400కి పెంచాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచితే విధిగా ఉపాధి కల్పించే కనీస పనిదినాల సంఖ్యను ఏడాదికి 50 నుంచి 100కు పెంచవచ్చు.

ఇతర పౌరులతో పాటు యువజనులు, పేద ప్రజల చేతిలో ఒక శక్తిమంతమైన ఆయుధం– ఓటు ఉందనే వాస్తవాన్ని ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి గుర్తుంచుకోవాలి. 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వారు ఒక తీవ్ర హెచ్చరిక చేశారు. వారే జూన్ 2024లో జరిగిన 13 ఉప ఎన్నికలలో దేశ పాలకపక్షానికి ఒక చెంపపెట్టు లాంటి తీర్పు నిచ్చారు. ఈ సంవత్సరాంతంలోగా మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది మరికొన్ని రాష్ట్రాలు కూడా అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్నాయి. జూలై 23, 2024న ఎన్డీఏ ప్రభుత్వం తమకు చేసిన దగాను యువజనులు, పేద ప్రజలు ఎట్టి పరిస్థితులలోను మరచిపోరు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

వయోవృద్ధుల అధికార లాలస

మాతృభూమితో పాటు నాకు బాగా తెలిసిన దేశం అమెరికా. నేను మొట్టమొదట ఆ దేశాన్ని 38 సంవత్సరాల క్రితం సందర్శించాను. ఆ తరువాత అనేక సార్లు ఆ దేశానికి వెళ్లాను. చివరిసారి అక్టోబర్ 2022లో వెళ్లాను. అమెరికా అధ్యక్షుడుగా జో బైడెన్ అప్పటికి ఇంకా రెండు సంవత్సరాలు కూడా పూర్తిచేసుకోలేదు. ఆ స్వల్పకాలిక పర్యటనలో మిత్రులతో జరిపిన సంభాషణలు, నా సొంత పరిశీలనల నుంచి అమెరికా అధ్యక్షుడు తన బాధ్యతలను సమర్థంగా, ప్రశస్తంగా నిర్వహిస్తున్నారని నాకు అవగతమయింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షత కాలంలో రగుల్కొన్న విభేదాలు, వైషమ్యాలను అమెరికా ప్రజలు అధిగమించేందుకు బైడెన్ విశేషంగా తోడ్పడారనడంలో సందేహం లేదు. అయితే తన పైబడిన వయసు, ఆరోగ్య దుర్బలతల కారణంగా బైడెన్ రెండో సారి అధ్యక్ష పదవికి ఆరాటపడకుండా ఉంటే బాగుండేది.

ఏ విధంగానైనా అధికారంలో కొనసాగి తీరాలన్న ఆరాటం అమెరికా ప్రస్తుత అధ్యక్షుడి లక్షణం మాత్రమే కాదు. అధికారాన్ని, వృత్తిగత విజయాలను చవిచూసిన వ్యక్తుల స్వతస్సిద్ధ స్వభావమది. ఈ ధరిత్రిపై ప్రతి దేశంలోను అటువంటి వ్యక్తులు ఉన్నారు. భౌతిక, మానసిక సామర్థ్యాలు క్షీణిస్తున్నప్పటికీ, తమ బాధ్యతలను సమర్థంగా కాదుకదా, మామూలు స్థాయిలో కూడా నిర్వహించగలగడం అసాధ్యమని స్పష్టమవుతున్నప్పటికీ అధికార లాలస నుంచి బయటపడని నేతలు అన్ని దేశాలలోను ఉన్నారు. రాజకీయాలలోనేకాదు, ఇతర రంగాలలోను అటువంటి వ్యక్తులు ఉన్నారు. ఈ వాస్తవం మన దేశంలో క్రికెట్ అభిమానులకు బాగా తెలుసు. 35 ఏళ్ల వయసు దాటిన తరువాత క్రికెటర్లు గతంలో వలే ప్రశస్తంగా ఆడలేకపోవడం సహజం. అయితే ఈ వాస్తవాన్ని గుర్తించిన క్రికెటర్లు ఎంత మంది ఉన్నారు? ఇందుకొక మినహాయింపు సునీల్ గవాస్కర్ ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో ఉత్కృష్టంగా ఆడి టీమ్ ఇండియాకు విజయం సాధించిన తరువాత ఆయన క్రికెట్ నుంచి పూర్తిగా వైదొలిగారు.

వ్యాపార వాణిజ్య రంగాలలోనూ ప్రతిభావంతులైన యువ మేనేజర్లను ప్రోత్సహించడంలో తాత్సారం చేసే కార్పొరేట్ అధిపతులు చాలా మంది ఉన్నారు. పౌర సమాజ ఉద్యమాలలో పనిచేసేవారిలో కూడా తామే సుదీర్ఘకాలం ఉన్నతస్థాయి నాయకత్వంలో కొనసాగాలని అభిలషించేవారున్నారు. ఈ అవగుణానికి మేధో రంగమూ మినహాయింపు కాదు బొంబాయి నుంచి వెలువడే సామాజిక శాస్త్రాల పత్రిక ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (ఈపిడబ్ల్యు) విషయాన్నే చూడండి. ఒకప్పుడు ఈ జర్నల్‌కు అంతర్జాతీయంగా విశేష పేరు ప్రఖ్యాతులు ఉండేవి. సామాజికశాస్త్రాలలో పరిశోధన చేసే ప్రతి ఒక్కరూ ఆ జర్నల్‌ను చదువుతూ ఉండేవారు. యువ పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలు ఆ జర్నల్‌లో ప్రచురితం కావాలని ఆకాంక్షించేవారు. విద్యావేత్తలతో పాటు జర్నలిస్టులు, సివిల్ సర్వెంట్‌లు, ప్రజా ఉద్యమాలలోని క్రియాశీలురు కూడా ఈపిడబ్ల్యును తప్పక చదువుతుండేవారు. అయితే ఇటీవలి సంవత్సరాలలో ఆ జర్నల్ ప్రమాణాలు బాగా పడిపోయాయి. అందులో ప్రచురితమవుతున్న వ్యాసాలు, పరిశోధనా పత్రాలు గతంలో వలే కొత్త పథనిర్దేశం చేసేవిగా ఉండడం లేదు. ఒకప్పుడు మన దేశంలో సమున్నత మేధోచర్చలకు వేదికగా ఉన్న ఆ జర్నల్ ఇప్పుడు అంత ఉత్కృష్టంగా లేదు.

ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ప్రతిష్ఠ దిగజారిపోవడానికి ప్రధాన కారణం దానిని నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు (అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మాదిరిగా) జీవిత కాల సభ్యులు కావడమే. ట్రస్ట్ ప్రస్తుత సభ్యులలో అందరి కంటే చిన్న వ్యక్తి వయసు 69 ఏళ్లు కాగా పెద్దాయన వయసు 93 ఏళ్లు. ట్రస్ట్‌లోని పది మంది సభ్యులలో తొమ్మిది మంది పురుషులే. మొత్తం సభ్యుల సగటు వయసు ఇంచు మించు 80 ఏళ్లుగా ఉన్నది. మరి సామాజికశాస్త్రాలలో ఉత్కృష్ట పరిశోధనలు జరిగేది పరిశోధకులు 30 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసులో ఉన్నప్పుడే కదా. జర్నల్‌ను నడిపేవారి, అందులో పరిశోధన పత్రాలు ప్రచురించే స్కాలర్ల సగటు వయసు మధ్య ఇంత వ్యత్యాసంతో ఈపిడబ్ల్యు తన ప్రతిష్ఠను పెంపొందించుకోవడం అటుంచి కనీసం నిలబెట్టుకోగలదా?



ఏ విధంగానైనా అధికారంలో కొనసాగి తీరాలన్న ఆరాటం అమెరికా ప్రస్తుత అధ్యక్షుడి లక్షణం మాత్రమే కాదు. ఈ ధరిత్రిపై ప్రతి దేశంలోను అటువంటి వ్యక్తులు ఉన్నారు. భౌతిక, మానసిక సామర్థ్యాలు క్షీణిస్తున్నప్పటికీ, బాధ్యతలను సాధారణస్థాయిలో కూడా నిర్వహించగలగడం అసాధ్యమని స్పష్టమవుతున్నప్పటికీ అధికార లాలస నుంచి బయటపడని వారు రాజకీయాలలోనేకాదు, ఇతర రంగాలలోనూ ఉన్నారు. స్వార్థపర స్వభావంతో కూడిన ఆ పెద్ద మనుషుల ప్రవర్తనకు ప్రతిభావంతులైన వారి జూనియర్ సహచరులతో పాటు యావత్ సమాజమూ అమితంగా నష్టపోతోంది.

ఈపిడబ్ల్యు ప్రతిష్ఠ సన్నగిల్లడం స్వయంకృతమే. నాకు తెలిసిన మరో మేధో సంస్థ గాథ ఆ ప్రతిష్ఠాత్మక జర్నల్ చరిత్రకు పూర్తిగా భిన్నమైనది. బెంగళూరులోని నేషనల్ సెంటర్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ (ఎన్‌సిబిఎస్) గురించి నేను ప్రస్తావిస్తున్నాను. ఈ ఉత్కృష్ట ఉన్నత విద్యా సంస్థ తొలుత టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టిఐఎఫ్ఆర్) విభాగంగా ప్రభవించింది. 1940లో బాంబేలో స్థాపితమైన టిఐఎఫ్ఆర్‌లో మొదటి పదిహేనేళ్ల భౌతిక, గణితశాస్త్రవేత్తల ప్రాబల్యముండేది. 1960వ దశకంలో ప్రతిభావంతుడైన యువశాస్త్రవేత్త ఒబైద్ సిద్ధిఖి ఆ సంస్థలో చేరారు. రెండు దశాబ్దాల పాటు టిఐఎఫ్ఆర్‌లో పనిచేసిన అనంతరం సిద్ధిఖి బాంబే నుంచి బెంగళూరుకు మారి అక్కడ ఒక కొత్త జీవశాస్త్ర పరిశోధనా సంస్థను నెలకొల్పారు. సామాజిక శాస్త్రవేత్తగా శిక్షణ పొందిన నాకు భారతీయ వైజ్ఞానిక ప్రపంచంతో కూడా చెప్పుకోదగిన పరిచయం ఉన్నది. మా నాన్నగారు, తాతగారితో సహా మా కుటుంబానికి చెందిన పలువురు శాస్త్రవేత్తలే.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఎన్‌సిబిఎస్ గురించి ఒక విశేషాన్ని నేను తొట్ట తొలుత చెప్పదలుచుకున్న విశేషం: నాకు తెలిసిన మరే ఇతర భారతీయ ఉన్నత విద్యా సంస్థలో కంటే ఈ పరిశోధనా సంస్థలో అధికార క్రమం కనిష్ఠ స్థాయిలో ఉండడం. విద్యావ్యాసంగాలలో సమష్టి కృషి, దాపరికం లేని విస్తృత మేధో సంభాషణలు, అందరూ అరమరికలు లేకుండా పాల్గొనే మేధో సంవాదాలు అక్కడ జరుగుతాయి. సిఎస్ఐఆర్‌కు అనుబంధంగా ఉన్న 37 పరిశోధనా కేంద్రాలలో ఎన్‌సిబిఎస్‌లో ఉన్నటువంటి స్వేచ్ఛాయుత మేధో వాతావరణం చాలా వరకు లేదని చెప్పవచ్చు. ఐఐటిలలో సైతం అటువంటి స్ఫూర్తిదాయక మేధావరణం లేదు.

ఎన్‌సిబిఎస్‌లో అటువంటి ప్రజాస్వామిక, భాగస్వామ్య మేధో సంస్కృతికి ప్రధానకారకుడు ఒబైద్ సిద్ధిఖి అనడంలో సందేహం లేదు. ఆయన్ని నేను చాలా సన్నిహితంగా పరిశీలించాను. ఆయనతరం అగ్రశ్రేణి భారతీయ శాస్త్రవేత్తల వలే కాకుండా సిద్ధిఖి ఎటువంటి పటాటోపం లేని మనిషి. ఆత్మస్తుతి ఆయన స్వభావానికి పూర్తిగా విరుద్ధం. అధికార క్రమంపై సిద్ధిఖికి ఎటువంటి అనురక్తి లేదు. అందరినీ సమరీతిలో గౌరవించే ఉదాత్తుడు. యువ శాస్త్రవేత్తలు ఉత్కృష్ట పరిశోధనలు చేస్తున్నారని ఆయనకు బాగా తెలుసు వారి పరిశోధనలకు, ప్రతిభా పాటవాల వికాసానికి సానుకూల పరిస్థితులను కల్పించడమే తన విధ్యుక్తధర్మంగా సిద్ధిఖి భావించారు. ఏ ఒక్కరినీ తన మాదిరిగా రూపొందించాలని ఆయన కోరుకోలేదు. సిద్ధిఖికి శాస్త్ర జగత్తు వెలుపల కూడా విశాల మేధో ఆసక్తులు ఉన్నాయి. తత్వశాస్త్ర కోవిదులు, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలతో భావాల వినిమయం చేసుకోవాడానికి ఆయన సదా ప్రయత్నించేవారు.

ఎన్‌సిబిఎస్ డైరెక్టర్‌గా తన పదవీ కాలం ముగిసిన తరువాత తాను స్థాపించిన ఆ సంస్థనే అంటి పెట్టుకుని ఉండిపోవాలని సిద్ధిఖి కోరుకోలేదు. అటువంటి ఉన్నత స్థానాలలో ఉన్న ఇతర భారతీయ శాస్త్రవేత్తలలో అత్యధికులు అలా చేసినవారు, చేసేవారే. ఎన్‌సిబిఎస్ నిర్వహణా బాధ్యతలను తన యువ సహచరుడికి వదిలివేసి, విద్యా వినమ్రతతో సిద్ధిఖి తన పరిశోధనా వ్యాసంగంలో నిమగ్నమయ్యారు. సిద్ధిఖి స్థానంలో ఎన్‌సిబిఎస్ డైరెక్టర్ అయిన శాస్త్రవేత్త కూడా తన పదవీ విరమణ అనంతరం ప్రతిభావంతుడైన సహచర యువ శాస్త్రవేత్తకు ఆ బాధ్యతలను అప్పగించారు. ఈ మూడో డైరెక్టర్ సైతం సిద్ధిఖి స్ఫూర్తితో నాలుగో డైరెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ నాలుగో డైరెక్టర్ ఎన్‌సిబిఎస్ డైరెక్టర్ కాక ముందు ఆ సంస్థతో ఎటువంటి సంబంధం లేని శాస్త్రవేత్త. అయితే ఆయన కొత్త భావాలు, సమున్నత భిన్నానుభవాలను తనతో తీసుకొచ్చి ఎన్‌సిబిఎస్ ప్రతిష్ఠను మరింతగా పెంచారు.

ఒబైద్ సిద్ధిఖి ఒక అపూర్వ భారతీయ పరుషుడు కాక పోయి ఉంటే ఎన్‌సిబిఎస్ అలా సమున్నతంగా వర్ధిల్లేది కాదు ఆ సంస్థ శాశ్వత విజయానికి మరో కారణం అది అంగీకరించి, అనుసరించిన నిర్వహణ పద్ధతులు. డైరెక్టర్ రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తాడు. డైరెక్టర్‌కు మార్గదర్శకత్వం వహించేందుకు, అవసరమైన మద్దతును సమకూర్చేందుకు ఒక మేనేజ్‌మెంట్ బోర్డ్ ఉన్నది. 15 మంది ఉండే ఈ బోర్డ్‌లో ఐదుగురు భారత ప్రభుత్వ, టిఐఎఫ్ఆర్ ప్రతినిధులు కాగా మిగతా పది మంది ప్రపంచ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలలో పరిశోధకులుగా ఉన్న శాస్త్రవేత్తలు వీరిలో ఐదుగురు మహిళలు. ఎన్‌సిబిఎస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ సభ్యుడి పదవీ కాలం మూడు సంవత్సరాలు. ఒక పర్యాయం పొడిగించే అవకాశమున్నది. బహుశా రెండోసారి కూడా పొడిగించవచ్చు. అంతటితో సరి. ఈపిడబ్ల్యును నడిపే ట్రస్ట్ విషయంలో వలే ఎన్‌సిబిఎస్ బోర్డ్‌లో ఏ ఒక్కరు జీవిత కాలం సభ్యులుగా ఉండరు. ఎట్టి పరిస్థితులలోను తొమ్మిది సంవత్సరాలకు మించి ఎవరూ సభ్యుడుగా ఉండరు. అదే ఈపిడబ్ల్యు ట్రస్ట్ సభ్యులలో కొంత మంది మూడు దశాబ్దాలుగా ఉన్నారు.

చివరగా ఒక వాస్తవాన్ని పేర్కొంటాను. 'సాధ్యమైనంత వరకు ఉన్నత స్థానంలోనే ఉండితీరుదాం' అనే లాలసకు శక్తిమంతమైన, విజయవంతమైన మహిళలు లోనుకానివారు కానప్పటికీ అటువంటి ఆకాంక్ష పురుషులలో చాలా ప్రబలంగా ఉన్నది. ఒబైద్ సిద్ధిఖిలో ఆ లాలస మచ్చుకు కూడా లేదు. ఆయన దానికి కచ్చితంగా ఒక మినహాయింపు. పురుష శాస్త్రవేత్తలలోను, భారతీయ వైజ్ఞానిక జగత్తులోను సిద్ధిఖి ఒక అరుదైన వ్యక్తి. రాజకీయాలు, క్రీడలు, వ్యాపార వాణిజ్యాలు, పౌర సమాజం, విద్యా ప్రపంచంలో అసంఖ్యాక భారతీయులు తమ తమ ఉన్నత స్థానాలలో కొనసాగేందుకు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడులా వ్యవహరించినవారే. వారు అదే విధంగా వ్యవహరించడాన్ని తప్పక కొనసాగిస్తారు. ముందు చూపులేని, స్వార్థపర స్వభావంతో కూడిన అటువంటి పెద్ద మనుషుల ప్రవర్తనకు ప్రతిభావంతులు, ప్రజ్ఞా ధురీణులు అయిన వారి జూనియర్ సహచరులతో పాటు యావత్ సమాజమూ అమితంగా నష్టపోవడంతో పాటు, భారీ మూల్యాన్ని చెల్లిస్తోంది.

నాగిరెడ్డి విశ్లేషణ నేటికీ ప్రామాణికమే!

మార్క్సిస్ట్ మేధావి, విప్లవ యోధుడు, ప్రజా యుద్ధ పంథాను ముందుకు తీసుకువెళ్లడానికి మితవాద విధానాలతో పాటు అతివాద విధానాలపై అవిశ్రాంత పోరాటం చేసిన భారత ప్రజల ముద్దుబిడ్డ తరిమెల నాగిరెడ్డి. కమ్యూనిస్టు విలువలతో నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దంలా ఉండే ఆయన విప్లవోద్యమ జీవితం తరతరాలకి నూతన ఉత్తేజాన్ని అందిస్తూనే ఉంటుంది.

దాదాపు 6 సంవత్సరాలు జైలు జీవితం, ఐదు సంవత్సరాలు రహస్య జీవితం గడిపారు. ఆయన కోర్టు స్టేట్‌మెంట్ 'తాకట్టులో భారతదేశం' మొదటి అధ్యాయం 'నా అరెస్టు'లో పేర్కొన్నట్లుగా "1940లో బ్రిటిష్ ప్రభుత్వం నన్ను మొదటిసారిగా అరెస్టు చేసిందన్న విషయం ఆసక్తిదాయకంగా ఉంటుంది. అదే సమయంలో వలస ప్రభుత్వం వారి ధర్మమా అని కమ్యూనిస్టుగా నా చురుకైన రాజకీయ జీవితం ఆ సంవత్సరంలోనే మొదలైందని కూడా చెప్పవచ్చు" అని పేర్కొంటూ, నిర్బంధం కమ్యూనిస్టుల జీవితంలో ఒక భాగం అని ప్రకటించారు. 1940 నుంచి 1969 వరకు అంటే మద్రాస్ అరెస్టుల వరకు తీవ్ర నిర్బంధాల మధ్య ఆయన విప్లవజీవితం సాగింది. చివరికి 1976 జూలై 28న ఆనాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితి కాలంలో రహస్యంగా ఉంటూ అనారోగ్యంతో హైదరాబాదులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చివరి శ్వాసను విడిచారు.



1946 జనరల్ ఎన్నికల్లో నాగిరెడ్డి అనంతపురం నియోజకవర్గంలో పార్టీ తరఫున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డిపై ఓడిపోయినా ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని విస్తరించగలిగారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం విరమణ తర్వాత 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాగిరెడ్డి బళ్ళారి జైలులోనే ఉండి సంజీవరెడ్డిపై 12 వేల మెజారిటీతో గెలిచారంటే పార్టీ నాయకుడిగా నాగిరెడ్డి ప్రజల హృదయాలలో ఆనాటికే ఉన్నత స్థానాన్ని సంపాదించుకున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో పాటు ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధాలు విధించినా, వందల మందిని బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపినా, వెనకడుగు వేయకుండా పీడిత ప్రజల తరఫున ఉద్యమాలు నిర్మించిన ఫలితంగా కమ్యూనిస్టులు ప్రజల ఆదరాభిమానాలను పొందారు. 1952 ఎన్నికల్లో ఆంధ్రాలో 44 మంది కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు గెలిచి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా గుర్తింపు పొంది, కాంగ్రెస్ పార్టీని రెండవ స్థానానికి నెట్టివేశారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజధాని కర్నూలులో ఉండాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించగా, కమ్యూనిస్టు పార్టీ శాసనసభపక్ష నాయకుడిగా ఉన్న నాగిరెడ్డి, రాజధాని గుంటూరు లేక విజయవాడలో ఉండాలని చేసిన తీర్మానం ఓడిపోయింది. కర్నూలులో రాజధాని ఏర్పడిన తర్వాత కూడా కమ్యూనిస్టు పార్టీ ఆ వైఖరికే కట్టుబడి ఉంది.

1954లో అసెంబ్లీలో మద్యపాన నిషేధంపై అధికారపక్షం పెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకించటంతో ప్రభుత్వం ఓడిపోయి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితిలో శాసనసభాపక్ష నాయకుడుగా ఉన్న నాగిరెడ్డి ఆనాటి గవర్నర్‌ని కలిసి సింగిల్ లార్జెస్ట్ పార్టీ నాయకునిగా తనకు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవకాశం ఇమ్మని కోరారు. కానీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి చక్రవర్తులు రాజగోపాలాచారి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేసే చర్యకు పాల్పడి నాగిరెడ్డికి అవకాశం ఇవ్వలేదు. 1962లో పుట్లూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి, 1967లో అనంతపురం నియోజకవర్గం నుంచి నాగిరెడ్డి పెద్ద మెజార్టీతో గెలిచారు. 1957–62 కాలంలో అనంతపురం నుంచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై గొప్ప పార్లమెంటేరియన్‌గా పేరుగాంచారు.

అయితే 1968 నుంచి సిపిఎం నయారివిజనిస్టు రాజకీయాలపై అంతర్గత పోరాటం జరిగి, 1969 నాటికి సిపిఎంతో విడగొట్టుకొని దేవులపల్లి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి నాయకత్వాన కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం ఏర్పడి విప్లవ గ్రూపుల మధ్య ఐక్యతకు మంచి పునాదులు వేశారు. పార్టీ నిర్ణయం ప్రకారం 1969 మార్చిలో అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1966లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉధృతంగా ఆందోళన జరుగుతున్న స్థితిలో పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆనాడు అసెంబ్లీలో సిపిఎం పార్టీ సభాపక్ష నాయకుడుగా ఉన్న నాగిరెడ్డితో పాటు పాటు సిపిఎం, సిపిఐ, స్వతంత్రులు మొత్తం 67మంది ఎమ్మెల్యేలు రాజీనామాలు ప్రకటించి ఉక్కు ఉద్యమానికి గొప్ప నైతిక మద్దతు అందించారు.

నేడు అత్యంత వేగంగా ముంచుకు వస్తున్న సరళీకరణ – ప్రైవేటీకరణ – ప్రపంచీకరణ విధానాల ప్రమాదాలను ఆనాడే నాగిరెడ్డి తన కోర్టు స్టేట్‌మెంట్ 'తాకట్టులో భారతదేశం'లో పసిగట్టి మార్క్సిస్ట్–లెనినిస్ట్ విశ్లేషణ చేసి మనకందించారు. ఆ విశ్లేషణ నేటి పరిణామాల వెలుగులో కూడా ప్రామాణికంగా నిలుస్తుంది. నాగిరెడ్డి చెప్పినట్లుగా భారతదేశాన్ని తాకట్టులో పెట్టటానికి బదులు నేటి దళారి పాలకులు బడా కార్పొరేట్ శక్తులకు చౌకగా అమ్మి వేయటానికి బరితెగిస్తున్నారని వెల్లడి చేస్తుంది. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై నిరంతర పోరాటం సాగిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించడమే మన ముందున్న ముఖ్యమైన కర్తవ్యం. ఆ విప్లవ కర్తవ్యసాధనే తరిమెల నాగిరెడ్డికి నిజమైన నివాళి.

● ముప్పాళ్ళ భార్గవశ్రీ
సిపిఐ ఎంఎల్ నాయకులు

(రేపు అనంతపురంలో తరిమెల నాగిరెడ్డి వర్ధంతి సభ)


రాష్ట్రంలో సాంస్కృతిక పునరుత్తేజం రావాలి

రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలు సాంస్కృతిక కళా రంగానికి ఒక చేదు అనుభవం. ఉగాది పురస్కారాలు లేవు, తెలుగు నాటకరంగ దినోత్సవ ఊసు లేదు, చివరి సంవత్సరం మినహాయించి నంది నాటక ఉత్సవాలను తలచుకున్నది లేదు, సాంస్కృతిక సంస్థలకు సహకారం ఎండమావే, అకాడమీలు అన్నీ కాగితాలకే పరిమితమై పోయాయి. సాంస్కృతిక కళారంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం మృగ్యమైపోయింది. ఈ స్థితిలో సాంస్కృతిక, నాటక సంస్థలు స్వంత నిధులతో, దాతల విరాళాలతో కళారంగ ఉనికిని కాపాడుకోవడానికి తమ వంతు కృషి కొనసాగించాయి. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కళారంగ పునరు□వానికి చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది.

ఇకపై ప్రతి ఏటా నంది నాటకోత్సవాలు క్రమం తప్పకుండా నిర్వహించాలి. అదేవిధంగా రాష్ట్రస్థాయి నంది నాటకోత్సవాలు ముగిశాక బహుమతి వచ్చిన నాటకాలతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో మినీ నంది నాటకోత్సవాలు నిర్వహిస్తే, ప్రజలలో నాటక కళ పట్ల ఆసక్తిని పెంచడానికి దోహదం చేస్తుంది. తెలుగు జాతికి ప్రాతః స్మరణీయుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతి ఏప్రిల్ 16న 'తెలుగు నాటకరంగ దినోత్సవం'గా గతంలో రాష్ట్ర స్థాయిలో, జిల్లాల స్థాయిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. రాష్ట్ర స్థాయిలో ముగ్గురిని లక్ష రూపాయల నగదు పురస్కారంతో సత్కరించేవారు. అలాగే ప్రతి జిల్లాలో ఐదుగురిని పదివేల రూపాయలతో సత్కరించేవారు. ఐదేళ్లుగా ఈ కార్యక్రమం పక్కన పెట్టారు. గతంలో ఉగాది రోజున వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు పదివేల రూపాయల నగదు బహుమతి, తెలుగుతల్లి ప్రతిమతో ఉగాది పురస్కారాలు, 50వేల నగదు బహుమతితో పాటు హంస ప్రతిమను అందజేసి కళారత్న(హంస) పురస్కారాలు ఇచ్చేవారు. ఐదేళ్లుగా దీనికి స్వస్తి పలికారు.


గతంలో ఒక వెలుగు వెలిగి, కాలక్రమేణా అంతరించిపోతున్న కళారూపాలు... బుర్రకథ, హరికథ, ఒగ్గు కథ, కోలాటం, జడ కోలాటం, తప్పెట గుళ్ళు, డప్పు, తోలుబొమ్మలాట, చెక్కభజనలు వంటి వాటికి తిరిగి పునరు□వం తీసుకువచ్చే ప్రయత్నం చేయాలి. వీటన్నిటిని ఒక చోటికి చేర్చి వివిధ ప్రాంతాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, వాటిని డిజిటల్ రూపంలో నిక్షిప్తపరచాలి. అలాగే సాంస్కృతిక శాఖ ద్వారా కళా సంస్థలకు, నాటక సంస్థలకు కార్యక్రమాల నిర్వహణ కోసం ఆర్థిక సహకారం అందించే పథకం గత ఐదేళ్లుగా నిరాదరణకు లోనైంది. దీనిని పునరుద్ధరించాలి. ఖజురహో తరహా జాతీయ స్థాయి నృత్య ఉత్సవాలను ప్రతి ఏటా కూచిపూడిలో లేదా ఒక్కోసారి ఒక ప్రముఖ పుణ్యక్షేత్రంలో నిర్వహించడం ద్వారా పిల్లలలో శాస్త్రీయ నృత్యం పట్ల అభిరుచిని పెంచాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంగీత, నృత్య కళాశాలకు తగినన్ని నిధులు కేటాయించి, అభివృద్ధిపరచాలి. ఆళ్లగడ్డ శిల్పకళకు ప్రసిద్ధి, అదేవిధంగా కొండపల్లి బొమ్మల ప్రాశస్త్యం అందరికీ తెలిసిందే, కలంకారి పెయింటింగ్ కళాకారులు కూడా రాష్ట్రంలో ఉన్నారు. వీరిని ప్రోత్సహించాలి. చిన్నారులలో, యువతలో చిత్రలేఖన కళ పట్ల ఆసక్తిని పెంపొందించాలి. ప్రభుత్వ ఆధీనంలో వివిధ ప్రాంతాలలో ఉన్న ఆడిటోరియాలను గుర్తింపు పొందిన సాంస్కృతిక సంస్థల కార్యక్రమాల నిర్వహణకు అద్దె లేకుండా, విద్యుత్ ఛార్జీలు మాత్రం తీసుకుని కేటాయించాలి. నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ, పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ నేతృత్వంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్రంలో సాంస్కృతిక పునరుత్తేజానికి, కళలకు కొత్త ఊపిరిలూదడానికి కృషి చేస్తుందని కళాభిమానులు ఎదురుచూస్తున్నారు.

– డాక్టర్ గుర్రాల రవికృష్ణ
సాంస్కృతిక నిర్వాహకులు



పెడన నియోజకవర్గంలో ఇంకా జోగి రమేశ్ హవా కొనసాగుతోందా? నియోజకవర్గంలో ఆయన చేసిన భూదందాలు, అసైన్డ్, ప్రభుత్వ భూముల స్వాధీనంలో జరిగిన అక్రమాలు బయటపడకుండా తెరవెనుక చక్రం తిప్పుతున్నారా? పెడన నుంచి పెనమలూరు వెళ్లినా, ఆయనకు గుట్టుచప్పుడు కాకుండా సహకరిస్తున్న కీలక వ్యక్తులు, అధికారులు ఎవరు? అనే అంశంపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఐదేళ్లుగా జోగి రమేశ్ చేసిన అక్రమాలు వెలుగులోకి రాకుండా చూసుకునేందుకు, తనకు అనుకూలంగా ఉండే తహసీల్దార్లను కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో పోస్టింగ్ ఇప్పించుకునేందుకు ఆయన పావులు కదుపుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

వామ్మో.. జోగి



ఓడిపోయినా ఆగని మాజీమంత్రి జోగి రమేశ్ అక్రమాలు

- పెడనలో భూదందాలు కప్పిపుచ్చేందుకు తంటాలు
- కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో తహసీల్దార్ల నియామకానికి వ్యూహాలు
- తహసీల్దార్లు తనవారైతే ప్రశ్నించరనే పన్నాగాలు
- భీమవరం బడాబాబులను రక్షించేందుకు పాట్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృత్తివెన్ను మండలం గరిసపూడి రెవెన్యూ గ్రామ పరిధిలో అసైన్డ్, ప్రభుత్వ భూములున్నాయి. సముద్రపు ఆటుపోట్లు సంభవించే సమయంలో ఉప్పునీరు ఈ భూముల్లోకి వచ్చిపోతూ ఉంటుంది. దీంతో రైతులు ఈ భూములను సాగు చేయకుండా అలాగే ఉంచేశారు. ఈ గ్రామ పరిధిలోని భూములపై కన్నేసిన అప్పటి మంత్రి జోగి రమేశ్ లీజు పేరుతో 300 ఎకరాలను రైతుల నుంచి తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. కొంతమంది రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు లీజు చెల్లిస్తానని, ఏడేళ్ల పాటు లీజు అగ్రిమెంట్ చేసుకున్నాడు. మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని 300 ఎకరాల అసైన్డ్ భూములు, మరికొంత ప్రభుత్వ భూమిని భీమవరానికి చెందిన బడాబాబులకు ఏడాదికి ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు సబ్‌లీజుకు ఇచ్చి, వారితోనే చెరువులుగా తవ్వించాడు. ఈ వ్యవహారంలో అప్పట్లో రూ.కోట్లు చేతులు మారాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ భూములను చెరువులుగా తవ్వుతున్నా ఎవరూ ఆ వైపునకు వెళ్లకుండా అధికారులను కట్టడి చేశాడు. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో ఇదే తరహాలో అసైన్డ్, ప్రభుత్వ భూములను చేపలు, రొయ్యల చెరువులుగా మార్పించాడు. ఈ భూ ఆక్రమణలకు ఎవరూ అడ్డు చెప్పకుండా అసైన్డ్ భూములకు పేదల పేరిట పట్టాలు ఇప్పిస్తానని నమ్మించాడు. తన చుట్టూ తిరిగే కార్యకర్తలు, మాజీ సైనికుల పేర్లతో అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని రెండువేల పేర్లతో జాబితాలు తయారు చేయించాడు. ఈ జాబితాల ఆధారంగా పేదలకు అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని అప్పట్లో రెవెన్యూ అధికారులు, ఇద్దరు కలెక్టర్లపైనా ఒత్తిడి తెచ్చాడు. ఈ అంశం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో వి వాదాస్పదమైంది.

అధికారం మారినా..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. వీటిని జోగి రమేశ్ కబంధ హస్తాల నుంచి ఖాళీ చేయించేందుకు కూటమి నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చుచేసి భూములను లీజుకు తీసుకున్న భీమవరం బడాబాబులు ఆ భూములను ఖాళీ చేయాల్సి వస్తే తమ పరిస్థితి ఏవి ుటోనని ఆందోళన చెందుతున్నారు. మాజీమంత్రిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో రంగంలోకి దిగిన జోగి ఈ భూములకు సంబంధించిన సమాచారం బయటకు రాకుండా ఉండేందుకు వారంలో జరిగే తహసీల్దార్ల బదిలీల్లో తనకు అనుకూలమైన అధికారులను కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో పోస్టింగ్ ఇప్పిస్తానని, కంగారు పడవద్దని అభయమిచ్చినట్లు సమాచారం. తనకు అనుకూలంగా ఉండే అధికారులను ఎంపిక చేసుకుని వారిని ఆ మండలాల్లో నియమింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారని రెవెన్యూ ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. ఈ రెండు మండలాల తహసీల్దార్ల నియామకంలో కూటమి ు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

పరిశీలన



స్వాతంత్ర్య దినోత్సవానికి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో చేయాల్సిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ సృజన, ఏపీఎస్పీ డీఐజీ బి.రాజకుమారి, సీపీ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం సమీక్షించారు. ఈ వేడుకలకు గవర్నర్, ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు కానున్న నేపథ్యంలో సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. 6లో..

టీడీపీ నేతలపై కేసులు కొట్టివేత

అప్పట్లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ దాడి

- అడ్డొచ్చిన టీడీపీ కార్యకర్తలకు గాయాలు
- తిరిగి టీడీపీ నేతలపైనే కేసులు పెట్టిన పోలీసులు
- అక్రమ కేసును కొట్టేసిన గన్నవరం కోర్టు

6లో..

44 నెలల తర్వాత..

సీబీసీఐడీకి డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసు


- వైసీపీ ప్రభుత్వంలో పురోగతిలో లేని కేసు
- స్పందించిన టీడీపీ కూటమి ప్రభుత్వం
- అవనిగడ్డలో హర్షాతిరేకాలు

దుర్గగుడిలో వారిద్దరి స్టైలే వేరు. ఎన్ని బదిలీలైనా, ఎన్ని రోజులైనా కాసులు కురిపించే కీలక స్థానాలను మాత్రం వారు వదలరంటే వదలరు. తీవ్రమైన ఆరోపణలు ఉన్నా, విజిలెన్స్ అభ్యంతరాలు వ్యక్తం చేసినా వారిద్దరినీ పక్కన పెట్టేవారే ఉండరు. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని పోస్టులను ఏరికోరుకుని మరీ ఎంచుకుని కూర్చుంటారు. వీరిలో ఒకరి ఉద్యోగ నియామకంలోనే వివాదాలున్నా.. మరొకరిని ఏసీబీ కేసులు వెంటాడుతున్నా.. తాజాగా జరిగిన దుర్గగుడి అంతర్గత బదిలీల్లో ప్రాధాన్యమైన పోస్టులు కల్పించడం వెనుక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

ఆరోపణలున్నా అందలమే..

దుర్గగుడి అంతర్గత బదిలీల అర్థాలే వేరు



ఇద్దరు సూపరింటెండెంట్ల బదిలీపై సందేహాలు

అవినీతి ఆరోపణలున్నా కీలక స్థానాలు కేటాయింపు
- కాసులు ముట్టే స్థానాల్లో నియామకం
- ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ

కొద్దిరోజుల క్రితం జరిగిన బదిలీల్లో ఒక సూపరింటెండెంట్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. దత్తత దేవాలయాల బాధ్యతలు చూసే ఆయనకు టోల్‌గేట్, దుర్గాఘాట్ హారతులు, కేశఖండన శాల బాధ్యతలు ఇచ్చారు. ఎలాంటి మచ్చలు లేని సూపరింటెండెంట్‌కు ఈ బాధ్యతలు అప్పగించి ఉంటే దేవస్థాన ఉద్యోగ వర్గాల్లో చర్చ జరిగేది కాదు. కొన్నాళ్ల క్రితం ఈ సూపరింటెండెంట్ ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి ఇక్కడికి వచ్చారు. అక్కడ టోల్‌గేట్ నిధుల వ్యవహారంలో గోల్‌మాల్ జరిగినట్టు ఈయనపై అభియోగాలు ఉన్నాయి. తర్వాత అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో దుర్గామల్లేశ్వరస్వామి ు దేవస్థానానికి వచ్చారు. కొన్ని నెలల పాటు ప్రసాదాలు, టికెట్ కౌంటర్ల బాధ్యతలను పర్యవేక్షించారు. భ్రమరాంబ ఈవోగా ఉన్నప్పుడు ప్రసాదాల కౌంటర్లలో పులిహోర ప్యాకెట్ల లెక్కల్లో తేడాలు వచ్చినట్టు గుర్తించారు. ఆ సమయంలో ఈ

ఆయనంతే.. మారరంతే..

సూపరింటెండెంట్‌పై ఆరోపణలు వచ్చాయి. అప్పటి పాలక మండలి చైర్మన్ నేరుగా ఆయన విషయంలో ఈవోతో యుద్ధానికి దిగారు. అయినా భ్రమరాంబ ఆయనను వెనుకేసుకొచ్చారు. ఆ తర్వాత కొన్నాళ్లకు సదరు అధికారి అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఆయన ఇంట్లో లెక్కలు లేని రూ.35 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. భ్రమరాంబ ఇక్కడి నుంచి బదిలీ అయ్యాక ఆయన మళ్లీ విధుల్లో చేరారు. కొద్దిరోజుల క్రితం వరకు ఆయనకు దత్తత దేవాలయాలను అప్పగించారు. తాజాగా జరిగిన అంతర్గత బదిలీల్లో ఆయనపై అధికారులకు నమ్మకం పుట్టుకొచ్చింది. ఆదాయానికి కేంద్ర బిందువుగా ఉండే టోల్‌గేట్, కేశఖండన శాల బాధ్యతలను అప్పగించారు. ఆయనకు ఇంకా ఎటువంటి క్లీన్‌చిట్ రాకుండానే అధికారులు కీలక బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావి స్తోంది.

విధులు అక్కడ.. వేతనవి ఎక్కడ

దేవదాయ ఉద్యోగుల అన్ని వ్యవహారాలు ఆ శాఖ కమిషనర్ కార్యాలయంతో ముడిపడి ఉంటాయి. ఇక్కడ పనిచేయడానికి దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఉద్యోగులు తహతహలాడుతుంటారు. సిఫార్సుల్లో పోటీపడి మరీ పోస్టింగ్‌లు సంపాదించుకుంటారు. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో సూపరింటెండెంట్‌గా వ్యవహరించే ఓ ఉద్యోగి ప్రస్తుతం కమిషనర్ కార్యాలయంలో కీలక పోస్టులో ఉన్నారు. ఆయన వి ధులు కమిషనరేట్‌లో నిర్వర్తిస్తున్నా వేతనం మాత్రం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం నుంచే అందుకుంటారు. ఈయన కమిషనరేట్‌లో చక్కబెడుతున్న వ్యవహారాలు వివాదాస్పదమవుతున్నాయి. కాసులు కురిపించే వ్యవహారాలను జోరుగా చక్కబెడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ సూపరింటెండెంట్ ఉద్యోగ నియామకంలోనూ వివాదాలు ఉన్నాయి. రాష్ట్ర విభజనకు ముందు ఈయన తెలంగాణలోని యాదాద్రి దేవస్థానంలో పనిచేశారు. విభజన తర్వాత అనూహ్యంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఇది దేవదాయ శాఖ నిబంధనలకు వి రుద్ధమని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

ఈ సీటు.. వెరీ స్వీటు!

విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కోసం పైరవీలు

ఆ సీటంటే తహసీల్దార్లకు భలే స్వీటు. ప్రస్తుతం బదిలీల నేపథ్యంలో సొంత జిల్లాలకు వస్తున్నవారు దీనిపై కన్నేశారు. ఇంతకీ ఎక్కడుంది ఈ సీటు? ఏమా స్వీటు కథ? అనుకుంటున్నారా? అయితే వి జయవాడ రూరల్ మండలానికి వెళ్లాల్సిందే.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండల తహసీల్దార్‌గా రావడానికి పోటీ మామూలుగా లేదు. పైరవీలు కూడా అదే స్థాయిలో జోరుగా సాగుతున్నాయి. ఎవరికి తోచినట్టు వారు రాజకీయంగానూ, సీసీఎల్ఏ స్థాయిలోనూ శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

- నగర పరిధిలో గతంలో పనిచేసిన ఓ మహిళా తహసీల్దార్ కన్ను దీనిపై పడింది. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జేఏసీలో క్రియాశీలకంగా పనిచేసే ఆ మహిళా తహసీల్దార్ తమ నాయకుడి ఆశీస్సులతో ఈ స్థానంలోకి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి పనిచేసిన ఆమెకు ప్రస్తుతం ఆ పార్టీ నాయకుడు కూడా సహకరిస్తున్నాడు.
- గతంలో గ్రేటర్ విజయవాడ విలీన జాబితాలో ఉన్న ఒక మండల పరిధిలో పనిచేసిన మరో అధికారి కూడా రూరల్ తహసీల్దార్‌గా వచ్చేందుకు తెగ తహతహలాడిపోతున్నారు. ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ఏపీఆర్ఎస్ఏ)లో కీలకంగా ఉన్న ఈయన కూడా గతంలో వైసీపీ ఎమ్మెల్యేకు వీరవిధేయుడిగా పనిచేశారు. మట్టి, గ్రావెల్.. ఇలా దేనినీ వదిలిపెట్టకుండా అప్పటి అధికార పార్టీ సాగించిన అక్రమాలకు సహకరించారు. ఈ వ్యవహారాల్లో వాటాలను కూడా పొందారన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. వీటితో పాటు గతంలో జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో అడ్డగోలుగా వ్యవహరించారని, తక్కువ ధర కలిగిన భూములను ఎక్కువ ధరకు కొన్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

కాసులే కాసులు

ఇంతకీ విజయవాడ రూరల్ మండలానికి ఎందుకంత డిమాండ్ అంటే.. ఈ ప్రాంతంలో సీలింగ్, అటవీ భూములు, కొండలు, పోలవరం కాల్వగట్లు అధికంగా ఉండటమే. అక్రమార్కులకు సహకరిస్తే లక్షల రూపాయలు సంపాదించవచ్చు. ఈ కారణంగానే విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ పోస్టు కోసం పైరవీలు తారస్థాయికి చేరాయి.

విజిలెన్స్ విచారణ పక్కదారి..!

ఆర్‌డబ్ల్యూఎస్‌లో కంప్యూటర్ల కొనుగోల్‌మాల్ వ్యవహారంలో..

విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- ముడుపుల మాయతో ఆర్‌డబ్ల్యూఎస్ విచారణగా మార్పు
- విచారణ సవ్యంగానే సాగేనా.. అనే అనుమానాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా వి భాగంలో కంప్యూటర్ల కొనుగోల్‌మాల్ వ్యవహారాలపై అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గోల్‌మాల్ వ్యవహారంపై ఇప్పటికే ప్రభుత్వం సీరియస్ అయ్యింది. అంతేకాదు.. నగరంలోని రిటైల్ డీలర్ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థను వివరణ కోరింది. కంప్యూటర్లను కొనటానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం అనుమతులు కోరిందా? మీ పర్యవేక్షణలోనే కొనుగోళ్లు జరిగాయా? ఎంత ధర నిర్ణయించారన్న వివరాలను అడిగింది. అయితే, కంప్యూటర్ల కొనుగోలుపై ఆర్‌డబ్ల్యూఎస్ తమను సంప్రదించలేదని ఏపీటీఎస్ఎల్ చెప్పడంతో ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్.. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయాన్ని వివరణ కోరారు. సమాధానాలు సంతృప్తికరంగా రాకపోవడంతో ఆయన విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

విచారణను మార్చేశారు..!

దొరికిపోతామన్న ఉద్దేశంతో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయ అధికారులు విజిలెన్స్ వి చారణను నీరుగార్చారు. విజిలెన్స్ విచారణను మార్చేసి.. ఆర్‌డబ్ల్యూఎస్ విజిలెన్స్ బృందం ద్వారా వి చారణ జరిపేలా ఆదేశాల్లో మార్పు చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన ఆదేశాలను కూడా కాదని, ఆర్‌డబ్ల్యూఎస్ అంతర్గత విజిలెన్స్‌కు విచారణ అప్పగించటంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అంతర్గత విజిలెన్స్‌లో ఒక డీఈ స్థాయి అధికారి ఉంటారు. ఒక సీఈ జరిపిన వ్యవహారంపై కిందిస్థాయి డీఈ విచారణ చేయగలరా? ఒకవేళ చేసినా పారదర్శకంగా జరుగుతుందా? అనేది సందేహమే. కిందిస్థాయి అధికారులను ఉన్నతాధికారులు లొంగదీసుకునే అవకాశం ఉండదా అనే ప్రశ్నలు ఉత్పన్నమ వుతున్నాయి. ఇలాంటపుడు విచారణ పారదర్శకంగా జరుగుతుందా.. అనే అనుమానాలు కలుగుతున్నాయి. విజిలెన్స్ విచారణ మార్చిన వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్టుగా తెలుస్తోంది. ఈ వ్యవహారం ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేది కావడంతో సమగ్ర విచారణకు ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

సారె సమర్పిస్తాం.. శేషవస్త్రాలివ్వండి

దుర్గగుడి అధికారులకు వన్‌టౌన్ పోలీసుల లేఖ

ఆషాఢ మాసంలో ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు సారె సమర్పించడం భక్తులకు సంప్రదాయం. ఇక దుర్గమ్మ పుట్టినిల్లుగా భావిస్తూ సారె సమర్పించే వన్‌టౌన్ పోలీసులు మాత్రం అదొక హుందాతనంగా భావిస్తున్నారు. 'అమ్మవారికి సారె తెస్తున్నాం.. తమవైపు నుంచి మూకుమ్మడిగా వచ్చే 200 మందికి శేషవస్త్రాలు ఇవ్వాలి' అంటూ సీఐ దుర్గాశేఖరరెడ్డి శుక్రవారం దుర్గగుడి ఈవోకు లేఖ రాయడం ఇప్పుడు వి వాదాస్పదంగా మారింది. భక్తితో అమ్మవారికి సమర్పించే సారె విషయంలోనూ ఈ లేఖలు, సిఫార్సులు ఏమిటంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. 6లో..

సాగు జరిగేనా..?

- కోడూరు మండలంలో వర్షాలు తెచ్చిన తంటా
- పంట పొలాల్లో భారీగా నిలిచిన వర్షపు నీరు
- శిథిలావస్థలో అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు

6లో..



శిథిలావస్థలో ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు

పటమట సబ్ రిజిస్ట్రార్ బదిలీ

ఐజీ ఆఫీసు నుంచి ప్రత్యేకంగా పోస్టింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పటమట సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న చైతన్య డెప్యుటేషన్‌ను రద్దు చేస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఆకస్మిక నిర్ణయం తీసుకుంది. ఐజీ ఆఫీసులో పనిచేస్తున్న ఆరిఫ్‌ను పటమట సబ్ రిజిస్ట్రార్‌గా నియమించింది. ఆరిఫ్ స్థానాన్ని విశాఖపట్నం సబ్ రిజిస్ట్రార్ వెంకయ్యనాయుడుతో భర్తీ చేశారు. కాగా, చైతన్య డెప్యుటేషన్ రద్దు కావడంతో ఆయన గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తారు. పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రభుత్వానికి భారీగా ఆదాయం తెస్తుంది. గతంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్లు, ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ చైతన్య వందల కోట్ల రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వానికి తెచ్చిపెట్టారు. కానీ, ఈ కార్యాలయం ఆరోపణలకు నిలయమనే పేరు మాత్రం అలాగే ఉంది.

దుర్గగుడి గోపుర స్వర్ణతాపడానికి విరాళం



వన్‌టౌన్, జూలై 26 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయ గోపుర స్వర్ణతాపడానికి పశ్చిమగోదావరి జిల్లా విస్సాకోడూరుకు చెందిన మీసాల రేణుకా స్వాతి శుక్రవారం ఆలయానికి విచ్చేసి డోనర్ సెల్ అధికారి డీవీవీ సత్యనారాయణ ద్వారా వెయ్యి సింగపూర్ డాలర్లను విరాళంగా సమర్పించారు.



31 గ్రాముల బంగారు కాయిన్ కానుక..

హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన కొమ్మరాజు శివరామకృష్ణ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం ఆలయ అధికారుల ద్వారా 31గ్రాముల బంగారు కాయిన్‌ను అమ్మవారికి కానుకగా అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనం అనంతరం వారికి ఆశీస్సులు, ప్రసాదం శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.



హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీలో న్యాయాధికారి రామకృష్ణయ్య

చట్టాలపై అవగాహన అవసరం

» న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య

పెడన, జూలై 26 : చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య అన్నారు. పట్టణంలోని శ్రీ విజయానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో రామకృష్ణయ్య మాట్లాడుతూ, చట్టాలపై అవగాహన లేక పేదలు న్యాయం పొందలేకపోతున్నారన్నారు. చట్టాలు, ఉచిత న్యాయసేవలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తూ.. ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నామన్నారు.

హెల్మెట్ ధారణ బాధ్యతగా భావించాలి..

హెల్మెట్ ధారణను వాహనదారులు బాధ్యతగా భావించాలని న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి కేవీ రామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్‌లు రక్షణ కవచంగా ప్రాణాలు కాపాడతాయన్నారు. ర్యాలీలో విజయానంద విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపైనా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రామకృష్ణయ్య తెలిపారు. తహసీల్దార్ కె.రాంబాబు, కమిషనర్ బి.వెంకట్రామయ్య, టీపీవో ఏసుబాబు, విజయానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నాగమల్లేశ్వరరావు, న్యాయవాదులు అబ్బాతు స్నీసా, రషీద్, ఆర్‌ఐ మణికుమార్, బంటుమిల్లి, కృత్తివెన్ను ఎస్‌ఐలు నాగరాజు, వాసు, సచివాలయ, మునిసిపల్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న టీడీ జనార్దన్

ఢిల్లీలో జగన్ లొల్లి హాస్యాస్పదం : టీడీ జనార్దన్

వత్సవాయి, జూలై 26 : రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అనడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ అన్నారు. మండలంలోని ప్రజలకు కావాల్సిన అవసరాలపై ఆయన ఆరా తీశారు. ముఖ్యంగా ఇంటి స్థలం, పింఛన్లపై చర్చించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా, సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం గత సీఎం ఎలాంటి చర్యలు తీసుకోకుండా తనపై కేసుల ఎత్తివేత కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేశారన్నారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన చేసి అమరావతి అభివృద్ధికి రూ.15 వేలకోట్ల నిధులు సాధించారన్నారు. హైదరాబాద్‌కు దీటుగా అమరావతి నిర్మాణానికి చంద్రబాబు ప్రణాళికలు చేస్తున్నారన్నారు. జగన్ ఢిల్లీ వెళ్లి ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయని, 36 మందిని హత్య చేశారని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, రైతు నాయకుడు తొండెపు జగన్మోహన్ రావుత తదితరులు పాల్గొన్నారు.



ప్లాంట్ ఆవరణలో కంప తొలగిస్తున్న సంస్థ సిబ్బంది

అశోక్ లేలాండ్ పనుల పునరుద్ధరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో అశోక్ లేలాండ్ సంస్థ బస్ బాడి బిల్డింగ్ ప్లాంట్ పనుల పునరుద్ధరణ పనులు చేపట్టింది. గత ఐదేళ్లుగా ప్లాంట్ పనిచేయకపోవటంతో.. ఆవరణ అంతా పిచ్చిచెట్లు, కంప, పొదలతో కమ్ముకుపోయింది. శుక్రవారం ప్లాంట్ ఆవరణలో పెద్ద ఎత్తున పెరిగిన చెట్ల తొలగింపు పనులను అశోక్ లేలాండ్ సంస్థ సిబ్బంది చేపట్టారు. ప్లాంట్‌ను పునరుద్ధరించేందుకు సంస్థ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ప్లాంట్‌ను తీర్చిదిద్దటం కోసం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్లను తీసుకు వచ్చి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. అతి త్వరలో ప్లాంట్‌ను సంస్థ పునరుద్ధరించనుంది. దీంతో మల్లవల్లికి మళ్లీ పూర్వ వైభవం రాబోతోంది.

సారె సమర్పిస్తాం.. శేషవస్త్రాలివ్వండి

» దుర్గగుడి అధికారులకు వన్‌టౌన్ పోలీసుల లేఖ

వన్‌టౌన్, జూలై 26 : ఆషాఢమాసం సందర్భంగా దుర్గమ్మకు సారె సమర్పణల కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసు కుటుంబాలు కూడా తమ శక్తి మేరకు సారె సమర్పించడం అనవాయితీగా వస్తోంది. ఈసారి తాము మూకుమ్మడిగా వస్తున్నామని, 200 శేషవస్త్రాలు కావాలని పోలీసులు కోరడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను పోలీసులు తమ పుట్టింటి ఆడపడచుగా కొలుస్తుండటం, ప్రత్యేకించి దసరా మహోత్సవాలలో అమ్మవారిని కొలవడం.. పారువేట ఉత్సవానికి అమ్మవారిని తీసుకుని వెళ్లడం వంటివి జరుగుతుంటాయి, ఎవరి లాంఛనాలు వారు అందచేస్తుంటారు. దసరా ఉత్సవాలలో ప్రత్యేక బందోబస్తు చేసిన ఉద్యోగులకు భోజనాలు, అల్పాహారాలు దేవస్థానమే చూస్తుంది. దసరా ముందురోజున పోలీసుల తరపున పట్టు వస్త్రాల సమర్పణ జరుగుతుంది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు దేవస్థానం శేషవస్త్రం, ప్రసాదం వంటివి అందజేయడం అనవాయితీ. ఇంతవరకు పోలీసులు ఆషాఢమాసం సందర్భంగా హడావుడి చేసిన పరిస్థితి లేదు. అయితే ఈ ఏడాది విచిత్రంగా వన్‌టౌన్ సీఐ దుర్గాశేఖరరెడ్డి శుక్రవారం దుర్గగుడి ఈవోకు ఓ లేఖ రాశారు. 'వెస్ట్ డివిజన్ నుంచి ఈనెల 28 వతేదీన అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువస్తున్నామని, ఈ కార్యక్రమంలో విజయవాడలోని పోలీసు సిబ్బంది ఉన్నతాధికారులు పాల్గొంటారని, వారందరికీ కూడా 200 శేషవస్త్రాలు ఇవ్వాలని' కోరారు. అయితే మున్నెన్నడూ లేనివిధంగా ఇలా లేఖ రాయడం చర్చకు దారితీసింది. శేషవస్త్రం ప్రొటోకాల్ అధికారులకు ఇస్తారని.. మూకుమ్మడిగా శేషవస్త్రాలు అడగడమేమిటన్నది ప్రశ్నగా మారింది. లేని కొత్త సంప్రదాయానికి వన్‌టౌన్ పోలీసులు తెరలేపారని చెబుతున్నారు. మగవారికి శేషవస్త్రాలు ఇస్తే మరి వారి వెంట వచ్చే కుటుంబసభ్యులకు రవికె గుడ్డలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై దేవస్థానం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

స్వాతంత్ర్య వేడుకలకు వేళాయె..

» ఏర్పాట్లపై కలెక్టర్ సృజన సమీక్ష

» ఐజీఎం స్టేడియంలో అధికారుల పర్యటన



స్టేడియంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 26 : 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. ఆగస్టు 15వ తేదీన స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి చేయవలసిన ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ సృజన, ఏపీఎస్పీ డీఐజీ బి.రాజకుమారి, నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్రలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 15వ తేదీన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్నామన్నారు. ముఖ్యమంత్రి, గవర్నర్‌తో పాటు రాష్ట్ర మంత్రులు ఉన్నతాధికారులు వేడుకలలో పాల్గొంటారని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, నగరపాలక సంస్థ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో, ఫైర్ సంబంధిత శాఖల అధికారులు వేడుకల ఏర్పాట్లను ప్రారంభించాలన్నారు. ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌లో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశీలనలో ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్, డీసీపీలు గౌతమ్ శాలి, ఏబీటీఎస్ ఉదయరాణి, కె.చక్రవర్తి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలి

» పరిశ్రమలకు 'సింగిల్ డెస్క్' అనుమతులు

» ఎంఎస్ఎంఈలకు రూ.1.14 కోట్ల రాయితీ ప్రయోజనాలు

» డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ సృజన



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 26 : సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికుల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన అనుమతుల జారీకి కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సూచించారు. శుక్రవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ నిధి మీనా, జిల్లా పరిశ్రమల అధికారి, మెంబర్ కన్వీనర్ ఎ.సుధాకర్, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు హాజరైన సమావేశంలో 2023, డిసెంబరు 31 నుంచి 2024 జూలై 25 మధ్యకాలంలో సింగిల్ డెస్క్ విధానం కింద అందిన దరఖాస్తుల పరిష్కారం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి ఆదేశాలిచ్చారు. వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 225 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 205 దరఖాస్తులు ఆమోదం పొందాయని, 17 దరఖాస్తులు పరిశీలనలో వున్నాయని, మిగిలిన వాటిని తిరస్కరించినట్టు తెలిపారు. పరిశీలనలో వున్న దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఏపీఐఐసీ, ఏపీపీసీబీ, ఫ్యాక్టరీలు, అగ్నిమాపక సేవల శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీపీ (2015-20), ఐడీపీ (2020-23), బడుగు వికాసం కింద సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్ టారిఫ్ తదితర రాయితీల కింద మొత్తం 30 యూనిట్లకు దాదాపు రూ.1.14 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలిపింది. ఉపాధికల్పన, ఆర్థిక వృద్ధి పరంగా కీలకమైన ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు, ఉన్న సంస్థల సుస్థిర అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, డీఐఈపీసీ సమావేశాలను ప్రతి నెలా నాలుగో శుక్రవారం క్రమం తప్పకుండా నిర్వహించనున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు. సమావేశంలో ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకృష్ణ, మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ప్రతినిధి కనకదుర్గ, ఏపీఐఐసీ జెడ్ఎం కె.సీతారాం, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీటీసీ ఎం.పురేంద్ర, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

శాంతి భద్రతలపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

» పోతుల బాలకోటయ్య



ధర్నాచౌక్, జూలై 26 : రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి మాట్లాడే అర్హత, హక్కు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు లేదని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య మండిపడ్డారు. తన హయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై జరిగిన దాడులు, హత్యలు, ఆత్మహత్యలు, అత్యాచారాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో శాంతి భద్రలను విచ్ఛిన్నం చేసిన జగన్ ఢిల్లీ వెళ్లి గ్యాలరీ ఫోటో షో నిర్వహించడాన్ని తప్పుబట్టారు. 'మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్, మాస్క్ పెట్టుకోనందుకు చీరాల కిరణ్‌కుమార్‌లను హత్య చేసిన విషయం గుర్తు లేదా జగన్..' అని ప్రశ్నించారు. 'డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును గజమాలలతో సత్కరించి బహిరంగ వేదికలపై రాచమర్యాదలు చేసిన విషయం మర్చిపోయారా..' అన్నారు. 'శిరోముండనం కేసులో శిక్ష పడిన తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదా' అన్నారు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు 60 రోజుల కూటమి ప్రభుత్వంపై చిందులు వేస్తే ప్రజలు నవ్వుకుంటారన్నారు. చేతనైతే రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని, లేదంటే రాజకీయాల నుంచి తప్పుకోవాలని జగన్‌కు బాలకోటయ్య సలహా ఇచ్చారు. అమరావతి రైతు మహిళా నాయకురాలు కొమ్మినేని వరలక్ష్మి మాట్లాడుతూ, జగన్ వందలాది మంది అమరావతి మహిళా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. అనేక అక్రమ కేసులు బనాయించారన్నారు. అమరావతి ఉద్యమంలో 270 మంది చనిపోయారని, వారి మృతికి జగన్ బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలనడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రాభివృద్ధిని జగన్ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. నేషనల్ నవక్రాంతి పార్టీ అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు, రెల్లి సంక్షేమ సంఘం నేత శిరంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం కర్ణాటక తెలుగు ప్రజా సమితి ఆధ్వర్యంలో బెంగుళూరులో 'అభినవ జామవా' బిరుదు ఇచ్చిన సందర్భంగా బాలకోటయ్యను సత్కరించి అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా

28, 29 తేదీల్లో ప్రతుల దహనం

» రైతు సంఘాల చర్చావేదికలో తీర్మానం

గవర్నర్‌పేట, జూలై 26 : కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, గ్రామీణ పేదలకు నిధుల కేటాయింపులో భారీగా కోత విధించడాన్ని నిరసిస్తూ ఈనెల 28, 29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా బడ్జెట్ ప్రతులను దహనం చేయాలని, ఎస్‌కేఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో పాల్గొనాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన చర్చావేదిక ఏకగ్రీవంగా తీర్మానించింది. వ్యవసాయ రంగానికి, గ్రామీణ పేదలకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా కోత పెట్టడానికి వ్యతిరేకంగా, పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్‌ను సవరించి నిధులు పెంచాలని కోరుతూ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షతన చర్చావేదిక జరిగింది. వివిధ సంఘాలకు చెందిన 50 మంది రాష్ట్ర ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఆర్థిక నిపుణులు ప్రొఫెసర్ పాపారావు, మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావులు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర బడ్జెట్‌పై తయారు చేసిన నివేదికను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టగా, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు బలపరిచారు. చర్చావేదికలో చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్రావు సూర్యనారాయణ, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, రైతు కూలీ సంఘం గౌరవాధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, అక్కినేని భవానీప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, వివిధ సంఘాల నేతలు ప్రసంగించారు. పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్‌ను సవరించి వ్యవసాయ రంగానికి రూ. 5 లక్షల కోట్లు, ఆహార భద్రతకు రూ. 3 లక్షల కోట్లు, ఉపాధి హామీకి రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని సమావేశంలో తీర్మానించారు.



చర్చావేదికలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు

పౌష్టికాహారంపై అశ్రద్ధ వహిస్తే సహించేది లేదు : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , జూలై 25 : చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పఠాన్‌పేట, రామరాజుపాలెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యావిధానం, గర్భవతులు, బాలింతలకు ఆరోగ్య పరిరక్షణపై ఆరా తీశారు. పిల్లలకు ఇచ్చే పోషకాహారం, రిజిస్టర్‌ను సరిగా నిర్వహించని రామరాజుపాలెం, పఠాన్‌పేట అంగన్వాడీ కార్యకర్తలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

అనంతరం కలెక్టర్ రామరాజుపాలెం మండల పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులను గణితంపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ, సీడీపీవో గ్లోరీ, సూపర్‌వైజర్లు ఉషశ్రీ, రేవతి, డీవైఈవో శేఖర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు జరిగేనా?



హంసలదీవి సమీపంలో నీటమునిగిన పొలాలు

» పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

» శిథిలావస్థలో అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు

» నీరు దిగువకు వెళ్లడం లేదని రైతుల ఆందోళన

కోడూరు : ఇటీవల కురిసిన వర్షాలకు కోడూరు దిగువ ప్రాంత భూముల్లో నీరు నిలిచిపోవటంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు జరిగేనా? అంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని హంసలదీవి, పాలకాయితిప్ప, దింటిమెరక, ద్వారకా



శిథిలావస్థలో ఉన్న అవుట్ పాల్ స్లూయిస్ గేట్లు

గ్రామాల సమీపంలో పొలాల్లోని వర్షపు నీరు బయటకుపోకుండా వర్షపునీరు నిలిచింది. పాలకాయితిప్ప అవుట్‌పాల్ స్లూయిస్, కోడూరు అవుట్‌పాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా పాడవటమే దీనికి ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు. అవుట్ పాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా లేని కారణంగా సముద్రపు పోట్లకు ఉప్పునీరు నేరుగా ఎగువకు రావటంతో పొలాల్లోని వర్షపు నీరు దిగువకు వెళ్లటం లేదని ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లలో కోడూరు మండల పరిధిలోని సుమారు 4 వేల ఎకరాల్లో సాగు జరగలేదని, ఈ సంవత్సరమైనా సాగు చేసేందుకు అవకాశం ఉంటుందని ఆశతో ఎదురుచూస్తున్నామని, ప్రస్తుతం కురిసిన వర్షానికి మా ఆశలు నిరాశలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత డ్రెయినేజీ శాఖాధికారి వెంకటేశ్వరరావును వివరణ కోరగా, ఉప్పునీరు ఎగువకు రాకుండా పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద తాత్కాలికంగా ఇసుక మూటలు వేస్తున్నట్టు, శాశ్వత పరిష్కారానికి అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణ ఎస్టిమేట్లు వేసి ప్రభుత్వానికి అందించినట్టు తెలిపారు.

అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి




అడుసుమిల్లి సాయిబాబు

అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్లు పూర్తిగా పాడుకావటం వల్లే పొలాల్లోని నీరు దిగువకు పోవటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు రక్షణ చర్యలు చేపట్టాలి.

బీడువారిన బతుకులు : పుల్లయ్య



గత నాలుగు సంవత్సరాలుగా సాగు భూవి.. బీడు మారి జీవనోపాధి లేక వలస వెళ్లాల్సిన పరిస్థితి.. ఈ సంవత్సరమైనా సాగు చేద్దామంటే వర్షపు నీటితో పొలాల్లో మునిగిపోయాం, ప్రభుత్వమే ఆదుకోవాలి.





ఇంట్లో నిర్జీవంగా పడి ఉన్న శ్రీహరిరావు (ఫైల్‌ఫొటో)

44 నెలల తర్వాత..

» సీబీసీఐడీకి డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసు

» వైసీపీ ప్రభుత్వంలో పురోగతి లేని కేసు

» స్పందించిన కూటమి ప్రభుత్వం

అవనిగడ్డ, జూలై 26 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి పురోగతి లేకుండా పడిఉన్న డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసును కూటమి ప్రభుత్వం సీబీసీఐడికి అప్పగించటంతో 44 నెలల తర్వాత కేసు ఫైలు ముందుకు కదిలింది. కృష్ణా జిల్లావ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన డాక్టర్ శ్రీహరిరావు హత్యోదంతంలో వైసీపీ ప్రభుత్వం, పోలీసుల నిర్లిప్త వైఖరిపై తీవ్ర స్థాయిలో దుమారం రేగింది. జిల్లాలో మంచి వైద్యుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ శ్రీహరిరావును 2020నవంబర్ 27వ తేదీ అర్థరాత్రి ఆయన ఇంటి వద్దే దుండగులు హత్య చేశారు. నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు అత్యంత సన్నిహితుడిగా, వ్యాపార భాగస్వామిగా ఉన్న డాక్టర్ శ్రీహరిరావు హత్య జరిగిన రోజు రాత్రి అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవటం, కొన్ని నెలలపాటు కేసులో ఏలాంటి పురోగతి లేకపోవటం.. రాజకీయ కోణంపై నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. సీసీ కెమెరా నిఘాను తప్పించుకుని దుండగులు ఆయన ఇంట్లోకి చొరబడి డాక్టర్‌ను హత్య చేయటంతో ఆయనతో సన్నిహితంగా ఉండే వారు చేసిన పనే అని స్థానికులు భావిస్తున్నారు.

ముందుకు సాగని దర్యాప్తు..

డాక్టర్ శ్రీహరిరావు హత్య జరిగిన వెంటనే నాటి జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, అప్పటి డీఎస్పీ మెహబూబ్‌బాషాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితులను వెంటనే పట్టుకుంటామని ప్రకటించారు. హత్య జరిగి సంవత్సరాలు గడిచిపోతున్నా ఒక్క అనుమానితుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకోకపోవటంతో నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. తెలుగుదేశం, జనసేన పార్టీలు హత్య ఉదంతంపై సీబిఐ దర్యాప్తును, బుద్ధప్రసాద్ గూగుల్ టే అవుట్ పద్ధతిలో దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసులో నిందితులను తేలుస్తామని ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో ప్రకటించారు. దాదాపు 44 నెలల క్రితం జరిగిన హత్యపై ఎలాంటి పురోగతి లేకుండాపోయిన కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీసీఐడికి అప్పగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకోవటంతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



గన్నవరం కోర్టు వద్ద పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నేతలు

టీడీపీ నేతలపై కేసు కొట్టివేత

గన్నవరం/పెనమలూరు, జూలై 26 : టీడీపీ నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసును గన్నవరం కోర్టు శుక్రవారం కొట్టివేసింది. గతేడాది ఫిబ్రవరి 20వ తేదీన గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. కార్యాలయ ఆవరణలో కారుకు నిప్పంటించటంతో పాటు పలు కార్లను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన టీడీపీ కార్యకర్తలను కొట్టారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడె ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని వైసీపీ మూకల దాడులను విలేకరుల సమావేశం ద్వారా ఖండించారు. దీనిపై బోడె ప్రసాద్‌తో పాటు టీడీపీ నేతలు గరిమెళ్ల నరేంద్ర చౌదరి, పుట్టా సురేష్, పొట్లూరి వెంకట సుధీర్, పెందుర్తి శ్రీకాంత్, కంచర్ల సూర్యప్రకాష్, యార్లగడ్డ మోహన కృష్ణ, అట్లూరి శ్రీనివాస్, కొలుసు వరప్రసాద్, మేకల కోటేశ్వరరావు, పిడికిటి సతీష్‌బాబు, కుందేటి రఘుబాబులపై గన్నవరం స్టేషన్‌లో అక్రమ కేసులు నమోదు చేశారు. 12మందిపై గన్నవరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా సాక్షులను కోర్టు విచారించింది. నేరం రుజువు కాకపోవటంతో న్యాయాధికారి సీహెచ్ శ్రీనివాసబాబు కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. కేసులో తమ వాదనలను బలంగా వినిపించిన టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు సుంకర వెంకట సురేష్, శొంఠి వీరబాబులకు టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



ఇసుక స్టాక్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనలు పాటించండి

జగ్గయ్యపేట రూరల్, జూలై 26: ప్రాధాన్యతాక్రమంలో వాహనాలకు ఇసుక లోడింగ్ చేసి పంపాలని తహసీల్దార్ శేషగిరి సూచించారు. అనుమంచిపల్లి ఇసుక స్టాకుయార్డును ఎంపీడీవో రమేష్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇసుక పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయని వస్తున్న సమాచారంతో అప్రమత్తమైన అధికారులు రవాణా బిల్లుల పంపిణీ తదితర అంశాలపై వివరాలు సేకరించారు. లారీలకు ఇసుక ఎత్తవద్దని లబ్ధిదారులకు ట్రాక్టర్‌ల ద్వారానే పంపిణీ చేయాలన్నారు. స్టాకు యార్డు వద్ద విధులకు డుమ్మా కొట్టిన అధికారుల వివరాలు సేకరించిన సమాచారాన్ని నందిగామ ఆర్డీవోకు అందించామని ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటాయని తహసీల్దార్ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు..

ఒకే వే బిల్లుపై రెండు ట్రాక్టర్‌లలో ఇసుక తరలిస్తున్నారన్న ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి ఫిర్యాదు మేరకు రెండు ట్రాక్టర్‌లతో పాటు ముగ్గురిపై 337, 318(4), 303(2) బీఎన్ఎస్ 27 ఓల్టా చట్టం కింద కేసు నమోదు చేసినట్టు చిల్లకల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. బలుసుపాడుకు చెందిన లింగం లింగారావు, గుంజా వెంకన్నలు ఇసుకను తరలిస్తుండగా ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. స్టాకు యార్డు వద్ద అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న షేక్ సైదా సహా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

బోన్ డెన్సిటీ పరీక్షలు తప్పనిసరి



ప్రభుత్వాసుపత్రి: వయస్సు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనం అవుతాయని, క్రమం తప్పకుండా బోన్ డెన్సిటీ పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ వైద్యుడు చల్లా హరికుమార్, వయోవృద్ధ చారిటబుల్ ట్రస్టు ట్రస్టీ బొండా సుజాతలు సూచించారు. శుక్రవారం టోరెంట్ ఫార్మా ఆధ్వర్యంలో చుట్టుగుంట సెంటర్లో ఉచిత బోన్ డెన్సిటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు చేయించుకోవడం వల్ల ఎముకలను పరి రక్షించుకోవచ్చన్నారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. టోరెంట్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

లబ్బీపేట, జూలై 26: ప్రస్తుత సమాజానికి అనుగుణంగా నూతన నైపుణాలను, టెక్నాలజీలను నేర్చుకోవడం ఎంతో అవసరమని సీనియర్ ట్రైనర్ మైక్రోసాఫ్ట్ బెంగళూర్ ఎ.మల్లిఖార్జున్ తెలిపారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం కంప్యూటర్ సైన్స్ విభాగం, ఐసీటీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజులు జరిగిన ఫ్యాకల్టీ డెవల్‌మెంట్ ప్రోగ్రామ్ ముగింపు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ కల్పన

కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాకల్టీ డెవల్‌మెంట్ ప్రోగ్రామ్ అధ్యాపకుల అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్‌బాట్స్, కాపిలాట్, ఓపెన్ ఐ అనే అంశాలపై పట్టు సాధించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, కళాశాల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.మాధవి, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగ అధ్యాపకులు, ఇతర కళాశాలలకు సంబంధించిన ఆసక్తి కలిగిన అధ్యాపకులు పాల్గొన్నారు.



రాణిగారితోటలో జరిగిన అవగాహన ర్యాలీలో కమిషనర్



35వ డివిజన్‌లో



సత్యనారాయణపురంలో



వరలక్ష్మీనగర్‌లో

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

రాణిగారితోట, జూలై 26: దోమకాటు వలన ప్రజలు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే గా నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర తెలిపారు. శుక్రవారం రాణిగారితోట 18వ డివిజన్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 64డివిజన్లలో ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డివిజన్‌లో పర్యటించిన ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు పలు సమస్యలు వివరించడంతో వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ.మహేష్, అడిషనల్ కమిషనర్ ప్రాజెక్టు కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, శివరామకృష్ణ, టీడీపీ నాయకులు వేముల దుర్గారావు, రాయి రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: సమష్టి కృషితోనే దోమల నిర్మూలన సాధ్యమని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీ మూర్తి అన్నారు. సత్యనారాయణపురంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. దోమల నిర్మూలనపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జైపాల్, హెల్త్, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

భారతీనగర్: నాల్గవ డివిజన్ పరిధిలోని వరలక్ష్మీ నగర్ కాలనీలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వీఎంసీ అధికారులు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలో ర్యాలీ జరిగింది. సచివాలయం అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆరోగ్యశాఖ సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

పాత రాజరాజేశ్వరి పేట: 35వ డివిజన్‌లో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

భవానీపురం: 44వ డివిజన్‌లో కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అప్పలస్వామి క్వారీ, పెద్ద సాయిబాబా గుడి ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి ర్యాలీలో పాల్గొని ప్రజలకు పలు అంశాలను వివరించారు. 45వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు సితార సెంటర్ సమీపంలోని రాముక్వారీ సెంటర్‌లోని కొండ ప్రాంతంలో ఇంటింటికి తిరుగుతూ శుక్రవారం డ్రై డే ఆవశ్యకతను కరపత్రాల ద్వారా వివరించారు.

విద్యాధరపురం: 40వ డివిజన్‌లో టీడీపీ అధ్యక్షుడు పీవీ సుబ్బయ్య, ఎస్‌ఓ రజాక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ విజయకృష్ణ సూపర్ బజార్ వీధి, మంగళగిరి పరాంకుదాస్ రోడ్డులో జరిగింది. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

పాయకాపురం, జూలై 26 : ఆంధ్రప్రదేశ్ కమ్మవారి ఐక్య సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేశారు. 64వ డివిజన్ కండ్రిక కాలనీకి చెందిన కొత్తపల్లి జ్యోతి (ఇంటర్) పుస్తకాల కొనుగోలు నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని పైపులరోడ్డు వద్ద గల సమితి కార్యాలయంలో అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో సమితి సభ్యులు పరుచూరి ప్రసాద్, కామేశ్వరరావు ఉన్నారు.



సైనికులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులతో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కె.కల్యాణవీణ

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

కృష్ణలంక, జూలై 26 : 25వ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి కె. కల్యాణవీణ అధ్వర్యంలో జిల్లాసైనిక సంక్షేమ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుల సేవలను కొనియాడుతూ వారిని ఘనంగా సత్కరించారు. యుద్ధ సమయంలో జరిగిన సంఘటనలు, అనుభవాలను మాజీ సైనికులు సవివరంగా వివరించారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, జిల్లాసైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్

చిట్టినగర్, జూలై 26: డివిజన్ ప్రజలకు ఇబ్బంది కలగకుండా మంచినీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ వాటర్ సప్లయ్ అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్‌లో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఆయా ప్రాంతాల్లో వాటర్ పైపులైన్లు పరిశీలించి మరమ్మతులు నిర్వహించి సమస్యను పరిష్కరించాలన్నారు. చిట్టినగర్ మట్టా లాజరస్ నగరపాలక సంస్థ పాఠశాలలో కొన్ని రోజులుగా వాటర్ సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హెచ్‌ఎం కార్పొరేటర్‌కు తెలియజేయగా ఆయన వెంటనే వాటర్ సప్లయ్ అధికారులను పిలిపించి సమస్యను పరిష్కరించారు. పలువురు బీజేపీ, టీడీపీ నాయకులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

● మహిళపై కేసు నమోదు

పాయకాపురం, జూలై 26 : నగరపాలక సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన ఓ మహిళపై నున్న రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం సుందరయ్యనగర్‌కు చెందిన కట్టా శశికుమారి నగరపాలక సంస్థలో కాంట్రాక్ట్ ఉద్యోగినిగా విధులు నిర్వహిస్తుంది. వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు ధనలక్ష్మితో పరిచయం ఉంది. పరిచయాన్ని అడ్డం పెట్టుకుని ధనలక్ష్మితో పాటు మరో 15 మందికి నగరపాలక సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పింది. 2020లో ఒక్కొక్కరికి వద్ద నుంచి రూ. 30 వేలు చొప్పున 15 మంది వద్ద నుంచి రూ. 4,50,000 తీసుకుంది. అప్పటి నుంచి ఉద్యోగం ఇప్పించకుండా సాకులు చెబుతూ వచ్చింది. గురువారం కట్టా శశికుమారిని నిలదీసిన బాధితులు సరైన సమాధానం రాకపోవడంతో నున్న రూరల్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి : ఎమ్మెల్యే గద్దె



స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, జూలై 26: తాగునీటి సమస్యను పరిష్కరించడానికి పూర్తి స్థాయిలో దృష్టి పెట్టామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. స్థానిక 5వ డివిజన్లోని క్రీస్తురాజుపురంలో ఆయన శుక్రవారం పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక క్రీస్తురాజుపురం రెండు రకాలుగా నష్టపోయిందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ. 7 కోట్లతో క్రీస్తురాజుపురం ప్రధాన రహదారిని అభివృద్ధి చేశామని, రూ. 75 లక్షలు వెచ్చించి బ్లాక్ టాప్ వేస్తే రోడ్డు మన్నికగా ఉంటుందని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఆ పని చేయలేకపోయిందని తెలిపారు. కొండప్రాంత వాసులను దృష్టిలో ఉంచుకుని నీటి సమస్యను పరిష్కరించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గుడిపాటి కెనడి, షేక్ షరీఫ్, కోడూరు సుబ్రహ్మణ్యం, దోమకొండ రవి, సిద్దెల వివేక్, ఏఈ నాగేశ్వరరావు, ఏసుపోగు మోజెష్, చదలవాడ శ్రీనివాసరావు, గద్దే రమేష్, కొండేటి ఇజ్రాయిల్, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణ, సైబర్ క్రైమ్‌పై అవగాహన

వన్‌టౌన్, జూలై 26: కేబీఎన్ కాలేజీలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం మాదక ద్రవ్యాల నివారణ, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కేబీఎన్ కాలేజీలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఈ దశలో మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందని అన్నారు. సిటీ సైబర్ క్రైం సీఐ పి. శ్రీను , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి నారాయణరావు, కొత్తపేట సీఐ టి. గణేష్, సైబర్ క్రైం సీఐ సీహెచ్ ఆర్యే మూర్తి, కొతపేట ఎస్‌ఐ నరేంద్ర, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డి. పవన్‌కుమార్, ఎస్. సాంబశివరావు, కల్మాబేగం తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

అజిత్‌సింగ్‌నగర్ : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అజిత్‌సింగ్‌నగర్ పోలీసు సీఐ గురుప్రకాష్ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని కేర్ అండ్ షేర్ పాఠశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నకిలీ అకౌంట్లతో సోషల్ మీడియాలో పరిచయాలు పెంచుకోవడం, వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడం తదితర అంశాలపై తగు జాగ్రత్తలను వివరించారు. ఎస్సై మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మనోబంధు ఫౌండేషన్ సేవలు అభినందనీయం

● అంబులెన్స్‌ను ప్రారంభించిన డాక్టర్ ఇండ్ల విశాల్‌రెడ్డి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ ఇండ్ల విశాల్‌రెడ్డి

వన్‌టౌన్, జూలై 6: మానసిక రోగుల కోసం మనోబంధు ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఇండ్లాస్ శాంతివన్ రిహాబిలిటేషన్ డైరెక్టర్ ఇండ్ల విశాల్‌రెడ్డి అన్నారు. గత మూడేళ్లగా అనాథలుగా వీధుల్లో తిరుగుతున్న మానసిక రోగులకు సేవలందిస్తున్న మనోబంధు ఫౌండేషన్ ఒక కొత్త అంబులెన్స్‌ను సమకూర్చుకుంది. సూర్యారావుపేటలోని ఇండ్లాస్ ఆసుపత్రిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మానసిక రోగులను చేరదీసి, ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించి, స్వస్థత పొందాక తిరిగి వారిని స్వస్థలాలకు చేర్పించే కార్యక్రమాన్ని మనోబంధు సంస్థ తీసుకోవడం అభినందనీయమన్నారు. సంస్థ మేనేజింగ్ ట్రస్టీ భూపతిరాజు రామకృష్ణం రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికే ఒక అంబులెన్స్ ఉందని, దాతల సహకారంతో మరొక కొత్త అంబులెన్స్‌ను సమకూర్చుకున్నట్లు చెప్పారు. మనో బంధు ట్రస్టీ మానసిక వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ, మనోబంధు వంటి సంస్థలకు ప్రభుత్వం సహకరిస్తే రాష్ట్రంలో ఎక్కడా కూడా వీధుల్లో అనాథ మానసిక రోగులు ఉండరని తెలిపారు. మానసిక వైద్యుడు సంతోష్ గౌడ్, డాక్టర్ ఊహా మానస, డాక్టర్ ఇండ్ల స్వప్న, పీజీ ట్రైనీలు పాల్గొన్నారు.

యువతకు అండగా ఉంటాం: గద్దె క్రాంతికుమార్

భారతీనగర్, జూలై 26: యువతకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని టీడీపీ యువ నాయకుడు గద్దె కాంత్రి కుమార్ అన్నారు. తూర్పు పరిధి గురునానక్ కాలనీ రోడ్డులో నాక్ కల్యాణ మండపంలో గద్దె క్రాంతికుమార్ ఆధ్వర్యంలో యూత్ ఫోర్స్ పేరుతో యువకులతో శుక్రవారం సాయంత్రం సమావేశ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి యువత భవితను నిర్వీర్యం చేశారని, తూర్పులో ఎందరో యువకులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, వారందరికీ కూడా ఒక వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

గాంధీ కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌పై ఫిర్యాదు

వన్‌టౌన్: గవర్నరుపేటలోని గాంధీ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌పై ఆ బ్యాంక్ డైరెక్టర్లు కళ్లే నాగేశ్వరరావు, సుబ్బారావులు గురువారం రాత్రి సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము సంతకాలు చేసిన తెల్లకాగి తాలను చైర్మన్ వద్ద ఉంచుకుని, ఇటీవల జరిగిన బ్యాంకు గొడవల నేపథ్యంలో తమను సస్పెండ్ చేస్తామంటూ చైర్మన్ బెదిరిస్తున్నాడని సీఐకి వివరించారు. దీంతో చైర్మన్‌తో సీఐ ఫోన్‌లో మాట్లాడగా తన వద్ద ఎటువంటి కాగితాలు లేవని చెప్పినట్లు సమాచారం. బ్యాంకులో మొత్తం 12 మంది డైరెక్టర్ల వద్ద నుంచి తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకుని వారి వద్దే ఉంచుకున్నారని సీఐకి చెప్పారు.

భారతీయ అథ్లెట్లకు మద్దతుగా ఒలింపిక్ రన్

భారతీనగర్, జూలై 26: పారిస్‌లో జరిగే 2024 ఒలింపిక్స్‌లో పాల్గొనే భారతీయ అథ్లెట్లకు మద్దతుగా ఆంధ్రా లయోలా కళాశాల క్యాంపస్‌లో శుక్రవారం ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఈ ఒలింపిక్స్‌లో భారతదేశం పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ భారత జట్టుకు మద్దతు తెలిపారు. స్పోర్ట్స్ డైరెక్టర్ ఫాదర్ కిరణ్, కె.సుజాత, సహాయభాస్కరన్, పాల్గొన్నారు. ● ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో సెల్ఫ్ హీలింగ్ కాంక్రీట్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. మలేషియాకు చెందిన పుత్ర యూనివర్సిటీ అధ్యాపకులు రాకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఒ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ పాదర్ బాలస్వామి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ సిస్టర్ క్యాండీ పాల్గొన్నారు.

విజయవాడ	అలంకార్4k	కైకలూరు	మాగంటి థియేటర్
విజయవాడ	జి3 రాజ్ యువరాజ్	బంటుమిల్లి	శ్రీదుర్గా పి.ప్యాలెస్
విజయవాడ	ఊర్వశి INOX	లక్ష్మీపురం	అంజనాసినీమ్యాక్స్
ఎం.జి.రోడ్డు	లైలా INOX	హనుమాన్‌జంక్షన్	శ్రీకృష్ణాటాకీస్
లబ్బీపేట	పివిపి సినీపోలీస్	నూజివీడు	ద్వారక కాంప్లెక్స్
లబ్బీపేట	పివిఆర్ సినిమాస్	ఆగిరిపల్లి	అనుడీలక్స్
బెంజిసర్కిల్	క్యాపిటల్ సినిమాస్	ఇబ్రహీంపట్నం	బాలాజీఐకానియా
పటమట	LEPL INOX	కొండపల్లి	శివకృష్ణ
అశోక్‌నగర్	పవర్1 సినిమాస్	కంచికచర్ల	శ్రీనివాస
వన్‌టౌన్	సౌమ్య	నందిగామ	లక్ష్మీప్రసన్న
పాయకాపురం	తారాస్క్రీన్స్	జగ్గయ్యపేట	శ్రీఅలంకార్‌సినిమాస్
పాయకాపురం	రవీంద్రసినిమాస్	మైలవరం	నారాయణ థియేటర్
కానూరు	శ్రీ విజయలక్ష్మీ	తిరువూరు	శ్రీకృష్ణాటాకీస్
పోరంకి	బాలాజీసినీవిల్లా	విస్సన్నపేట	శ్రీరామ్
కంకిపాడు	శ్రీరామచంద్ర	గంపలగూడెం	రామమోహన్
ఉయ్యూరు	దీపక్‌మహల్		
పామర్రు	గగన్‌మహల్		
కూచిపూడి	సత్యసాయి		
చల్లపల్లి	సాగర్		
అవనిగడ్డ	వెంకటేశ్వర		
మచిలీపట్నం	రేవతి పి. ప్యాలెస్		
మచిలీపట్నం	PVR వరం సెంట్రల్‌మాల్		
గుడివాడ	ABR కాంప్లెక్స్		
గుడివాడ	జి3సింధూర		
పెడన	శ్రీకృష్ణతులసి		
గుడ్లవల్లేరు	రామకృష్ణ		

ఓయూ కళాశాలల్లో బీఈ/బీటెక్ లేటరల్ ఎంట్రీ

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ)- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజ్ సహా వర్సిటీ అనుబంధ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి కళాశాలలో స్పెషలైజేషన్‌కు 30 సీట్లు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు ఉంటాయి. వారాంతాలు, సెలవు రోజుల్లో కూడా అందరి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని క్లాసెస్ నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000. వర్సిటీ నిబంధనల మేరకు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.



అర్హత: ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. చేరదలచుకున్న ఇంజనీరింగ్ కాలేజీకి 100 కి.మీ.ల పరిధిలో ఉన్న కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు/సంస్థల్లో పని చేస్తూ ఉండాలి. కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో స్పెషలైజేషన్‌కు సంబంధించి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 27
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 4
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 8
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 17
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 24
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7kP3x2Cలో చదవండి.

కోటక్ కన్య స్కాలర్‌షిప్

కోటక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024-25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తిచేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు; బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ.లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.kotak.com, www.b4s.in/it/kkgs2

పోటీ నీకే - జయం నీదే

కొత్త పుస్తకం

పోటీ పరీక్షలు అంటే గ్రామీణ యువతలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అయితే వీరిలో ఎక్కువ మంది గ్రూప్స్, టీచర్ వంటి ఉద్యోగాల పట్ల దృష్టిపెడతారు కానీ సివిల్స్ గురించి ఆలోచించరు. రాయాలని ఉన్నా అవి పెద్ద పెద్ద పట్టణాల్లో చదువుకున్నవారికి లేదా టాప్ ర్యాంకర్లకు ఉద్దేశించిన ఉద్యోగాలని భావిస్తుంటారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేసేందుకు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రావులపాటి సీతారామారావు 'పోటీ నీకే - జయం నీదే' పేరుతో పుస్తకం రాశారు.

ఏదో పనిమీద బయటకు వెళ్లినప్పుడు తనను కలిసిన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సందేహాలు వెలిబుచ్చేవారు. తను వారికి ఇచ్చిన గైడెన్స్ అందరికీ చేరాలనే ఉద్దేశంతో రచయిత ఈ పుస్తకం రాశారు.


విజయం సాధించాలంటే పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉండాల్సిన పనిలేదు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకుని, దాని కోసం క్రమపద్ధతిలో కష్టపడాలని చెబుతారు. పోటీ పరీక్షల కోసం ప్లానింగ్ ఎలా చేసుకోవాలి? ఎన్ని గంటలు చదవాలి? పరీక్షల కోసం సిద్ధమయ్యే వారికి మెంటార్ అవసరమా? అని చెబుతూ తనతో సహా గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు సివిల్స్ వంటి పరీక్షల్లో ఎలా విజయం సాధించారో స్ఫూర్తి కలిగించేలా సవివరంగా చెప్పారు సీతారామారావు. పరీక్షలు రాసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని అధిగమించిన తీరును పుస్తకంలో వివరించారు.

పరీక్షలకు సిద్ధంకావడానికి ముందే అకడమిక్ పరీక్షలకు, పోటీ పరీక్షలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా గ్రహించగలగాలి. చదువుకోవడానికి మూడ్ ఉండాలి, వారం-వర్జ్యం లాంటివి చూసుకోవాలనే మూఢనమ్మకాలు దరిచేరనీయ వద్దు. లక్ష్యం పెద్దగా నిర్ణయించుకున్నప్పుడు అందుకు అనుగుణంగానే ప్రిపేర్ కావాలి అని చెబుతారు. సెల్ఫ్ మోటివేషన్ పొందడానికి ఏమి చేయాలి? కొంత మంది సివిల్స్ అభ్యర్థులు ఎలా మోటివేట్ అయ్యారు అని వివరించారు. ఇవి సివిల్స్ అభ్యర్థులకు మాత్రమే కాకుండా అన్ని పరీక్షల విద్యార్థులకు ఉపయోగపడతాయి. ఈ పుస్తకాన్ని సాహితి ప్రచురణలు వారు ప్రింట్ చేశారు.

వెల: రూ.90/-

ప్రతులకు: సాహితి ప్రచురణలు 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ-520 002.

ఫోన్: 8121098500



నవ్య | చిత్రజ్యోతి

ఆ పాటలో కేసీఆర్‌ను తలుచుకున్నామంతే!



రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని 'మార్ ముంతా ఛోడ్ చింతా' పాట వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ స్పందించారు. ఆ పాటలో 'ఇప్పుడేం చేద్దాం' అంటూ కేసీఆర్ అన్న మాటను ఉపయోగించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహించాయి. ఇటీవల ఇచ్చిన ఈ పాట గురించి ఇచ్చిన వీడియో ఇంటర్వ్యూలో మణిశర్మ వివరణ ఇస్తూ 'సోషల్ మీడియాలో వచ్చే మీమ్స్ ఆధారంగా ఆ పాట ఉంటుంది. కేసీఆర్ అంటే అందరికీ గౌరవం. ఆయన సరదాగా చెప్పిన ఓ పదాన్ని ఇందులో తీసుకున్నామంతే. ఎవరినీ నొప్పించడం మా ఉద్దేశం కాదు. నా 27 ఏళ్ల కెరీర్‌లో ఎవరినీ నొప్పించలేదు. ఆ పాటలో కేసీఆర్‌ను ఒకసారి తలచుకున్నాం. కేవలం అది వినోదం కోసమే. దయచేసి అందరూ అలాగే భావించండి' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' లోని మూడో పాట 'క్యా లఫ్డా' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రామ్, హీరోయిన్ కావ్యా థాపర్ పోస్టర్ రొమాంటిక్‌గా ఉంది. ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్' విడుదల కానుంది.

మనవడి స్కూలుకు రజనీ



పాఠశాలకు వెళ్లేందుకు మారాం చేసిన తన మనవడిని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ స్వయంగా స్కూల్‌కు తీసుకెళ్లి వదిలిపెట్టారు. మనవడితో కారులో రజనీ స్కూల్‌కు వెళుతున్న ఫోటోను ఆయన చిన్న కుమార్తె సౌందర్య శుక్రవారం సామాజికా మాధ్యమాల్లో షేర్ చేస్తూ.. 'ఈ రోజు నా కుమారుడు స్కూల్‌కు వెళ్లనని మొండికేయడంతో వాడి సూపర్ హీరో తాత (రజనీ) పాఠశాలకు స్వయంగా తీసుకెళ్లారు. వెండితెర అయినా, నిజజీవితంలో అయినా ఎలాంటి పాత్రనైనా నా తండ్రి అద్భుతంగా పూర్తి చేస్తారు' అని పేర్కొన్నారు. కాగా, సౌందర్య కుమారుడు వేద్‌ను పాఠశాల తరగతి గదిలోకి తీసుకెళ్ళిన రజనీకాంత్‌ను ఇతర పిల్లలు సంభ్రమాశ్చర్యాలతో చూశారు. వెండితెరవేల్పు రజనీ తమ కళ్లముందు ప్రత్యక్షమవ్వడంతో వారి ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఇదిలావుంటే, 'వేట్టయాన్' సినిమా పూర్తి చేసిన రజనీకాంత్ ఇపుడు లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో గ్యాప్ లభించడంతో ప్రస్తుతం ఆయన స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, (చెన్నై)

షారుక్ ఖాన్ రూ.40 కోట్లు.. అమితాబ్ రూ.30 కోట్లు...

అనంత్ అంబానీపై సినీ సెలెబ్రిటీల కానుకల వర్షం...



ఆభరణాల సెట్

అమితాబ్ బచ్చన్ దంపతులు, అభిషేక్, ఐశ్వర్య కలసి ఈ వధూవరులకి రూ.30 కోట్ల విలువైన ఆభరణాల సెట్‌ను (పచ్చల హారాన్ని) బహుమతిగా ఇచ్చారు.




ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ల వివాహం.. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అత్యంత ఖరీదైన పెళ్లిల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిరకాల వేడుకకు అంబానీ కుటుంబం చేసిన హంగామాని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారు. ఆకాశంలో చంద్రుడు చుట్టూ ఉన్న అసంఖ్యాక తారల్లా.. అంబానీ పెళ్లిలో అనేక రంగాల్లోని అగ్ర తారలందరూ సందడి చేసి దేదీప్యమానంగా వెలుగులు విరబూశారు. ఈ విలాసవంతమైన పెళ్లికి అదిరిపోయే రేంజ్‌లో అత్యున్నతమైన ఏర్పాట్లకు తోడు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ తారలు హాజరవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు వచ్చిన కొందరికి అంబానీ కుటుంబం అతిథి మర్యాదలతో దాదాపు రూ.రెండు కోట్ల విలువ చేసే వాచీలను గిఫ్ట్‌గా ఇచ్చారు. అలాగే సినీ సెలబ్రిటీలు కూడా ఈ కొత్త జంటకు కానుకలు అందించడానికి క్యూ కట్టడం విశేషం. మిగతా పరిశ్రమల నటీనటులు ఏయే బహుమతులు ఇచ్చారో తెలియదు కానీ.. బాలీవుడ్ తారలు ఇచ్చిన బహుమతుల వివరాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఎవరు ఏమేమిచ్చారో ఇప్పుడు తెలుసుకుందాం.



రూ.40 కోట్ల విల్లా

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఈ నూతన జంటకు ఫ్రాన్స్‌లో రూ.40 కోట్లు ఖరీదు చేసే ఓ విలాసవంతమైన భవంతిని కానుకగా ఇచ్చారు.



రూ.20 కోట్ల రోల్స్ రాయిస్

'కల్కి 2898 ఏ.డీ'తో తెలుగువారికి చేరువైన దీపికా పదుకొనే, తన భర్త రణ్‌వీర్ రూ.20 కోట్లు పెట్టి ఓ రోల్స్ రాయిస్ కారును వెడ్డింగ్ ప్రజంటేషన్‌గా ఇచ్చారు.



రూ.15 కోట్ల బైక్

సల్మాన్ ఖాన్ రూ.15 కోట్ల విలువైన స్పోర్ట్స్ బైక్‌ను కానుకగా ఇచ్చారు.

రూ.తొమ్మిది కోట్ల మెర్సిడెస్

రణ్‌బీర్ కపూర్, అలియా భట్ జంట ఈ కపుల్‌కు రూ.తొమ్మిది కోట్ల విలువైన మెర్సిడెస్ కారును గిఫ్ట్‌గా ఇచ్చారు.









వీరితో పాటు, అక్షయ్ కుమార్ రూ.60 లక్షలు విలువ చేసే బంగారపు పెన్నును.. సిద్ధార్థ్ మల్హోత్రా, కియారా అద్వానీ దంపతులు రూ.25 లక్షలు విలువ చేసే హ్యాండ్ మేడ్ శాలువాను.. విక్కీకౌశల్, కత్రినా కైఫ్ దంపతులు రూ.19 లక్షల బంగారు గొలుసును బహూకరించారు.

మూడేళ్ల కష్టం.. కమిటీ కుర్రోళ్లు



అంతా కొత్తవారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం హీరో సిద్ధు జొన్నలగడ్డ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. ఓ సినిమాకు ఎక్కువ ఖర్చు పెడతాం, మరో చిత్రానికి తక్కువ ఖర్చు పెడతాం.. తేడా అంతే. ఈ సినిమాలో విజువల్స్ బాగున్నాయి. కొత్తవారితో ఇంత మంచి చిత్రం తీయడం మాములు విషయం కాదు. దర్శకుడు యదు వంశీకి ఇదే మొదటి సినిమా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఈ సినిమా హిట్ అయి అందరికీ లాభాలు తేవాలి' అని కోరారు. చిత్ర సమర్పకురాలు నిహారిక మాట్లాడుతూ 'మూడేళ్ల కష్టం ఈ సినిమా. వీరంతా మూడేళ్లుగా పని చేస్తునే ఉన్నారు. అంతా కష్టపడి మంచి సినిమా చేశాం. ఆగస్టు 9న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మా సినిమాలో నటించిన 11 మంది సిద్ధులాగా ఎంతో కష్టపడుతుంటారు. మా టెక్నికల్ టీమ్ సపోర్ట్‌తో సినిమాను బాగా తీయగలిగాను. నిహారిక, ఫణి లేకపోతే చిత్రం ఇలా వచ్చేదే కాదు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ సహకారం మరువలేనిది' అని చెప్పారు దర్శకుడు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన యూత్‌ఫుల్ మూవీ ఇదని నిర్మాత ఫణి అడపాక, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్ చెప్పారు.

'పావలా' శ్యామలకు సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం



ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న సీనియర్ నటి 'పావలా' శ్యామలకు హీరో సాయి దుర్గతేజ్ ఆర్థిక సాయం చేశారు.. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యుల ద్వారా శ్యామలకు లక్ష రూపాయలు పంపించారు. శ్యామల ఎమోషనల్ అయి 'మా అమ్మాయికి ఆపరేషన్ అయినప్పుడు సాయి దుర్గతేజ్ ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. వచ్చి కలుస్తానన్నారు. చాలా రోజులైంది. మరిచిపోయారేమో అనుకున్నా. గుర్తు పెట్టుకుని సాయం చేసినందుకు ధన్యవాదాలు' అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యువెల్ థీఫ్' సీనియర్ నటి ప్రేమ కీలక పాత్ర పోషించారు. పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఇటీవలే సినిమా టీజర్‌ని, ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'నేను సూపర్‌స్టార్ కృష్ణగారి అభిమానిని. ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ తరం ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్ థ్రిల్లర్. త్వరలోనే విడుదల చేస్తాం' అని చెప్పారు.

వాణిజ్య హంగులతో విరాజి



వరుణ్ సందేశ్ కథానాయకుడిగా ఆద్యంత్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'విరాజి'. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. 'గతంలో మా సంస్థలో వరలక్ష్మి శరత్‌కుమార్‌తో 'శబరి' చిత్రాన్ని నిర్మించాం. మేం నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. వరుణ్ సందేశ్ కొత్తలుక్‌లో కనిపిస్తారు. ఆయన గెటప్‌కు కథలో ప్రాధాన్యం ఉంది. మన సమాజంలోని ఒక అంశాన్ని తీసుకొని కమర్షియల్ కోణంలో సినిమాను తెరకెక్కించాం' అని మహేంద్రనాథ్ చెప్పారు.


మార్చ్‌పాస్ట్‌లో త్రివర్ణ పతాకంతో శరత్ కమల్, సింధు

ఆరంభ సంబరం
పారిస్ పరవశం

సెన్ నదిలో అలరించిన వేడుకలు ● ఘనంగా ఒలింపిక్స్ ఆరంభం

ఒలింపిక్ గేమ్స్‌కు వందేళ్ల తర్వాత పారిస్ వినూత్న రీతిలో స్వాగతం పలికింది. ఆరంభ వేడుకలను స్టేడియంలో కాకుండా చరిత్రలో తొలిసారి బయట.. అదీ ఓ నదీ ప్రవాహంలో నిర్వహించి ప్రపంచాన్ని అబ్బురపరిచింది. ఓవైపు పారిస్ మధ్యలోని సెన్ నదిలో ఆయా దేశాల అథ్లెట్లంతా పడవల్లో పరేడ్ నిర్వహించగా.. మరోవైపు ఒడ్డున వందలాది కళాకారులు తమ నృత్య రీతులతో ఆకట్టుకున్నారు. అలాగే తమ సంస్కృతీ సంప్రదాయాలను, చరిత్రను సైతం ఆహుతుల ముందుంచారు. ఓవరాల్‌గా చిరుజల్లులలో తడుస్తూనే సాగిన ఈ వేడుకలతో పారిస్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా మారిందనడంలో సందేహం లేదు..



పారిస్: ప్రపంచ క్రీడాప్రేమికులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఒలింపిక్స్ క్రీడలకు సరికొత్త రీతిలో పారిస్ తెర లేపింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య.. 'గేమ్స్ వైడ్ ఓపెన్' నినాదంతో ఆరుబయట సాగిన ఈ ఆరంభ వేడుకలు అందరికీ థ్రిల్‌ను పంచాయి. 205 దేశాల నుంచి 6,800 మంది అథ్లెట్లు ఈఫిల్ టవర్ వరకు ఆరు కిలోమీటర్ల మేర ప్రయాణించారు. ఇప్పటివరకు ఒలింపిక్ చరిత్రలో స్టేడియంలో కాకుండా బయట ఆరంభ వేడుకలను నిర్వహించడం ఇదే తొలిసారి. నది మధ్యలో ఉన్న చిన్న బ్రిడ్జిలపై ఏర్పాటు చేసిన స్టాండ్స్‌నుంచే కాకుండా పక్కన ఒడ్డున నుంచి మొత్తంగా 3,20,000 మంది ప్రత్యక్షంగా తిలకించారు. ఈ పరేడ్ రూట్‌లో నిర్వాహకులు 71 భారీ స్ర్కీన్లను, వెయ్యి లౌడ్‌స్పీకర్లను ఏర్పాటు చేశారు.

గ్రీస్ రాకతో ఆరంభం: భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటలకు వేడుకలు ఆరంభమయ్యాయి. ముందుగా ఒలింపిక్ జన్మస్థానమైన గ్రీస్ జట్టు ఆటగాళ్లు బోటుపై రాకతో వేడుకలకు తెర లేచింది. ఆ తర్వాత 37 మందితో కూడిన శరణార్థుల జట్టు అనంతరం అల్ఫాబెట్స్ ప్రకారం అఫ్ఘానిస్థాన్‌తో ఆయా దేశాల జట్ల రాక ఆరంభమైంది. వీటి మధ్యలోనే నది ఒడ్డున ఏర్పాటు చేసిన వేదికపై అమెరికన్ సింగర్ లేడీ గాగా ఫ్రెంచ్ క్యాబరెట్ నృత్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. అటు ఆయా దేశాల అథ్లెట్లు బోట్లపై రావడం.. ఆ వెంటనే కాస్త విరామమిచ్చి అక్కడక్కడా ఏర్పాటు చేసిన వేదికలపై కళాకారులు తమ ప్రదర్శనతో ఆహుతులను ఆకట్టుకోవడం జరిగింది. చివరగా ఆతిథ్య జట్టు ఫ్రాన్స్ ఆటగాళ్లు వచ్చారు.


వేడుకల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ఐవోసీ చీఫ్ థామస్ బాచ్


లేడీ గాగా

భారత్ నుంచి 78 మంది...

భారత్ నుంచి ప్రారంభోత్సవ కార్యక్రమంలో 78 మంది అథ్లెట్లు, సిబ్బంది పాల్గొన్నారు. వరుస క్రమంలో 84వ దేశంగా పరేడ్‌లో పాల్గొన్న మన దేశం తరఫున ఫ్లాగ్ బేరర్‌గా పీవీ సింధు, ఆచంట శరత్ కమల్ వ్యవహరించారు. ఇక వీరితో పాటు 11 క్రీడాంశాలకు చెందిన దీపికా కుమారి, లవ్లీనా, రోహన్ బోపన్న, నగాల్, మనికా బాత్రా తదితరులు పరేడ్‌లో కనిపించారు. అయితే శనివారమే పోటీలున్న ఇతర విభాగాల అథ్లెట్లు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. హాకీ జట్టు నుంచి ముగ్గురు రిజర్వ్ ఆటగాళ్లు మాత్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఇక ట్రాక్ అండ్ ఫీల్డ్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ జట్లు ఇంకా పారిస్‌కు చేరుకోలేదు. మరోవైపు భారత పురుష అథ్లెట్లు కుర్తా బుండీ, మహిళలు చీరలు ధరించగా వీటిని త్రివర్ణ పతాక రంగులతో రూపొందించారు.

బోట్ల సంఖ్య 85	తిలకించిన ప్రేక్షకులు 3,20,000
పాల్గొన్న అథ్లెట్లు 6800	
పరేడ్ దూరం 6 కి.మీ	
స్టాండ్స్‌ల సంఖ్య 124	

మనోళ్ల పతక వేట షురూ

కోట్లాది భారతీయుల ఆశలను మోస్తూ.. ప్రఖ్యాత ఒలింపిక్స్ బరిలో నిలిచిన భారత అథ్లెట్లు నేటి నుంచి తమ పతకాల వేటను ఆరంభించనున్నారు. మొత్తంగా కనీసం పది పతకాలైనా సాధించాలనే పట్టుదలతో ఉన్న వేళ.. తొలి రోజున బ్యాడ్మింటన్, షూటింగ్, హాకీ, బాక్సింగ్ ఇలా పలు కీలక క్రీడాంశాల్లో పోటీలు జరుగబోతున్నాయి. గట్టిగా పట్టుబడితే వీటిలో మెడల్స్‌ను అందించగల స్టార్లకు కొదువలేదు. వీరిలో పీవీ సింధు, సాత్విక్-చిరాగ్, నిఖత్ జరీన్, లవ్లీనా, మను బాకర్, హాకీ జట్టుపై భారీ అంచనాలే ఉన్నాయి..

'హ్యాట్రిక్' లక్ష్యంగా సింధు

భారత్‌కు కచ్చితంగా పతకం దక్కే అవకాశం ఉన్న క్రీడ బ్యాడ్మింటన్. ఇప్పటికే 2012 నుంచి వరుసగా మూడు ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు దక్కాయి. ఇప్పుడు భారత్ నుంచి ఏడుగురు షట్లర్లు, నాలుగు విభాగాల్లో బరిలోకి దిగుతున్నారు. ఇందులో సింధు హ్యాట్రిక్ మెడల్ లక్ష్యంతో ఉంది. ఇటీవలి కాలంలో తన ప్రదర్శన మెరుగ్గా లేకపోయినా.. ఒలింపిక్స్‌లో చెలరేగే అలవాటును కొనసాగించాలనుకుంటోంది. మహిళల సింగిల్స్‌లో 13వ ర్యాంకర్ సింధుకు గ్రూప్ దశను దాటడం సులువే. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిలపై స్వర్ణ ఆశలున్నాయి. తొలి రోజు శనివారం పోటీల్లో పురుషుల సింగిల్స్‌లో కెవిన్ కార్డన్ (గ్వాటిమాల)తో లక్ష్య సేన్ ఆడనున్నాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ రోనన్ లాబర్-లుకాస్ కార్వీ (ఫ్రాన్స్)తో.. మహిళల డబుల్స్‌లో అశ్విని-త్రిషా జోడీ కిమ్ సో యీంగ్-కాంగ్ హీ యాంగ్ (కొరియా)తో తలపడనున్నారు.

కివీస్‌తో హాకీ పోరు

గతమెంతో ఘనంగా ఉన్న భారత పురుషుల హాకీ మ్యాచ్ వరుసగా రెండో పతకమే లక్ష్యంగా ఉంది. ఇందులో భాగంగా నేడు న్యూజిలాండ్‌తో తమ ఆరంభ మ్యాచ్‌ను ఆడబోతోంది. పూల్ ఆఫ్ డెత్‌గా భావించే పూల్ 'బి'లో ఉన్న భారత్‌పై అంచనాలు మాత్రం భారీగానే ఉన్నాయి. 41 ఏళ్ల తర్వాత టోక్యో గేమ్స్‌లో పతకం సాధించిన ఈ జట్టుకు దారి క్లిష్టంగానే ఉంది. తమ పూల్‌లోనే ఉన్న ప్రస్తుత చాంపియన్ బెల్జియం, ఆసీస్, అర్జెంటీనా, కివీస్, ఐర్లాండ్‌లతో గట్టి పోటీ ఉండనుంది. అందుకే తొలి మూడు మ్యాచ్‌లను గెలిస్తే నాకౌట్‌కు వెళ్లవచ్చు. చివరి రెండింటిని బెల్జియం, ఆసీస్‌లతో ఆడాల్సి ఉంటుంది. కీపర్ శ్రీజేష్‌కు చివరి గేమ్స్ కాబోతున్నాయి. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్, రాజ్‌కుమార్, జర్మన్‌ప్రీత్‌లతో సమతూకంగా కనిపిస్తోంది.

నిఖత్, లవ్లీనాకు కఠిన డ్రా

భారత్ నుంచి ఆరుగురు బాక్సర్లు బరిలోకి దిగనుండగా.. అందరి దృష్టి తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహెయిన్‌లపైనే ఉంది. అయితే ఈ ఇద్దరికీ కఠిన డ్రా ఎదురైంది. తొలిసారి 50కేజీ విభాగంలో పాల్గొంటున్న నిఖత్ తొలి పోరులో జర్మనీ సంచలనం కరీనా క్లొయెట్జర్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సోమవారం ఈ బౌట్ జరుగనుంది. ఒకవేళ ఇది గెలిస్తే టాప్ ర్యాంకర్ వూ యూ (చైనా)తో సవాల్ ఎదురుకానుంది. ఇక టోక్యోలో కాంస్యం గెలిచిన లవ్లీనా బుధవారం రౌండ్‌లో సున్నీవా (నార్వే)తో తలపడనుంది. మరోవైపు శనివారం మహిళల 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ మాత్రమే పోటీ పడనుంది.

తొలి రోజే నాలుగు విభాగాల్లో..

12 ఏళ్లుగా భారత్‌కు షూటింగ్‌లో పతకం దక్కడం లేదు. మొత్తంగా నాలుగు మెడల్స్ అందించిన ఈ విభాగం గత రెండు పర్యాయాలు రిక్తహస్తాలతోనే వెనుదిరిగింది. కానీ ఈసారి ఏకంగా 21 మంది షూటర్లు గురి చేసి గన్ పేల్చేందుకు సిద్ధమయ్యారు. అయితే 10మీ. ఎయిర్ పిస్టల్, 25మీ. పిస్టల్ ఈవెంట్లలో బరిలోకి దిగబోతున్న మను బాకర్‌తో పాటుగా 50మీ. రైఫిల్ 3 పొజిషన్‌లో అదరగొడుతున్న సిఫ్ట్ కౌర్ శర్మపై పతక ఆశలున్నాయి. అలాగే 25మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో పోటీ పడుతున్న హైదరాబాదీ ఇషా సింగ్‌పైనా అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు భారత్ తొలి రోజు నాలుగు విభాగాల్లో పోటీ పడనుంది. ఇందులో రెండు మెడల్స్ ఈవెంట్లున్నాయి.



పారిస్‌లో తొలి డోపీ

ఇరాక్ జూడోకాపై వేటు

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో తొలి డోపీ దొరికాడు. ఇరాక్ దేశానికి చెందిన జూడో క్రీడాకారుడు సజ్జాద్ సెహెన్ డోపింగ్ పరీక్షలో పాజిటివ్‌గా తేలాడు. తొలిసారి విశ్వక్రీడల్లో పోటీపడుతున్న 28 ఏళ్ల సజ్జాద్ రెండు రకాల నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినట్టు రుజువైందని అంతర్జాతీయ డోపింగ్ పరీక్షల సంస్థ శుక్రవారం ప్రకటించింది. సజ్జాద్ వచ్చే మంగళవారం తన 81 కిలోల విభాగంలో తలపడాల్సి ఉంది. ఇంతలోనే డోపీగా పట్టుబడడంతో ప్రస్తుతానికి అతనిపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. ఫలితంగా అతడు విశ్వక్రీడల నుంచి వైదొలగక తప్పని పరిస్థితి.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: 10 మీ. ఎయిర్‌రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్, ఫైనల్స్ - సందీప్ సింగ్/ఎలవెనిల్, అర్జున్ బబుత/రమిత (మ. 12.30 నుంచి); 10 మీ. ఎయిర్‌పిస్టల్ వ్యక్తిగత పురుషుల, మహిళల క్వాలిఫికేషన్ (మ. 2 నుంచి) - అర్జున్ సింగ్ చీమా, సరబ్‌జోత్, మనూ భాకర్, రిథమ్ సాంగ్వాన్.
రోయింగ్: పురుషుల సింగిల్స్ స్కల్స్ - పన్వర్ బాల్‌రాజ్ (మ. 12.30 నుంచి).
టెన్నిస్: పురుషుల డబుల్స్ తొలిరౌండ్ - రోహన్ బోపన్న/శ్రీరామ్ బాలాజీ x ఎడ్వర్డ్ రోజర్/ఫాబియాన్ (మ. 3.30 నుంచి).
బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ గ్రూప్ మ్యాచ్ - లక్ష్యసేన్xకెవిన్ కోర్డాన్ (రా. 7.10); పురుషుల డబుల్స్ గ్రూప్ మ్యాచ్ - సాత్విక్/చిరాగ్ x లుకాస్/రోన్ లాబార్ (రా. 8); మహిళల డబుల్స్ గ్రూప్ మ్యాచ్ - అశ్విని/తనీషాxకిమ్ సో యెంగ్/కాంగ్ హీ యాంగ్ (రా. 11.50).
టేబుల్ టెన్నిస్: పురుషుల సింగిల్స్ ప్రిలిమినరీ రౌండ్ - హర్మీత్ దేశాయ్ x జాయెద్ అబో యమాన్ (రా. 7.15).
హాకీ: భారత్ x న్యూజిలాండ్ (రా. 9).
బాక్సింగ్: మహిళల 54 కిలోల ప్రిలిమినరీ రౌండ్ - ప్రీతి పవార్ x తి కిమ్ ఆన్ (రా. 12.05).

యుద్ధభూమిలోనే ప్రాక్టీస్ చేసి..



పారిస్: రెండేళ్లుగా ఆ దేశంలో ఎక్కడ చూసినా యుద్ధ వాతావరణమే.. ఏవైపు ఉంచి ఎప్పుడు మిస్సైల్స్ వచ్చి పడతాయో తెలీని భీతావహం. కళ్ల ముందే ఎంతోమంది ప్రాణాలు విడిచే భయంకర దృశ్యాలు. దీనికి తోడు పవర్ గ్రిడ్ కూల్చివేతతో దాదాపుగా విద్యుత్ లేని పరిస్థితి. ఇలాంటి క్లిష్ట స్థితిలోనూ ఉక్రెయిన్ నుంచి 143 మంది అథ్లెట్ల బృందం ఒలింపిక్స్‌కు రాగలిగింది. రష్యాతో నిరంతర యుద్ధంతో ఈ దేశం సతమతమవుతున్న విషయం తెలిసిందే. హఠాత్తుగా వచ్చే సైరన్ల మోతతో తాము ఇంట్లోకి వెళ్లి దాక్కోవాల్సి వచ్చేదని, అందుకే తమ శిక్షణ అత్యంత కష్టంగా సాగిందని అథ్లెట్లు చెబుతున్నారు. అలాగే దేశం తరఫున ఒలింపిక్స్‌లో ఆడడాన్ని గర్వంగా భావిస్తున్నాంటున్నారు.



వేలంలో ద్రవిడ్ కొడుక్కి రూ.50 వేలు

బెంగుళూరు: టీమిండియా మాజీ కెప్టెన్, కోచ్ రాహుల్ ద్రవిడ్ తనయుడు సమిత్ ద్రవిడ్‌ను కేఎస్‌సీఏ టీ20 మహారాజా ట్రోఫీ వేలంలో మైసూర్ వారియర్స్ జట్టు రూ.50 వేలకు దక్కించుకుంది. 18 ఏళ్ల సమిత్‌ను కనీస ధరకు వారియర్స్ కొనుగోలు చేసింది. ఈ టోర్నీ వచ్చే సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు జరగనుంది. మిడిలార్డర్ బ్యాటర్ కమ్ పేస్ ఆల్‌రౌండర్ సమిత్ గతేడాది అండర్-19 కూచ్ బెహార్ ట్రోఫీ నెగ్గిన కర్ణాటక జట్టులో సభ్యుడు. ఈ ట్రోఫీలో 10 ఇన్నింగ్స్‌ల్లో సమిత్ మూడు హాఫ్ సెంచరీలతో కలిపి, 362 పరుగులు చేసి, 16 వికెట్లు కూడా తీశాడు.



మన ప్రత్యర్థి మళ్లీ శ్రీలంకే

సెమీస్‌లో బంగ్లాపై భారత్ విజయం
పాక్‌కు లంక షాక్ • ఆసియా కప్ ఫైనల్లో అమీతుమీ రేపు

దంబుల్లా: రెండేళ్ల కిందట బంగ్లాదేశ్ ఆతిథ్యమిచ్చిన మహిళల ఆసియా కప్‌లో..టైటిల్ ఫైట్‌లో భారత్ ప్రత్యర్థి శ్రీలంకే. ఇక ఈసారి కూడా ట్రోఫీకోసం ఆ జట్టుతోనే హర్మన్‌ప్రీత్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను డిఫెండింగ్ చాంపియన్ భారత్ చిత్తు చేస్తే..ఉత్కంఠ భరితంగా జరిగిన రెండో సెమీస్‌లో 3 వికెట్లతో పాకిస్థాన్‌కు శ్రీలంక షాకిచ్చింది. ఆదివారం ఫైనల్ జరగనుంది.

రేణుక, రాధిక మెరిసే..: పవర్ ప్లేలో పేసర్ రేణుకా సింగ్ (3/10) నిప్పులు చెరిగే బంతులు..మిడిల్ ఓవర్లలో రాధా యాదవ్ (3/14) మెరుపులు..దాంతో బంగ్లాదేశ్‌తో సెమీఫైనల్లో అలవోకగా గెలుపొందిన భారత్ ఆసియా కప్ తుది పోరుకు చేరింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 80 పరుగులే సాధించింది. కెప్టెన్ నిగర్ సుల్తానా (32), చివర్లో షోర్నా అక్తర్ (19 నాటౌట్) కాస్త బ్యాట్లు ఝుళిపించబట్టి బంగ్లాకు ఆ స్కోరైనా సాధ్యమైంది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు మంధాన (55 నాటౌట్), షఫాలీ వర్మ (26 నాటౌట్) ప్రత్యర్థి బౌలర్లను ఆడేసుకున్నారు. దాంతో ఇంకా 9 ఓవర్లు మిగిలుండగానే భారత్ 83/0తో మ్యాచ్‌ను ముగించేసింది. ఇక..మరో సెమీఫైనల్లో మొదట పాకిస్థాన్‌ను 20 ఓవర్లలో 140/4 స్కోరు చేసింది. అనంతరం శ్రీలంక 19.5 ఓవర్లలో 141/7 స్కోరు చేసి విజయం అందుకుంది.

సంక్షిప్తస్కోర్లు
బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 80/8 (నిగర్ సుల్తానా 32, షోర్నా అక్తర్ నాటౌట్ 19, రేణుకా సింగ్ 3/10, రాధా యాదవ్ 3/14)
భారత్: 11 ఓవర్లలో 83/0 (మంధాన నాటౌట్ 55, షఫాలీ నాటౌట్ 26).

కొత్త.. కొత్తగా

రా. 7 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



నూతన కెప్టెన్, కోచ్‌తో టీమిండియా
శ్రీలంకతో తొలి టీ20 నేడు

పల్లెకెలె: టీ20 వరల్డ్ చాంపియన్ టీమిండియా మెగా టోర్నీ తర్వాత పూర్తిస్థాయి జట్టుతో సై అంటోంది. శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌లో భాగంగా తొలుత మూడు టీ20లలో తలపడనుంది. మొదటి టీ20 శనివారం ఇక్కడ జరగనుంది. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్, కోచ్‌గా గంభీర్ కొత్తగా నియమితులయ్యారు. అలాగే జట్టులోనూ కొత్త ముఖాలు కనిపిస్తున్నాయి. దాంతో..కెప్టెన్, కోచ్‌తోపాటు జట్టులోని యువ క్రికెటర్లకు ఈ టూర్ పరీక్ష కానుంది. అనుభజ్ఞుడైన గంభీర్ కోచ్‌గా జట్టు పయనంపై ఆసక్తి రేకెత్తిస్తోంది.మొత్తంగా కొత్తకోచ్, సారథి ఆధ్వర్యంలో ఆటగాళ్ల ప్రదర్శన ఎలా ఉంటుందో చూడాలి. గతంలో సౌతాఫ్రికా, ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లలో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యకు ఆ అనుభవం.. పూర్తిస్థాయి కెప్టెన్ బాధ్యతల్లో ప్లస్ కానుంది.

రోహిత్, విరాట్, జడేజా లేకుండా..: గతనెల ముగిసిన టీ20 ప్రపంచ కప్ అనంతరం స్టార్లు రోహిత్, విరాట్, జడేజా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. దాంతో ఎన్నో ఏళ్ల అనంతరం ఈ త్రయం లేకుండా భారత్ బరిలో దిగుతోంది. ఇది టీమిండియాకు సంధి దశ. గిల్‌తోపాటు యువ బ్యాటర్లు జైస్వాల్, రింకూ, పరాగ్‌లు జట్టులో తమ స్థానాలను సుస్థిరం చేసుకొనేందుకు.. జడేజా స్థానంలో ఆల్‌రౌండర్‌గా తన ముద్ర వేసేందుకు అక్షర్ పటేల్‌కూ ఇది చక్కటి చాన్స్. ఆల్‌రౌండర్లు హార్దిక్, దూబే, వాషింగ్టన్‌లతో జట్టు పటిష్టంగా ఉంది. సీనియర్ బుమ్రా గైర్హాజరీలో యువపేసర్లు అర్ష్‌దీప్, సిరాజ్‌లకు ఈ సిరీస్ అద్భుత అవకాశం.

లంకకు ఎదురుదెబ్బ: సిరీస్ ఆరంభంలోనే ఆతిథ్య జట్టుకు ఎదురు దెబ్బలు తగిలాయి. అనుభవజ్ఞులైన పేసర్లు చమీర అనారోగ్యంతో, తుషార గాయంతో సిరీస్‌కు దూరమయ్యారు. వారి స్థానాల్లో అసిత ఫెర్నాండో, దిల్షాన్ మధుశంక జట్టులోకి వచ్చారు. ఇది చాలదన్నట్టు..జట్టును ఫ్లూ జ్వరం పట్టిపీడిస్తున్నదట. దాంతో ఆల్‌రౌండర్ రమేష్ మెండిస్‌ను రిజర్వ్ ఆటగాడిగా పిలిపించారు. టీ20 వరల్డ్ కప్‌లో వైఫల్యంతో లంక జట్టులో మార్పులు జరిగాయి. తాత్కాలిక కోచ్‌గా జయసూర్యను, అసలంకను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. భారత్ మాదిరే కొత్త సారథి, కోచ్‌తో దిగుతున్న లంక జట్టు స్వదేశంలో జరిగే సిరీస్‌లో పోటీ ఇస్తుందా అన్నది చూడాలి.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), గిల్, జైస్వాల్, పంత్ (కీపర్), హార్దిక్, దూబే, సుందర్, అక్షర్, అర్ష్‌దీప్, బిష్ణోయ్/ఖలీల్, సిరాజ్.
శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిస్సాంక, మెండిస్ (కీపర్), పెరీరా, అవిష్క ఫెర్నాండో, షనక, హసరంగ, మహీష్ తీక్షణ, బినురా ఫెర్నాండో/అసిత ఫెర్నాండో, మధుశంక, పథిరన.

పిచ్/వాతావరణం

లంక ప్రీమియర్ లీగ్ సందర్భంగా పల్లెకెలె స్టేడియంలో జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో మొదటి ఇన్నింగ్స్‌లో సగటున 185 పరుగులు నమోదయ్యాయి. ఈ మ్యాచ్‌ల్లో స్పిన్నర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. మధ్యాహ్నం వర్షం కురిసే చాన్సుంది. మ్యాచ్ రాత్రి జరగనుండడంతో వరుణుడి నుంచి ఆటంకం లేకపోవచ్చు.

పాలతో ఓ పానీయం 'వాసాధిక'

ఉదకరస నివృత్తం గోమయాగ్రౌవిపక్వం నవదళ ఘన సర్రైర్వాసితంబష్యయిణ్యా!
పటమిలిత సుఖండం స్థాపితం నవ్య పాత్రే విగతతర సుధాంశో గీయతే వసధిక్యా!

పాలు ఆరోగ్యాన్నీ, పోషణనీ, శక్తినీ అందించే ముఖ్య ఆహార ద్రవ్యం. పాలే ప్రధాన ఆహారం కూడా. పసిపిల్లలు పాలు మాత్రమే తాగుతూ పెరుగుతారు. పాలు సంపూర్ణ ఆహారమే. కానీ, వయసు పెరిగే కొద్దీ కేవలం పాలు తాగి మనిషి జీవించలేడు. ఎందుకని? ఆరు రుచుల్లో తీపి మాత్రమే పాలలో ఉంటుంది. తక్కిన పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు పాలలో ఉండవు. కాబట్టి, పాలను అతిగా తీసుకోవటాన్ని ఆయుర్వేద శాస్త్రం ఒప్పుకోదు. చ్యవనప్రాశ, అశ్వగంధాది లేహ్యం, బ్రాహ్మీరసాయనం లాంటి ఆరు రుచులు కలిగిన ఔషధాలకు అనుపానంగా పాలను తీసుకోవటం మంచిది. కొన్ని తీక్షణమైన ఔషధాలకు అనుపానంగా మాత్రమే పాలు కలిపిన అన్నం



తినాలంటారు. అది కూడా కొద్ది రోజులు మాత్రమే! జన్మంతా పాలు తాగి ఋషులు కూడా జీవించలేరు. ఉపవాసాల సమయంలో పాలు మాత్రమే తీసుకోవటాన్ని కూడా ఆయుర్వేద శాస్త్రం ఒప్పుకోదు.

పాలు ఆహారం మాత్రమే కాదు... ఔషధం కూడా! ఔషధాన్ని మోతాదు ప్రకారం విధి యుక్తంగా తీసుకోవాలి. ఆయుర్వేద శాస్త్రం ఆవు పాలు, గేదె పాలు, ఇంకా ఇతర జంతువుల పాలకు వేర్వేరుగా వేటి గుణాలను వాటికి వివరించింది. పాలన్నీ తెల్లగానే ఉంటాయి. అలాగని అన్నీ ఒకే గుణం కలిగిన పాలు కావు.

ఆవు పాలతో 'వాసాధిక'...

ఆవు పాలతో ఆరోగ్యదాయకంగా 'వాసాధిక' పానీయం ఎలా తయారు చేసుకోవాలో 'క్షేమ కుతూహలం' గ్రంథంలో క్షేమశర్మ వివరించాడు...

అనేక దూడలను పెట్టిన ఆవు పాలు శ్రేష్ఠం. పాలకు సమానంగా నీళ్లు కలపాలి. ఆవు పిడకల మీద దాలిగుంటలో ఈ పాల కుండను ఉంచి, సగం వరకూ ఆవిరయ్యే దాకా మరిగించండి. చల్లారిన తరువాత ఆ పాలలో తగినంత పంచదార, చిటికెడంత పచ్చకర్పూరం కలిపి, మంచి వస్త్రం తీసుకుని, అందులో ఈ పాలను వేరే పాత్రలోకి వడగట్టండి. ఇదే 'గవ్య వాసాధిక' అనే పానీయం. ఇది అమృతాన్ని విగతతరం చేస్తుందన్నాడు. అంటే ఓడిస్తుందన్నమాట.

గేదె పాలతో...

'పాత్రే నవ్యతరె సుధూప విహితే భృజంతితే మానవా'... ఒక వేళ గేదె పాలే దొరికాయనుకోండి... ఈ పాలను కూడా ఇందాక చెప్పిన పద్ధతిలోనే సగం మరిగేంతసేపు కాచి, చల్లార్చండి. అందులో తీపితో పాటు, మీరు కోరుకున్న పరిమళ ద్రవ్యాలు కలిపి, ఓ కొత్త పాత్రలోకి వడగట్టండి. ఇది 'మాహిష వాసాధిక' అనే పానీయం. శాస్త్ర గ్రంథాలెప్పుడూ సూచన ప్రాయంగా వివరిస్తాయి. వాటిని మన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా, మన అవసరాలకు తగ్గట్టుగా అన్వయించుకోవాలి. కాలానుగతంగా వ్యాఖ్యాతలు నవీన యుగాలకు అనుగుణంగా ప్రాచీన గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాస్తారు.

ప్యాకెట్టు పాలతో

ఇవాళ ప్యాకెట్ పాలు కొనుక్కోవటమే తప్ప స్వచ్ఛమైన పాలు జనసామాన్యానికి దొరికే అవకాశం తక్కువైపోయింది. ఆ పాలు వాడుకునేవారు రెండో పద్ధతిలో వాసాధిక పానీయం తయారు చేసుకోండి. ఇందులో కలిపే పరిమళాలను మన ఇష్టానికి వదిలేశాడు క్షేమశర్మ. మన శరీర పరిస్థితులను బట్టి కావాల్సిన పరిమళ ద్రవ్యాల్ని ఎంచుకోవాలని తాత్పర్యం.

ఎవరికి ఏ పరిమళం..?

వాత శరీర తత్త్వం కలిగినవారు, వాత వ్యాధులతో బాధపడేవారు పాలకు అంతే మొత్తం నీళ్లు కలిపి, సగం మిగిలేలా మరిగించాలి. చక్కెర, జాజికాయ, జాపత్రి, పచ్చకర్పూరం (చిటికెడు) వేసి మిక్సీ పట్టాలి. పావు చెంచా పొడిని ఒక కప్పు పాలలో కలిపి, రాత్రి పడుకోబోయే ముందు తాగితే మంచి నిద్ర పడుతుంది. వాతం ఉపశమిస్తుంది. శరీరానికి మృదుత్వం కలుగుతుంది. మరాఠీ మొగ్గలను కూడా కలపవచ్చు.

పైత్య వ్యాధులతో బాధపడేవారు, వేడి ఎక్కువగా ఉన్నవారు ఈ పాలలో చక్కెరతో పాటు యాలకుల పొడి, పచ్చకర్పూరం, జాజికాయ, జాపత్రి లాంటి చలవనిచ్చే పరిమళ ద్రవ్యాలను కలుపుకోవాలి. కఫ వ్యాధులతో బాధపడేవారు పసుపు, మిరియాలు లవంగాలు, యాలకుల్లాంటివి కలుపుకోవచ్చు. ఆ విధంగా శరీర తత్త్వాన్ని, ఆరోగ్య స్థితిని బట్టి పరిమళ ద్రవ్యాలను ఎంచుకోవాలి. ఐదు గ్రాముల జాజికాయ, ఐదు గ్రాముల జాపత్రి, రెండు గ్రాముల పచ్చకర్పూరం... ఈ కొలతలతో తయారు చేసిన విశ్రమం అన్ని వ్యాధులకూ ఔషధంగా పని చేస్తుంది. పచ్చకర్పూరం అధికంగా వెయ్యకూడదు. జలుబు చేస్తుంది. పరిమితంగా వాడితే చాలు పరిమళ భరితంగా ఉంటుంది. పచ్చకర్పూరం కలవగానే దేవుడి ప్రసాదం, పవిత్ర ఆహారం అనే భావనలు కలుగుతాయి. అదొక్కటే వేయి ఓషధుల పెట్టు.

● గంగరాజు అరుణాదేవి

వంకాయలతో గుత్తొంకాయ, వంకాయ చట్నీ, వంకాయ ఫ్రై చేసుకోవటం కామన్. అయితే చికెన్, మటన్‌తో వంకాయలను కలిపి చేసుకోవటం డిఫరెంట్. వంకాయ చికెన్, వంకాయ మటన్ కర్రీలను ఈ వీకెండ్‌లో వండుకోండిలా...

వంటిల్లు

నాన్‌వెజ్‌తో వంకాయల దోస్తీ



వంకాయ చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

చికెన్ ముక్కలు- అర కేజీ, నూనె- 2 టేబుల్ స్పూన్లు, మీడియం సైజ్ ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, మీడియం సైజ్ టమోటాలు-2 (సన్నగా తరగాలి), కారం పొడి- 2 టీస్పూన్లు, ధనియాల పొడి- రెండు టీస్పూన్లు, పసుపు- చిటికెడు, ఎండు మిరపకాయలు- 2, పచ్చ వంకాయలు - 300 గ్రాములు (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), గరం మసాలా- టీస్పూన్, కొత్తిమీర- టేబుల్ స్పూన్

తయారీ విధానం

కుక్కర్‌లో నూనె వేడయ్యాక.. ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఉల్లిపాయల రంగు మారిపోయిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, టమోటా ముక్కలు వేసి.. గరిటెతో టమోటా ముక్కలను ఒత్తినట్లు కలపాలి. తగినంత ఉప్పు వేశాక.. కారం పొడి, ధనియాల పొడితో పాటు కొద్దిగా పసుపు వేసి, ఎండు మిరపకాయలను సన్నగా తుంచేసి గరిటెతో కలపాలి. మరో మూడు నిముషాలు ఉడికిస్తే గ్రేవీ చికెన్ ముక్కలకు బాగా పడుతుంది. నూనె పైకి తేలుతుంది. గరిటెతో ఒకసారి తిప్పి రెండు నిముషాల తర్వాత దించేసుకోవాలి. ఈ వంకాయ చికెన్ కర్రీని చపాతీ, పరోటా లేదా అన్నంతో తింటే రుచిగా ఉంటుంది.

మూడు నిముషాల తర్వాత నూనె పైకి తేలి ఉడికినట్లు ఉన్నప్పుడు.. ముందుగా శుభ్రం చేసుకున్న చికెన్ ముక్కలు వేసి కలపాలి. వెంటనే వంకాయ ముక్కలు వేసి కలిపాక.. అరకప్పు నీళ్లు పోసి కలపాలి. కుక్కర్ మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చేంత వరకూ ఉడికించుకోవాలి. కుక్కర్ మూత తీసి కలిపిన తర్వాత మరో ఐదు నిముషాలు ఉడికిస్తే నీటి శాతం తగ్గిపోయి గ్రేవీ బాగా వస్తుంది. గరం మసాలా, కొత్తిమీర వేసిన తర్వాత



వంకాయ మటన్ కూర

కావాల్సిన పదార్థాలు

మటన్- 600 గ్రాములు, పచ్చ వంకాయలు- అర కేజీ, మీడియం సైజ్ టమోటాలు-4 (సన్నగా తరగాలి), నూనె- అరకప్పు, ఎండుమిర్చి- 8, ఎండు కొబ్బెర- పది పొడవైన ముక్కలు, ధనియాలు- రెండున్నర టీస్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్- రెండు టీస్పూన్లు, కొత్తిమీర- రెండు టేబుల్ స్పూన్లు, పసుపు- చిటికెడు, ఉప్పు- రుచికి తగినంత, గరం మసాలా- టీస్పూన్, దాల్చిన చెక్క- చిన్న ముక్క, లవంగాలు- 6

తయారీ విధానం

ముందుగా శుభ్రంగా మటన్‌ను కడిగి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లో మటన్ వేసి.. ఉప్పు, పసుపు వేసి కలిపిన తర్వాత కుక్కర్‌లో వేయాలి. ఒకటిన్నర టేబుల్ స్పూన్ల నూనె వేసిన తర్వాత అరకప్పు నీళ్లు పోసి.. కుక్కర్ మూత పెట్టి ఆరు విజిల్స్ వచ్చేంత వరకూ ఉడికించి పక్కన ఉంచుకోవాలి.

ప్యాన్‌లో ధనియాలు, మిరపకాయలు వేసి వేయించుకోవాలి. వీటిని చల్లార్చిన తర్వాత జార్‌లో ధనియాలు, మిరపకాయలతో పాటు ఎండుకొబ్బరి, దాల్చిన చెక్క, లవంగాలు, గరం మసాలా వేసి మిక్సీ పట్టాలి. ఇందులోనే అల్లం వెల్లుల్లి పేస్ట్, కొత్తిమీర వేసి కొన్ని నీళ్లు పోసి మిక్సీపట్టాలి. చట్నీలా మెత్తగా అవుతుంది.

ముందుగా ఉప్పు నీళ్లలో వంకాయ ముక్కలను పది నిమిషాల ముందు నానబెట్టుకుని రెడీగా ఉంచుకోవాలి. వెంటనే గుంతప్యాన్‌లో మిగిలిన నూనె పోసి.. మిక్సీ పట్టిన మిశ్రమం వేసి గరిటెతో కలపాలి. మీడియం ఫ్లేమ్‌లో మాత్రమే మిక్సీ పట్టిన మసాలాను కుక్ చేస్తే నూనె పక్కకు వస్తుంది. అప్పటి వరకూ కలుపుతూ ఉండాలి. ఆ తర్వాత వంకాయ ముక్కలు, టమోటా ముక్కలు వేసి కలపాలి. రెండు నిముషాల తర్వాత ఉడకబెట్టిన మటన్ వేశాక గ్లాసు నీళ్లు పోసి కలిపిన తర్వాత ప్యాన్ మీద మూత ఉంచి ఆరు నిముషాల పాటు కుక్ చేయాలి. గరిటెతో కలిపిన తర్వాత మళ్లీ కుక్ చేయాలి. ఇలా బాగా ఉడుకుపట్టి నూనె తేలేంత వరకూ ఉడికించాలి. మంచి గ్రేవీ కూడా పడుతుంది. వంకాయ ముక్కలు ఉడికాయో లేదో చూసుకుని దించేసుకోవటమే. అన్నంతో లేదా చపాతీతో తింటే రుచిగా ఉంటుంది.

మేకప్

బ్యూటిఫుల్ లుక్ కోసం...

ముఖం కాంతులీనుతూ, శరీరం కళావిహీనంగా కనిపిస్తే ఏం బాగుంటుంది? ముఖంతో పాటు, మెడ, చేతులు ఆకర్షణీయంగా కనిపించడం కోసం బాడీ మేకప్ ఎంచుకోవాలి.

చర్మం నునుపుగా మెరుపులీనుతూ కనిపించేలా చేసే ఈ బాడీ మేకప్ పూర్తిగా శరీరానికే పరిమితం.

- **రెండింటికీ తేడా:** ముఖానికి వేసుకునే మేకప్ పలుచగా, ఎక్కువ మెరుపును కలిగి ఉంటుంది. బాడీ మేకప్ మందంగా ఉండడంతో పాటు, పిగ్మెంట్‌ను కూడా కలిగి ఉంటుంది.
- **దుస్తులకు అంటుకోదు:** ముఖానికి మేకప్ వేసుకుంటే పొరపాటున చెరిగిపోతుందేమోనని కంగారు పడుతూ ఉంటాం. కానీ బాడీ మేకప్ అలా కాదు. ఇది దుస్తులకు అంటుకోదు. అయితే ఎక్కువగా చెమట పట్టే తత్వం ఉన్నవాళ్లు మేకప్ చెరిగినా దుస్తులకు అంటుకున్నట్టు కనిపించకుండా ఉండడం కోసం లేత రంగు దుస్తులను ధరించడం మేలు.



ఇలా ఎంచుకోవాలి

- ఫేసియల్ మేకప్ ఐటమ్స్‌ను ఎంచుకునేటప్పుడు అనుసరించే నియమాలనే బాడీ మేకప్ ఎంచుకునేటప్పుడు కూడా అనుసరించాలి. బాడీ మేకప్‌లో భాగంగా ఎంచుకునే ఫౌండేషన్లు, కన్‌సీలర్లూ నాణ్యమైనవే అయి ఉండాలి.
- చర్మపు రంగుకు దగ్గరగా ఉండే బాడీ మేకప్ ఎంచుకోవాలి. లేత గులాబీ రంగు చర్మం కలిగినవాళ్లు, బీజ్, క్రీమ్ షేడ్స్ ఎంచుకోవాలి. ఐవరీ, బఫ్, ట్యాన్ బాడీ షేడ్స్ కూడా బాగుంటాయి.
- బాడీ బ్రాంజర్లు, బాడీ హైలైటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చర్మపు రంగుకు దగ్గరగా ఉండేవాటినే ఎంచుకోవాలి.
- ఆయిల్ ఫ్రీ, వాటర్ ప్రూఫ్... ఈ రెండు పేర్లు ఉన్న వాటినే ఎంచుకోవాలి.

మేకప్‌కు ముందు

- చర్మానికి నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.
- పగుళ్లు, గాయాలు లాంటివి లేకుండా చూసుకోవాలి.
- మానిక్యూర్, పెడిక్యూర్ చేయించుకోవాలి.
- బాడీ స్క్రబ్బింగ్ లేదా బాడీ పాలిషింగ్‌తో చర్మం మరింత మెరుస్తుంది.
- వ్యాక్సింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

బిజినెస్

పసిడి దుకాణాలు కళకళ..



- సుంకం తగ్గింపే కారణం
- మూడు రోజుల్లో రూ.5,000 తగ్గిన ధర

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ పుణ్యమాని నగల షాపులు కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం ధర కొద్దిగా పెరిగినా.. బడ్జెట్ తర్వాత 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.5,000 తగ్గి రూ.70,500 సమీపంలో ట్రేడవుతోంది. దీంతో వచ్చిందే చాన్స్ అన్నట్టు కొనుగోలుదారులు పెద్దఎత్తున నగల దుకాణాలకు వస్తున్నారు. బడ్జెట్‌కు ముందు కిలో రూ.లక్షకు చేరువైన వెండి ధర.. ప్రస్తుతం రూ.84,000కు చేరువలో ట్రేడవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బంగారం, వెండిపై విధించే దిగుమతి సుంకాన్ని బడ్జెట్‌లో 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు. ఇది కొనుగోలుదారులతో పాటు నగల వ్యాపారులకూ కలిసి వస్తోంది.

దిగుమతి సుంకం తగ్గింపుతో ఆర్థిక మంత్రి పసిడి స్మగ్లింగ్‌కూ చాలా వరకు చెక్ పెట్టారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కిలో బంగారం దిగుమతిపై చెల్లించే దిగుమతి సుంకం రూ.9.82 లక్షల నుంచి రూ.3.93 లక్షలకు తగ్గింది. కాగా శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం రూ.50 పెరిగి రూ.70,700కు చేరింది. ఇదే సమయంలో కేజీ వెండి ధర రూ.400 పెరిగి రూ.84,400కు చేరింది.

దేశవ్యాప్తంగా ఒకే ధర !

ప్రస్తుతం బంగారం, వెండికి దేశంలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధర ఉంది. దీనికి గుడ్‌బై చెప్పి 'ఒకే దేశం, ఒకే ధర' కోసం బులియన్ మార్కెట్ వర్గాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. వచ్చే నెల నుంచి పశ్చిమ బెంగాల్‌తో పాటు తూర్పు భారతం అంతా ఒకే ధర విధానం అమలు చేసేందుకు పరిశ్రమ వర్గాలు చర్యలు చేపట్టాయి. ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు దీన్ని విస్తరిస్తామని 'ఆలిండియా జెమ్స్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) ఛైర్మన్ సయామ్ మెహ్రా చెప్పారు.

పసిడి పీఎస్‌యూలను ప్రైవేటీకరించండి: అనిల్ అగర్వాల్

ప్రస్తుతం మన దేశ పసిడి అవసరాల్లో 99.9 శాతానికి దిగుమతులే దిక్కు. ప్రభుత్వ రంగంలోని భారత్ గోల్డ్ మైన్స్, హట్టి గోల్డ్ మైన్స్ కంపెనీలను ప్రైవేటీకరిస్తే ఉత్పత్తి భారీగా పెరిగి దిగుమతుల భారం చాలా వరకు తగ్గుతుందని వేదాంత గ్రూప్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ అన్నారు. ఇలా చేయడం వల్ల పసిడి ఉత్పత్తిలో భారత్.. ప్రముఖ దేశంగానూ అవతరిస్తుందన్నారు. దీనివల్ల పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ ఏర్పడతాయని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

బ్యాచిలర్స్‌కు అచ్చిరాని మార్కెట్

పెళ్లయిన వారికే ఇంట్రాడే ట్రేడింగ్‌లో లాభాలు ● సెబీ అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ: పెళ్లికాని ప్రసాదులకూ స్టాక్ మార్కెట్ ఇంట్రాడే ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్ పెద్దగా కలిసి రావడం లేదు. ఈ సెగ్మెంట్‌లో బ్రహ్మచారులతో పోలిస్తే.. పెళ్లయిన వారే బాగా రాణిస్తున్నారు. 2019-2023 ఆర్థిక సంవత్సరాల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్లో మదుపరుల తీరుతెన్నులపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ జరిపిన ఒక అధ్యయనంలో ఈ విషయం తేలింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇంట్రాడే ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ చేసిన బ్రహ్మచారుల్లో 75 శాతం మంది నష్టపోతే.. నష్టపోయిన పెళ్లయిన వారి శాతం 67 శాతం మాత్రమేనని సెబీ వెల్లడించింది. దీనికి తోడు బ్రహ్మచారులతో పోలిస్తే పెళ్లయిన వారే ఎక్కువగా ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్ చేస్తున్నట్టు వెల్లడైంది.



మహిళలకే అధిక లాభాలు: సెబీ అధ్యయనంలో మరో ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. క్యాష్ సెగ్మెంట్‌లో ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్ చేసే మహిళలతో పోలిస్తే.. పురుషులే ఎక్కువగా నష్టపోతున్నట్టు వెల్లడైంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి అంత కంటే ఎక్కువ మొత్తానికి ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్ చేసిన పురుషులు సగటున రూ.38,570 నష్టపోయారు. ఇదే సమయంలో మహిళల విషయానికి వచ్చే సరికి ఇది రూ.22,153 మాత్రమేనని సెబీ అధ్యయనం పేర్కొంది. ఇదే కాలంలో ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్ చేసే మహిళల శాతం 20 నుంచి 16 శాతానికి పడిపోవడం మరో విశేషం.

ఎక్కువ నష్టపోతోందీ కుర్రాళ్లే..: ఇంట్రాడే ఈక్విటీ క్యాష్ సెగ్మెంట్‌లో పెద్ద వాళ్లతో పోలిస్తే కుర్రాళ్లు ఎక్కువగా నష్టపోతున్నట్టు సెబీ అధ్యయనం తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ట్రేడింగ్ తీరుతెన్నులను పరిశీలిస్తే 60 ఏళ్లకు పైబడిన ఇంట్రాడే ఈక్విటీ ట్రేడర్లలో 53 శాతం మంది నష్టపోయారు. రెండు పదుల కంటే తక్కువ వయసు ఉన్న వారికి వస్తే, వీరిలో 81 శాతం మంది ఇంట్రాడే ఈక్విటీ ట్రేడింగ్‌లో నష్టపోయారు.

కేఫిన్ టెక్ లాభంలో 57 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ కేఫిన్ టెక్నాలజీస్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.68.07 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.43.38 కోట్లు)తో పోల్చితే లాభం 57 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం రెవెన్యూ కూడా 31 శాతం వృద్ధితో రూ.181.50 కోట్ల నుంచి రూ.237.56 కోట్లకు పెరిగింది. త్రైమాసిక కాలంలో వివిధ వ్యాపార విభాగాలు నిలకడైన పనితీరును కనబరచటంతో ప్రోత్సాహర ఫలితాలను నమోదు చేసినట్లు కేఫిన్ టెక్ ఎండీ, సీఈఓ శ్రీకాంత్ నాదెళ్ల తెలిపారు. కొత్త కాంట్రాక్టులపై ఒప్పందాలు కుదుర్చుకోవటం కూడా కలిసివచ్చిందని పేర్కొన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,500 ▼	63,900 ▼	88,000 ▼
ముంబై	68,131 ▼	62,408 ▼	81,271 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	102
కర్నూలు	104	నెల్లూరు	102
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

నిఫ్టీ కొత్త రికార్డు

5 రోజుల నష్టాలకు తెర దించిన మార్కెట్

ముంబై: ఈక్విటీ మార్కెట్ ఐదు రోజుల వరుస నష్టాలకు తెర దించింది. అమెరికాలో జీడీపీ గణాంకాలు ఆశించిన దాని కన్నా మెరుగ్గా ఉండడంతో పాటు ఇన్వెస్టర్లు "తగ్గినప్పుడు కొను" అనే సూత్రాన్ని పాటించి విలువ ఆధారిత కొనుగోళ్లు జరపడం మార్కెట్‌కు ఊపిరులు పోసింది. ఇన్ఫోసిస్, ఎయిర్‌టెల్, ఆర్ఐఎల్ వంటి బ్లూచిప్ షేర్లలో జరిగిన కొనుగోళ్లు మార్కెట్‌ను పరుగులు పెట్టించాయి. ఈక్విటీ సూచీలు 1.7 శాతం మేరకు లాభపడ్డాయి. నిఫ్టీ అయితే సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. 428.75 పాయింట్లు లాభపడి 24,834.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 1,292.92 పాయింట్లు లాభపడి 81,332.72 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,387.38 పాయింట్లు లాభపడి 81,427.18 పాయింట్ల గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే ఈ రెండు స్థాయిలూ గతంలో సెన్సెక్స్ నమోదు చేసిన జీవితకాల గరిష్ఠ స్థాయిల కన్నా దిగువనే ఉన్నాయి. వారం మొత్తం మీద సెన్సెక్స్ 728 పాయింట్లు, నిఫ్టీ 304 పాయింట్లు లాభపడ్డాయి. అయితే గత శుక్రవారం నుంచి ఐదు సెషన్లలో సెన్సెక్స్ 1,303.66 పాయింట్లు, నిఫ్టీ 394.75 పాయింట్ల మేరకు నష్టపోయాయి.

- శుక్రవారం నాటి ర్యాలీతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.7,10,235.45 కోట్ల మేరకు పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి 4,56,92,671.33 కోట్లకు (5.46 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.
- నెస్లె మినహా సెన్సెక్స్ షేర్లన్నీ లాభపడ్డాయి. 4.51 శాతంతో భారతి ఎయిర్‌టెల్ లాభపడిన షేర్లలో ఉంది.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.12 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1 శాతం లాభపడ్డాయి. రంగాలవారీ సూచీలన్నీ కూడా లాభాలతో ముగిశాయి.

ఫారెక్స్ నిధుల సరికొత్త రికార్డు

విదేశీ మారక నిల్వలు జూలై 19వ తేదీతో ముగిసిన వారంలో సరికొత్త రికార్డును నమోదు చేశాయి. ఆ వారంలో నిల్వలు 400 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 67,085.7 కోట్ల డాలర్లకు చేరాయి. ఫారెక్స్‌లో ప్రధాన భాగం అయిన విదేశీ మారక ఆస్తులు 257.8 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 58,804.8 కోట్ల డాలర్లకు చేరడం ఇందుకు దోహదపడింది. ఇదే వారంలో బంగారం నిల్వలు 132.9 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 5,999.2 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

భారత్‌లో తగ్గిన ఐఫోన్ ధరలు

రూ.6,000 వరకు తగ్గింపు

న్యూఢిల్లీ: భారత్‌లో తన ఐఫోన్ల ధరలు 3 నుంచి 4 శాతం (రూ.300 నుంచి రూ.6,000) తగ్గిస్తున్నట్టు యాపిల్ కంపెనీ ప్రకటించింది. కేంద్ర బడ్జెట్‌లో మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ డ్యూటీని 20 శాతం నుంచి 15 శాతానికి తగ్గించటమే ఇందుకు కారణం. ఈ నిర్ణయంతో భారత్‌లో తయారయ్యే ఐఫోన్ 13, 14, 15 మోడల్స్ ధర రూ.300 తగ్గింది. ఎంట్రీ లెవల్ ఐఫోన్ ఎస్‌ఈ ధరా రూ.49,900 నుంచి రూ.47,600కు చేరింది. దిగుమతి చేసుకునే తన లేటెస్ట్ మోడల్ ఐఫోన్ 15 ప్రో మోడల్ ధరా రూ.5,100 నుంచి రూ.6,000 వరకు తగ్గింది.

భారత్‌లో ఐఫోన్ 16 తయారీ!: యాపిల్ కంపెనీ ఈ ఏడాది సెప్టెంబరులో తన లేటెస్ట్ ఐఫోన్ 16 మోడల్‌ను మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఈ ఫోన్లను భారత్‌లో అసెంబ్లింగ్ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

వాయిస్, డేటా, ఎస్ఎంఎస్‌లకు విడివిడిగా రీచార్జ్ ప్లాన్స్!

కన్సల్టేషన్ పేపర్ విడుదల చేసిన ట్రాయ్


న్యూఢిల్లీ: వాయిస్ కాల్స్, డేటా, ఎస్ఎంఎస్‌లకు విడివిడిగా రీచార్జ్ ప్లాన్లు తీసుకురావాలని టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ భావిస్తోంది. దీనికి సంబంధించి ఒక చర్చాపత్రం విడుదల చేసింది. వచ్చే నెల 16లోగా దీనిపై పరిశ్రమ, వినియోగదారులు, టెలికాం నిపుణులు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ప్రస్తుతం టెలికాం కంపెనీలు ఈ మూడింటికి కలిపి ఒకే ప్లాన్ రూపంలో అందిస్తున్నాయి. ఇలా బండిల్డ్ ప్లాన్స్ ఇవ్వడంతో చాలా మంది టెలికాం ఖాతాదారులు వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు మాత్రమే వినియోగించుకొని డేటా వినియోగించుకోవడం లేదు. అయినా బండిల్డ్ ప్లాన్స్ కింద డేటాకు కూడా తాము డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ట్రాయ్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ట్రాయ్ ఈ చర్చాపత్రం విడుదల చేసింది. దీనికి తోడు స్పెషల్ టారిఫ్ వోచర్లు, కాంబో వోచర్ల గడువుని ప్రస్తుతం ఉన్న 90 రోజుల నుంచి పెంచడంపైనా ట్రాయ్ స్టేక్‌హోల్డర్ల అభిప్రాయాలు కోరింది.

అర్బన్ సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ దిద్దుబాటు చర్యలు

ముంబై: అవసరమైన సమయంలో నియంత్రణాపరమైన పర్యవేక్షణా చర్యలు తీసుకునేందుకు వీలుగా పట్టణ సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ సత్వర దిద్దుబాటు చర్యలను (పీసీఏ) ప్రకటించింది. ప్రైమరీ (అర్బన్) సహకార బ్యాంకులపై (యూసీబీ) ఈ చర్యలు వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తాయి. దీని వల్ల నియంత్రణాపరమైన జోక్యం అవసరం అనిపించిన సమయంలో ఆర్‌బీఐ రంగంలోకి దిగి వాటి ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి తగు దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం కలుగుతుంది. బలహీనంగా ఉన్న, ఆర్థికపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న యూసీబీల స్థితిని మెరుగుపరచడం లక్ష్యంగా ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన సూపర్‌వైజరీ యాక్షన్ ఫ్రేమ్‌వర్క్ (ఎస్ఏఎఫ్) స్థానంలో ఈ పీసీఏ అమల్లోకి వస్తుందని తెలిపింది.

బంధన్ బ్యాంక్ లాభం రూ.1,063 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని బంధన్ బ్యాంక్.. జూన్ త్రైమాసిక నికర లాభం 47 శాతం వృద్ధి చెంది రూ.1,063 కోట్లకు చేరుకుంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొండి బకాయిలు గణనీయంగా తగ్గటమే ఇందుకు కారణం. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.721 కోట్లుగా ఉంది. కాగా సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.4,908 కోట్ల నుంచి రూ.6,063 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 6.76 శాతం నుంచి 4.23 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.18 శాతం నుంచి 1.15 శాతానికి తగ్గాయి.



పదేళ్ల తర్వాతే జగన్‌కు ప్రతిపక్ష హోదా

▸▸ ఆయన పాలనలో 'శాంతి'కే భద్రత లేదు: మంత్రి కేశవ్

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో రాహుల్ గాంధీకి మాదిరిగా రాష్ట్ర అసెంబ్లీలో జగన్మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా రావాలంటే ఇంకా పదేళ్లపైనే పడుతుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. శాసనసభ్యుడి పాత్ర పోషించ లేక అసెంబ్లీకి రాకుండా చేతులెత్తేసిన జగన్.. ప్రతిపక్ష హోదా కోసం కోర్టుకు వెళ్లారని వ్యాఖ్యానించారు. 'ప్రజా సమస్యలపై పోరాడమని 11 సీట్లు ఇస్తే.. అసెంబ్లీలో అడగాల్సినవి ఢిల్లీలో అడుగుతున్నారు. ఇలాగే వ్యవహరిస్తే ఇప్పుడున్న 11 సంఖ్య ఒక్కటే అయ్యే ప్రమాదముందని జగన్ గ్రహించాలి. కూటమి పాలనలో శాంతిభద్రతలు లేవంటున్న జగన్.. తన పాలనలో శాంతికే భద్రత లేకుండా చేశారు. గత ఐదేళ్లలో అప్పు రూ.3.75 లక్షల కోట్లే అంటున్నారు. ఆర్థిక శాఖ శ్వేతపత్రం ద్వారా రూ.9.5 లక్షల కోట్ల అప్పు తేలింది. ఇది రూ.12 లక్షల కోట్లకు పెరగొచ్చు' అని కేశవ్ అన్నారు.



వరద బాధిత కుటుంబాలకు
3,000 తక్షణ సాయం

▸▸ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద బాధిత కుటుంబాలకు రూ.3,000 చొప్పున నగదు, 25 కిలోల బియ్యంతోపాటు కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు కిలో చొప్పున, ఒక లీటరు పామాయిలు కూడా తక్షణ సాయంగా అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం శాసనసభలో ప్రకటించారు. ఇళ్లలోకి వరద నీరు చేరి, పునరావాస కేంద్రాల్లో ఉంటున్నవారందరికీ ఈ తక్షణ సాయం అందుతుందని తెలిపారు. గోదావరి వరదల వల్ల ఆయా జిల్లాల్లో వాటిల్లిన నష్టాలపై సభలో చర్చించారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 'ఇటీవల కురిసిన భారీవర్షాలకు తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో ఒక లక్షా 6 ఎకరాల్లో వరిపంట, 4,317 ఎకరాల్లో వరి నారుమళ్లు దెబ్బతిన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 273 ఎకరాల్లో పంటలు ఇప్పటికీ వరద నీటిలోనే ఉన్నాయి. ఇలాంటి సమయంలో బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పూర్తిస్థాయిలో వరద నష్టాలను అంచనా వేసిన తర్వాత పంటలు నష్టపోయిన రైతులకు నిబంధనల మేరకు ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువే పరిహారం అందజేస్తాం' అని ప్రకటించారు. వరద నష్టాలను త్వరగా పూర్తి చేయించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనితలను ఆదేశించారు. ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయికి వెళ్లి బాధితులను పరామర్శించాలని చెప్పారు.

శాసనసభ నిరవధిక వాయిదా

రాష్ట్ర శాసనసభ మొదటి సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జరిగిన సమావేశాల గణాంకాలను స్పీకరు అయ్యన్న పాత్రుడు వెల్లడించారు. 'మొత్తంగా ఆరు రోజులు జరిగిన సమావేశాల్లో సభా కార్యకలాపాలు 27 గంటల 22 నిమిషాలపాటు కొనసాగాయి. రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టగా ఆ రెండూ ఆమోదం పొందాయి' అని స్పీకర్ వివరించారు. ఈ సమావేశాలు విజయవంతంగా ముగిశాయని పేర్కొన్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు.. శుక్రవారం మధ్యాహ్నం 3.18 నిమిషాలకు సభను నిరవధికంగా వాయిదా వేశారు.

ఖర్జూరం సాగుకు ప్రోత్సాహం: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖర్జూరం సాగును ప్రోత్సహిస్తామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. శుక్రవారం సచివాలయంలో రాయలసీమకు చెందిన ఖర్జూర సాగు రైతులు మంత్రిని కలిసి, సమస్యలు చెప్పుకున్నారు. 700 ఎకరాల్లో ఉన్న ఖర్జూర సాగుకు రాయితీపై బిందు సేద్య పరికరాలు ఇవ్వాలని, మొక్కల ఖర్చు తగ్గించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'ఉపాధిహామీ పథకంలో ఖర్జూర సాగును ప్రోత్సహించి, రైతులకు సూక్ష్మసేద్య సౌకర్యాన్ని రాయితీపై కల్పిస్తాం' అన్నారు.

2024 జూన్ 18 నాటికి పెండింగ్ బిల్లులపై హైకోర్టులో దాఖలైన కేసులు

కేసుల కేటగిరి	కేసులు/ బిల్లుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
ధిక్కార కేసులు	5,615	1,761
సూచనలతో రిట్ పిటిషన్లు	3,269	1,781
రిట్ పిటిషన్లు	16,104	వివరాలు అందాలి
ఆర్థిక శాఖపై మొత్తం కేసులు	24,988	3,542

ఏపీ.. అప్పులకుప్ప

(మొదటి పేజీ తరువాయి)

అసలూ వడ్డీ చెల్లింపులు, పెండింగ్ బిల్లులు తదితర వివరాలు వెల్లడించారు. పెండింగ్ బిల్లులు మొత్తం రూ.1.35 లక్షల కోట్లు ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. 2024-25లో అప్పుల అసలు, వడ్డీ కలిపి రూ.71,881 కోట్లు చెల్లించాలని తెలిపారు. విభజన నష్టాలు, ఆ తర్వాత టీడీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిన తీరు, 2019 తర్వాత వైసీపీ హయాంలో రాష్ట్రం వెనుకబడ్డ తీరును చంద్రబాబు వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజలు సలహాలు ఇవ్వాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అరాచకాలు, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చంద్రబాబు మాటల్లోనే...

నిధులు మళ్లించి.. పన్నులు పెంచి

విభజన తర్వాత తలసరి ఆదాయం ఏపీలో రూ.93,903కు తగ్గింది. తెలంగాణలో ఒక్కసారిగా రూ.1,24,104కు చేరుకుంది. తర్వాతి ఐదేళ్లు తెలంగాణతో సమానం అయ్యేందుకు ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించే ప్రయత్నం చేశాం. పట్టిసీమ లిఫ్ట్ వల్ల ఇరిగేషన్‌కు రూ.44,000 కోట్ల ఆదాయం వచ్చింది. పోలవరం కోసం రూ.15,364 కోట్లు ఖర్చు చేశాం. 2019లో కూడా మేము అధికారంలోకి వచ్చుంటే ఇప్పటికే అమరావతి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా మారి ఉండేది. 7 లక్షల మంది ఉద్యోగులు అమరావతిలో ఉండేవారు. 3 నుంచి 4 లక్షల కోట్ల ఆస్తి అమరావతితో వచ్చేది. 2014-19 మధ్య తలసరి ఆదాయం 13.2శాతం పెరిగింది. ఇప్పుడు విద్యుత్ రంగంలోనే అప్పులు రూ.1.29 లక్షల కోట్లకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు మళ్లించారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, పన్నులు, ఇసుకపై పన్నులు పెంచారు. ప్రస్తుతం అప్పు రూ.9.74 లక్షల కోట్లకు చేరింది. తలసరి అప్పు రూ.1,44,336కు చేరింది. టీడీపీ హయాంలో ఇది రూ.74,790గా ఉండేది.

2024 జూన్ 12 నాటికి రాష్ట్రం అప్పులు, బకాయిలు

ప్రభుత్వ అప్పు	4,38,278
పబ్లిక్ డెట్	80,914
కార్పొరేషన్ల అప్పు	2,48,677
పౌరసరఫరాలకు బకాయిలు	36,000
విద్యుత్ శాఖకు బకాయిలు	34,267
సరఫరాదారులకు బకాయిలు	1,13,244
ఉద్యోగులకు బకాయిలు	21,980
సింకింగ్ ఫండ్ లోటు	1,196
మొత్తం	**9,74,556**

2019 మార్చి 31 నాటికి అప్పులు 3.75 లక్షల కోట్లు

2024 జూన్ 12 నాటికి అప్పులు 9.74 లక్షల కోట్లు

డబ్బులు ఊడ్చేశారు

గత ప్రభుత్వంలో 33 ప్రభుత్వ శాఖల నుంచి డబ్బులు లాగేశారు. ఎన్టీయార్ హెల్త్ యూనివర్సిటీ నుంచి రూ.400 కోట్లు తీసుకున్నారు. విశాఖలో ప్రభుత్వ భవనాలు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. మిగిలిన భూములను కబ్జా చేశారు. వీటి విలువ రూ.40,000 కోట్లు. అభయహస్తం కింద ఉన్న డ్వాక్రా మహిళల డబ్బును కూడా కొట్టేశారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఐఏఎస్‌లు, సీఎస్ కోర్టు ముందు కెళ్లి సంజాయిషీ చెప్పుకోవాల్సి వచ్చింది. కొందరికి జైలు శిక్ష కూడా పడింది. పెండింగ్ బిల్లులు రూ.1.35 లక్షల కోట్లుగా తేలాయి.



రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరగలేదు. కానీ జగన్‌తో సహా వైసీపీ నేతల ఆదాయం లక్షల రెట్లు పెరిగింది. జగన్ హయాంలో జరిగిన అవినీతి విధానాలను అంతర్జాతీయ యూనివర్సిటీల్లో కేస్ స్టడీస్‌గా తీసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలి. - చంద్రబాబు

500 కోట్లతో రుషికొండ ప్యాలెస్

ఒక్క వ్యక్తి ఆనందం కోసం రూ.500 కోట్లతో విశాఖ రుషికొండలో ప్యాలెస్ కట్టారు. ఈ 500 కోట్లు టూరిజంలో ఖర్చు చేస్తే వేలకోట్ల ఆదాయం వచ్చేది. నేను 14 ఏళ్లు సీఎంగా ఉన్నాను. కానీ, ఈ తరహాలో ప్యాలెస్ కట్టాలన్న ఆలోచన ఎన్నడూ రాలేదు.

విధ్వంసాన్ని ప్రతిబింబించిన శ్వేత పత్రాలు

▸▸ మొత్తంగా ఏడు అంశాలపై విడుదల

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో చోటు చేసుకొన్న ఆర్థిక, సామాజిక విధ్వంసంపై కొత్త ప్రభుత్వం మొత్తంగా ఏడు శ్వేతపత్రాలు విడుదల చేసింది. ఆయా అంశాల్లో పరిస్థితులను ప్రజల ముందుంచేందుకు వీలుగా శ్వేతపత్రాలను ప్రకటిస్తామని చంద్రబాబు ముందే ప్రకటించారు. అమరావతి, పోలవరం, విద్యుత్తు, సహజ వనరులు, మద్యం, శాంతి భద్రతలు, ఆర్థికంపై వాస్తవాలను ప్రజల ముందుంచారు. వీటిలో... నాలిగింటిని విలేకరుల సమావేశాల్లో, మిగిలిన మూడింటిని అసెంబ్లీ వేదికపై విడుదల చేశారు. అయితే... అధికార వర్గాల నుంచి ఇంకా పూర్తి సమాచారం రాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబే పేర్కొన్నారు. సహజ వనరులకు జరిగిన దోపిడీలో సంబంధిత శాఖల నుంచి సమాచారం రాబట్టడానికి ఉన్నతాధికారులు చాలా శ్రమించాల్సి వచ్చింది. ఆర్థిక శాఖలో పెండింగ్ బిల్లుల సమాచారం రాబట్టడం కొత్త ప్రభుత్వానికి తలకుమించిన భారమైంది.

జగన్ నిర్వాకంతో నష్టాలు

- ఐదేళ్లలో మూలధన వ్యయం 60 శాతానికి తగ్గింది. కేంద్రం రూ.15,000 కోట్లు ఇస్తే మనం సంబరపడిపోయాం. ఈరోజు అందుకోలేనంత దూరం అప్పుల విషయంలో వెళ్లిపోయాం.
- ప్రస్తుతం రాష్ట్రానికి వచ్చే ప్రతి రూ.100 ఆదాయానికి ఖర్చు రూ.113 ఉంది.
- 2024-25 రెవెన్యూ లోటు రూ.1.46,909 కోట్లకు చేరుతుంది.
- పోలవరాన్ని పట్టించుకోకపోవడం వల్ల రూ.53,000 కోట్ల నష్టం వాటిల్లింది.
- అమరావతిపై జగన్ విధ్వంసం వల్ల 7 లక్షల ఉద్యోగాలు పోయాయి. రూ.2 లక్షల నుంచి 3 లక్షల కోట్ల ఆస్తి ఆవిరైపోయింది.
- రూ.32,000 కోట్ల మేర విద్యుత్ చార్జీలు పెంచారు. పీపీఏ ఒప్పందాలు రద్దు చేయడం వల్లనే ప్రజలపై ఈ భారం పడింది.
- పీపీఏ ఒప్పందాల రద్దుపై కోర్టుకు వెళ్తే వారికి రూ.9,000 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. ఆ తర్వాత యూనిట్ రూ.9కు విద్యుత్ కొన్నారు.
- ఇసుకలో రూ.7,000 కోట్లు, గనుల్లో రూ.10,000 కోట్లు దోచుకున్నారు.
- ఎక్సైజ్‌లో జగన్ విధానాల వల్ల రూ.17,000 కోట్ల నష్టం జరిగింది.
- జగన్ సర్కారు రాగానే ప్రజావేదికను కూల్చేశారు.

పరిస్థితి బాగలేకున్నా...

- ఆర్థిక పరిస్థితి సహకరించనప్పటికీ సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం. ఆగస్టు 15వ తేదీన 100 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నాం. మని చెప్పారు.
- పీపీపీ, వీజీఎఫ్ విధానంలో రోడ్లు వేయాలన్న ఆలోచన ఉంది. టోల్ గేట్లు పెట్టి లారీలు, కార్లు, బస్సులకు మాత్రమే టోల్ వసూలు చేసి ఆ డబ్బు ను వీజీఎఫ్ కింద అందించాలన్న యోచనలో ఉన్నాం.

అరకొర లెక్కలే

శ్వేతపత్రంలో పూర్తి వివరాలేవీ?

▸▸ సమాచారం దాస్తున్న అధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆర్థిక రంగంలో జగన్ చేసిన విధ్వంసంపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం సమగ్రంగా లేదు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులకు సంబంధించి ఆర్థిక శాఖ అధికారులు ప్రభుత్వానికి పూర్తిగా సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. జగన్ ప్రభుత్వంలో ఆర్థిక శాఖలో పనిచేసిన అధికారులనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొనసాగిస్తుండటమే ఈ పరిస్థితికి కారణమని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. శ్వేతపత్రంలో పబ్లిక్ డెట్ రూ.4.38 లక్షల కోట్లు ఉన్నట్టు రాశారు. కానీ ఇటీవల ఆర్‌బీఐ విడుదల చేసిన స్టడీ ఆఫ్ బడ్జెట్స్ పుస్తకంలోని వివరాల ప్రకారం ఏపీ పబ్లిక్ డెట్ రూ.4.85 లక్షల కోట్లు ఉంది. ఇక్కడే రూ.47,000 కోట్ల తేడా కనిపిస్తోంది. అలాగే గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్లు సృష్టించి మరీ రాజ్యాంగ విరుద్ధంగా లక్షల కోట్ల అప్పులు తెచ్చారు. ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్, ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లాంటివి తీవ్ర వివాదాస్పదమయ్యాయి. కానీ శ్వేతపత్రంలో కార్పొరేషన్ల వారీగా అప్పుల వివరాలు చూపించలేదు. పైగా కార్పొరేషన్ల అప్పులంటూ రూ.2.48 లక్షల కోట్లుగా వేశారు. ఇందులో ఆయా కార్పొరేషన్ల గ్యారెంటీ అప్పులెంత, నాన్ గ్యారెంటీ అప్పులెంత అనేది చెప్పనేలేదు. కార్పొరేషన్ల నాన్ గ్యారెంటీ అప్పులు రూ.80,000 కోట్లు ఉన్నాయి. వీటిని చూపించలేదు. అలాగే పెండింగ్ బిల్లులు రూ.1,35,224 కోట్లు ఉన్నట్టు రాశారు. ఇంధన రంగంలో ఉన్న రూ.35,000 కోట్ల పెండింగ్ బిల్లులను రూ.5,000 కోట్లుగానే చూపించారు. దాదాపు రూ.1.80 లక్షల కోట్ల పెండింగ్ బిల్లుల వివరాలు ఆర్థిక శాఖ వద్ద ఉన్నప్పటికీ కేవలం వాటిని రూ.1.35 లక్షల కోట్లకే పరిమితం చేశారు. ఇంకా తవ్వితే పెండింగ్ బిల్లులు రూ.2 లక్షల కోట్లకు చేరుకుంటాయి. సరిగ్గా సమాచారం ఇవ్వని అధికారులపైనే ఆధారపడటం తప్ప బాధితుల కోసం ఒక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసి వారి నుంచి పెండింగ్ బిల్లుల వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం వెనుకాడుతోంది. పంచాయతీలు, ఉద్యోగుల నిధులు రూ.5,308 కోట్లు దారి మళ్లించినట్టు శ్వేతపత్రంలో రాశారు. కానీ కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు భారీగా దారి మళ్లించారు. వాటి వివరాలు రాయలేదు.

శ్వేతపత్రంలో వడ్డీలు రాసి, అసలు మర్చిపోయారు. ఏడాదికి డెట్ సర్వీసింగ్ ఖర్చు రూ.71,881 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పుస్తకంలో పబ్లిక్ డెట్ కింద చెల్లించాల్సిన అప్పుల అసలు రూ.25,212 కోట్లు, వడ్డీ రూ.28,017 కోట్లు.. మొత్తం రూ.53,229 కోట్లు చెల్లించాలి. కార్పొరేషన్ల అప్పు రూ.3.30లక్షల కోట్ల నుంచి రూ.3.50 లక్షల కోట్ల వరకు ఉంటుంది. సగటున 9శాతం వడ్డీ లెక్కేసినా ఏడాదికి రూ.42,000 కోట్లు అసలు, వడ్డీ ఉంటుంది. కానీ పబ్లిక్‌డెట్‌పై చెల్లించాల్సిన వడ్డీ రూ.28,017కోట్లు, కార్పొరేషన్ అప్పుల వడ్డీ రూ.42,000 కోట్లు కలిపి మొత్తం డెట్ సర్వీసింగ్ దాదాపు రూ.71,000 కోట్లు వేశారు. చెల్లించాల్సిన అసలు రూ.25,212 కోట్ల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు.

అసెంబ్లీపై అలిగిన జగన్

(మొదటి పేజీ తరువాయి)



మైక్ ఇవ్వాలి. అందుకే.. నాకు ఆ హోదా ఇవ్వడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో విడుదల చేసిన శ్వేత పత్రాలకు దీటుగా సమాధానం చెప్పేవాడిని. కాని.. నాకు ప్రతిపక్షనేత హోదా ఇవ్వలేదు. అందుకే.. తాడేపల్లి నివాసంలో జర్నలిస్టులతో మాట్లాడుతున్నాను" అని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 52 రోజులుగా రాక్షసపాలన సాగుతోందని ఆక్రోశించారు. "8 మందిపై అత్యాచారం జరిగింది. నలుగురు హత్యకు గురయ్యారు. వినుకొండలో వైసీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై హత్య చేశారు. రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వినుకొండ వెళ్లాను. ప్రభుత్వాన్ని నిలదీశాను. దానిని డైవర్ట్ చేయడానికి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని హైలెట్ చేస్తున్నారు" అని జగన్ పేర్కొన్నారు.

వాళ్లిద్దరూ మంచోళ్లు...

మదనపల్లెలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఏదో చేశారంటూ ప్రచారం చేస్తున్నారని... వాళ్లిద్దరూ మంచోళ్లని జగన్ కితాబిచ్చారు. అందుకే... పెద్దిరెడ్డి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, మిథున్ రెడ్డి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. వాళ్లను అభాసుపాలు చేయాలనే ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారు. దాడికి గురైనవారిపైనే పోలీసులు కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో రివర్స్ పాలనసాగుతోంది " అని జగన్ ఆక్రోశించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మంచిదని సమర్థించారు.

అబద్ధాలపై గవర్నర్‌కు లేఖ రాస్తా

శాసనసభలో గవర్నర్ ప్రసంగ సమయంలో అప్పులకు సంబంధించి చెప్పిన గణాంకాలన్నీ తప్పులేనని జగన్ పేర్కొన్నారు. తన హయాంలో మొత్తంగా నాలుగు లక్షల కోట్లమేర మాత్రమే అప్పులు చేశామని.. ప్రభుత్వ గ్యారెంటీలను, ఇతర అప్పులను కలిపితే ఏడు లక్షల కోట్లు అని తెలిపారు. కానీ... గవర్నర్ ప్రసంగంలో దీనిని పది లక్షల కోట్ల రూపాయలుగా పేర్కొన్నారని అన్నారు. వాస్తవ పరిస్థితులను తెలియజేస్తూ గవర్నర్‌కు లేఖ రాస్తానని తెలిపారు.

ఆరు నెలల కిందట... అవన్నీ నిజాలే!

▸▸ జగన్ వ్యాఖ్యలపై జనం చురకలు

▸▸ విపక్షంలోకి రాగానే 'అరాచక' మాటలు

▸▸ ఐదేళ్ల గతం మరచి 'రివర్స్' వ్యాఖ్యలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోంది. రివర్స్ పాలన నడుస్తోంది. బాధితులపైనే పోలీసులు హత్యాయత్నం కేసులు పెడుతున్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు"... కొన్నాళ్లుగా జగన్మోహన్ రెడ్డి పదేపదే చెబుతున్న మాటలివి! 'ఔను.. ఆయన చెబుతున్నవన్నీ నిజాలే! అయితే.. ఆరు నెలల కిందటి వరకు పరిస్థితి ఇలాగే ఉండేది. ఆ విషయాలనే జగన్ ఇప్పుడు చెబుతున్నట్లుంది" అని విశ్లేషకులు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. 'అరాచకం, అన్యాయం, దౌర్జన్యం, రాష్ట్రపతి పాలన విధించాలి, ప్రజాస్వామ్యం చచ్చిపోయింది'... అంటూ విపక్షంలోకి వచ్చిన రోజు నుంచే జగన్ వాపోతున్నారు. తన ఐదేళ్ల పాలన గురించే జగన్ ఈ మాటలు అంటున్నట్లుందని.. ఆయన వ్యాఖ్యలు వింటుంటే నాటి పరిస్థితులు మళ్లీ కళ్లముందు కదలాడుతున్నాయని జగన్ బాధితులు పేర్కొంటున్నారు. 'పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, మిథున్ రెడ్డి పలుమార్లు ఎన్నికల్లో గెలిచారు కాబట్టి వాళ్ల మంచోళ్లు' అంటూ జగన్ చేసిన సూత్రీకరణ కూడా నవ్వు తెప్పిస్తోంది. తాజా ఎన్నికల్లో 164 మంది వైసీపీ అభ్యర్థులు ఓడిపోయారు. 21 మంది ఎంపీ అభ్యర్థులూ పరాజయం పాలయ్యారు. అంటే... వాళ్లంతా చెడ్డోళ్లని జగన్ ఒప్పుకున్నట్లేనా!? ఎన్నికల ప్రచార సభలో పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిని 'మంచోడు' అన్నప్పుడే... జగన్ భాషలో మంచి, చెడుకు అర్థాలు వేరని తేలిపోయింది. చంద్రబాబు, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడూ వరుసగా ఎన్నికల్లో గెలుస్తున్నారు. వాళ్లపై జగన్ కేసులు బనాయించారు. మరి... ఆయన సూత్రీకరణప్రకారం మంచి వాళ్లపైన కేసులు పెట్టకూడదు కదా!? ఇవేకాదు... దాదాపు రెండు గంటల ప్రెస్‌మీట్‌లో జగన్ అనేక అంశాలను అసంబద్ధంగా, గజిబిజిగా మాట్లాడారు. స్పిల్ వే పనులు పూర్తి చేయకుండా కాఫర్ డ్యామ్ లు నిర్మించడంవల్ల మెయిన్ డ్యామ్‌లోని మూడు డయాఫ్రమ్‌వాల్స్ దెబ్బతిన్నాయని జగన్ వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టులో ఉన్నదే ఒకే డయాఫ్రమ్‌వాల్! మరో రెండు ఎక్కడి నుంచి వచ్చాయో జగన్‌కే తెలియాలి. విద్యుత్ చార్జీలు పెంచబోమంటున్న చంద్రబాబు ట్రూఅప్ చార్జీలపై నోరు మెదపడంలేదని కూడా జగన్ విమర్శించారు. తన హయాంలో అడ్డగోలుగా వేసిన ట్రూఅప్ చార్జీలను కొత్త ప్రభుత్వం రద్దు చేయాలనడం వింతల్లోకెల్లా వింత!

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ ఢిల్లీ నుంచి గల్లీ దాకా జగన్ రచ్చ చేస్తున్నారు. కానీ... శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ లెక్క చెప్పలేదు. పైగా... నలుగురే హత్యకు గురయ్యారన్నట్లుగా మాట్లాడారు. జగన్‌ను చంద్రబాబు కొలంబియా డాన్ పాబ్లో ఎస్కోబార్‌తో పోల్చడంపై ప్రశ్నించినప్పుడు .. జగన్ అర్థం కానట్లుగా ము ఖంపెట్టారు. ఆ పేరును పలికేందుకు తడబడ్డారు.

మళ్లీ యెలహంక ప్యాలెస్‌కు...

సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నాక.. రాష్ట్ర ప్రజలపై కోపమో ఏమోగానీ.. తాడేపల్లి ప్యాలెస్‌కు జగన్ దూరంగా ఉంటున్నారు. వినుకొండలో హత్యకు గురైన రషీద్ కుటుంబ సభ్యుల పరామర్శ సందర్భంగా హుటాహుటిన బెంగళూరు యెలహంక ప్యాలెస్ నుంచి వచ్చిన జగన్ దంపతులు శుక్రవారం మళ్లీ యెలహంకకు వెళ్లారు. గన్నవరం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరు చేరుకున్నారు. మూడురోజుల పాటు అక్కడే బస చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రాజకీయ హత్యలు, దాడులు లేవు

▸▸ క్షేత్రస్థాయి విచారణకూ మేం సిద్ధం: మంత్రి అనిత



'రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీ నాయకులు సహా ఆ పార్టీ సానుభూతిపరులపై ఎక్కడా ఉద్దేశపూర్వకంగా దాడులు జరగట్లేదు. యాదృచ్ఛికంగా జరిగిన చిన్నపాటి ఘటనలను పెద్దవిచేసి చూపుతూ జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని హోంమంత్రి అనిత మండిపడ్డారు. మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడారు. 'రాష్ట్రంలో 36 మందిని రాజకీయ హత్యలు చేశారని జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా రాజకీయ హత్యలు జరగడం లేదు. జగన్ చెబుతున్న వివరాలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నాం. క్షేత్రస్థాయి విచారణకూ సిద్ధం. జగన్ కూడా మాతోపాటు రావాలి. రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని అనిత తెలిపారు.

9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచిన వైసీపీ ప్రభుత్వం: మంత్రి గొట్టిపాటి

గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడం వల్ల విద్యుత్ రంగంపై అదనంగా దాదాపుగా రూ.18,948 కోట్లు భారం పడిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలపై చార్జీల భారం పడిందన్నారు. వైసీపీ ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు.

జగన్ పత్రికకు జనం సొమ్ము

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో చర్చ జరిగింది. ఈ ప్రశ్నకు సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమాధానమిచ్చారు. జీవో 431 ప్రకారం ప్రకటనల జారీలో ఐ అండ్ పీఆర్ శాఖకు విచక్షణాధికారం ఉందని, దీనిని అడ్డం పెట్టుకుని గత ప్రభుత్వంలో అడ్డగోలుగా ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. పూర్తిగా పక్షపాత ధోరణితో ప్రకటనలు ఇచ్చారన్నారు. ఈ ఒక్క శాఖ నుంచే కాకుండా ఇతర శాఖల నుంచి కూడా భారీగా సాక్షికి ప్రకటనలు ఇచ్చారని తెలిపారు. ఈనాడు లాంటి పత్రికలు ప్రభుత్వం బిల్లులు ఇవ్వట్లేదనే కారణంతో ప్రకటనలు వద్దని చెప్పాయని తెలిపారు. సచివాలయాలకు సాక్షి పత్రిక వేసిన అంశం సమాచార, పౌర సంబంధాల శాఖకు సంబంధం లేదన్నారు. ఈ శాఖలోని అధికారులను రిలీవ్ చేయొద్దని డిమాండ్లు ఉన్నాయని, వారు రిలీవ్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ప్రకటనలు (రూ.)

పత్రిక	ప్రకటనల విలువ
ఈనాడు	243.37 కోట్లు
సాక్షి	371.12 కోట్లు
ఆంధ్రజ్యోతి	27.98 లక్షలు
ఆంధ్రప్రభ	16.49 కోట్లు
టైమ్స్ ఆఫ్ ఇండియా	27.21 కోట్లు
డెక్కన్ క్రానికల్	45.82 కోట్లు

'ఆంధ్రజ్యోతి'కి ఎందుకు ఇవ్వలేదు?

ప్రభుత్వాన్ని ఇప్పటికీ ఐ అండ్ పీఆర్ అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారని ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్‌కుమార్ ఆరోపించారు. పత్రికల ఏబీసీ వివరాలు సభ ముందు పెట్టాలని కోరారు. సర్క్యులేషన్ ప్రకారం ప్రకటనలు ఇవ్వాల్సి ఉందని, 'ఆంధ్రజ్యోతి'కి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సాక్షికి అత్యధిక స్థాయిలో ఎందుకిచ్చారని నిలదీశారు. ఇది పెద్ద కుంభకోణమని, ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా పనిచేసిన విజయ్‌కుమార్ రెడ్డిని రిలీవ్ చేయొద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారినా అధికారులు ఇంకా మారలేదని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. పక్షపాత ధోరణి కనిపిస్తున్నా పక్షపాతం లేదనే కోణంలో మంత్రికి సమాచారం ఇచ్చారన్నారు. సాక్షికి అప్పనంగా ప్రకటనలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియాను అడ్డుపెట్టుకుని జగన్ అనేక పాపాలు చేశారని బెందాళం అశోక్ విమర్శించారు. సచివాలయాలకు బలవంతంగా సాక్షి పత్రిక వేయించారని, సభా సంఘం వేసి ఆ నగదును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

జగన్ భజన కోసమే

జగన్ భజన కోసం గత ప్రభుత్వం రూ.859 కోట్లు ఖర్చు చేసిందని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. ఒక్క సాక్షికే రూ.371 కోట్ల ప్రకటనలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సర్క్యులేషన్ లేని పత్రికలకు కూడా భారీగా ప్రకటనలు ఇచ్చారని, రూ.120 కోట్లు డిజిటల్ కార్పొరేషన్‌కు ఇచ్చారని చెప్పారు. కూలి మీడియా, నీలి మీడియాకు రూ.వందల కోట్ల ప్రకటనలు ఇచ్చారన్నారు.

పాత అధికారుల రోత పనులు!

▸▸ మంత్రిని తప్పుదోవ పట్టించేలా సమాచారం

▸▸ నాటి తప్పులను కప్పి పుచ్చే ప్రయత్నం

▸▸ ప్రకటనల జారీలో పక్షపాతం లేదనేలా సమాధానం

గత ప్రభుత్వం పత్రికలకు ప్రకటనల జారీ అంశంపై చర్చలో సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథిని, మొత్తంగా సభనూ తప్పుదారి పట్టించారు. ఆ శాఖలో జగన్ హయాంలో పని చేసిన అధికారులే కీలక స్థానాల్లో కొనసాగుతున్నారు. '2019-24 మధ్య కాలంలో వార్తా పత్రికలకు ప్రకటనల జారీలో పక్షపాత ధోరణి వాస్తవమేనా?' అని ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నకు... అధికారులు 'లేదు' అని సమాధానమిచ్చారు. మంత్రి పార్థసారథి ఇదే సమాధానాన్ని సభకు చెప్పారు. కానీ... ఆయనే విడుదల చేసిన ప్రకటనల గణాంకాలు జగన్ పత్రికకు ఎక్కువ ప్రకటనలు ఇచ్చిన విషయాన్ని స్పష్టంగా ధ్రువీకరించాయి. దీంతో... ఓవైపు భారీగా ప్రకటనలు ఇచ్చినట్లు అంకెలు చెబుతుంటే, పక్షపాతం లేదని ఎలా చెబుతారని సభ్యులు నిలదీశారు. దీంతో మంత్రి పార్థసారథి ఇరకాటంలో పడ్డారు. జీవో 341 ప్రకారం శాఖకు విచక్షణాధికారం ఉన్నందున తాను అలా చెప్పానని, అంతే కానీ వాస్తవాలు దాయాలని కాదని వివరణ ఇచ్చారు. వాస్తవాలు దాచే ఉద్దేశం ఉంటే గణాంకాలు ఎందుకు విడుదల చేస్తామని ప్రశ్నించారు. సభ్యుల డిమాండ్‌తో సభా సంఘం అంశాన్ని కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

అరకొర సమాచారమే...

జగన్ పత్రికకు సమాచార శాఖ ద్వారా జారీ అయిన ప్రకటనల విలువే రూ.371 కోట్లు. జగన్ చానల్‌కు కూడా కోట్లలో జనం సొమ్ము గుమ్మరించారు. ఇక... జిల్లా స్థాయిలో జగన్ పత్రికకు ఇచ్చిన ప్రకటనల విలువ కూడా సభ దృష్టికి తీసుకురాలేదు. ఇవన్నీ కలిపితేగానీ జగన్ మీడియాకు దోచిపెట్టిన జనం సొమ్ము నికరంగా ఎంతనేది తెలియదు. మరోవైపు... జిల్లాల్లో జగన్ పత్రికకు జారీ చేసిన ప్రకటనల విలువ ఎంతో తెలియచేయాలంటూ శుక్రవారం అన్ని జిల్లాల డీపీఆర్వోలను ప్రభుత్వం ఆదేశించింది.


నీతి ఆయోగ్ భేటీకి చంద్రబాబు

▸▸ ఆరేళ్ల తర్వాత హాజరుకానున్న ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం శనివారం జరగనుంది. ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతున్నారు. ఇంతకుముందు ఆయన 2018 జూన్ 17న జరిగిన నీతి ఆయోగ్ 4వ పాలక మండలి సమావేశంలో పాల్గొన్నారు. వికసిత్ భారత్‌పై చంద్రబాబు ఈ సమావేశంలో తన అభిప్రాయాలను ప్రకటిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే గత ఐదేళ్లలో విధ్వంసమైన ఏపీ ఆర్థిక వ్యవస్థ గురించి కూడా వివరించి, దాన్ని పట్టాలపైకి తెచ్చేందుకు తీసుకోవల్సిన చర్యలను ప్రతిపాదిస్తారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. వికసిత్ భారత్-2047 అనే పేరుతో నీతీఆయోగ్ ఇప్పటికే ఒక ఆధారపత్రాన్ని రూపొందించింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థంగా చేర్చడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రజల జీవన నాణ్యతను పెంచడం అవసరమని ఈ ఆధారపత్రంలో పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్రాల పాత్రపై సుదీర్ఘంగా చర్చిస్తారని నీతీఆయోగ్ వర్గాలు తెలిపాయి.

ప్రతిపక్ష నేతల డుమ్మా

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్న పలువురు ప్రతిపక్ష నాయకులు నీతీఆయోగ్ సమావేశానికి డుమ్మా కొట్టనున్నారు. ఈ భేటీకి హాజరు కావడం లేదని తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఆ తర్వాత హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా గైర్హాజరవుతారని కాంగ్రెస్ పేర్కొంది. పంజాబ్ సీఎం భగవంత్ మాన్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ సైతం సమావేశానికి హాజరు కాకూడదని నిర్ణయించారు. కేరళ సీఎం పినరయి విజయన్ తాను ఈ భేటీకి హాజరు కాలేనని మోదీకి ముందుగానే లేఖ రాశారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, టీఎంసీ నేత డెరిక్ ఒబ్రెయిన్ మాత్రం ఈ సమావేశానికి హాజరు కానున్నారు.



ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు

గన్నవరం విమానాశ్రయం నుంచి శుక్రవారం సాయంత్రం బయలుదేరిన సీఎం చంద్రబాబు రాత్రి 8 గంటలకు ఢిల్లీ చేరుకున్నారు. ఎయిరుపోర్టులో టీడీపీ ఎంపీలు పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, దగ్గుమళ్ల ప్రసాదరావు, కృష్ణప్రసాద్, కేశినేని శివనాథ్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా.. సీఎం వారికి పుష్పగుచ్ఛాలు తీసుకురావద్దని సూచించారు. ఎయిరుపోర్టు నుంచి నేరుగా వన్ జన్‌పథ్‌లోని అధికారిక నివాసానికి చేరుకున్నారు. నేడు ప్రధాని మోదీ అధ్యక్షతన నిర్వహించనున్న నీతీఆయోగ్ సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు.

ఏపీకి అదనపు ఐపీఎస్‌లు

- కేడర్ స్ట్రెంత్ పెంచిన కేంద్ర హోంశాఖ
- ఐపీఎస్‌ల సంఖ్య 144 నుంచి 174కు పెంపు
- సీఎం చంద్రబాబు విన్నపంపై కేంద్రం స్పందన
- విభజన తర్వాత అదనపు కేటాయింపు ఇప్పుడే!

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి భారీగా కొత్త ఐపీఎస్‌లు రాబోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు చేసిన అభ్యర్థన మేరకు కేంద్రం స్పందించి ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 144 మంది ఐపీఎస్‌లను కేటాయించారు. అయినప్పటికీ పోలీసుల కొరత మాత్రం తీరలేదు. పైగా విభజన తర్వాత ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలు చేసింది. దీంతో పాటు నిఘా వ్యవస్థ విభాగాల్లో, క్రైం విభాగాల్లో పోలీసు అధికారుల కొరత తీవ్రంగా ఉంది. విభజన తర్వాత ఐపీఎస్‌ల కొరతను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం తమకు పోలీసు సిబ్బందిని ఎక్కువ మందిని కేటాయించాలని కేంద్రాన్ని కోరినా ఫలితంలేకపోయింది. జగన్ కూడా కేంద్రానికి లేఖ రాశారు. అయితే, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేకసార్లు ఢిల్లీ వెళ్లి హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసినా ఏనాడు ఐపీఎస్‌ల సంఖ్య పెంచే అంశంపై మాట్లాడిన దాఖలాలు లేవు. ఎప్పుడూ తన సొంత వ్యవహారాలు, కేసుల విషయం తప్ప పాలన వ్యవహారాలపై దృష్టిపెట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఢిల్లీ వెళ్లారు. హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి రాష్ట్రంలో ఐపీఎస్‌ల కొరత, ఇతర అంశాలపై ఆయనకు వివరించారు. పైగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన తర్వాత నాలుగైదు సంవత్సరాల అనుభవం ఉన్న జూనియర్ ఐపీఎస్‌లను ఎస్పీలుగా నియమించాల్సి వస్తోంది. దీనివల్ల జిల్లాల్లో లా అండ్ ఆర్డర్ సమస్యలతో పాటు కొన్ని ఇబ్బందికరమైన పరిస్థితులు ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఈ విషయాలు మొత్తం అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. సీఎం చంద్రబాబు విన్నపం మేరకు కేంద్ర హోం శాఖ ఏపీకి ఐపీఎస్‌ల సంఖ్య పెంచింది. 144 మంది ఐపీఎస్‌లున్న కేడర్ స్ట్రెంత్‌ను 174కు పెంచింది. దాదాపు 30 మంది ఐపీఎస్‌లను అదనంగా కేటాయించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ద్వారా 121 మంది ఐపీఎస్‌లు ఏపీల్లో విధులు నిర్వహించనున్నారు. 53 మందికి పదోన్నతుల ద్వారా ఐపీఎస్‌లు కానున్నారు. ఇందులో 38 మంది వరకూ సెంట్రల్ డిప్యుటేషన్‌పై పని చేసే అవకాశం కల్పించారు. 23 మంది వరకూ స్టేట్ డిప్యుటేషన్‌పై వచ్చేందుకు కేంద్రం అనుమతిచ్చింది.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఈసీ ప్రకటన

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన తాజా ఓటర్ల జాబితా రూపకల్పనకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబరు 1వ తేదీ నాటికి జాబితా రూపొందించేలా షెడ్యూల్ విడుదల చేయాలని నిర్ణయించినట్లు సీఈవో తెలిపారు. ఈ నెల 29న ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల రిజిస్ట్రేషన్‌కు ఈసీ నోటీసు విడుదల చేయనుంది. అదేవిధంగా శ్రీకాకుళం-విజయనగరం- విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గానికి, కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాల్లో పేర్ల నమోదుకు 2024 సెప్టెంబరు 30న ఎన్నికల సంఘం నోటీసు జారీ చేయనున్నట్లు స్పష్టం చేసింది.

ఢిల్లీలో మాధవరెడ్డి?

- వైసీపీ పెద్దల రక్షణలో ఫైళ్ల దహనం నిందితుడు!
- కేసులో పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడే కీలకం
- ఏపీకి తెచ్చేందుకు మొదలైన సీఐడీ వేట
- మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి రెండోరోజూ పోటెత్తిన పెద్దిరెడ్డి బాధితులు..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయ ఫైళ్ల కాల్చివేత సంఘటనలో ప్రధాన అనుమానితుడైన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి ఢిల్లీకి పారిపోయినట్టు సమాచారం. మాధవరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తే, కేసు ఒక కొలిక్కి వస్తుందని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఏపీ సీఐడీ పోలీసులు 'ఆపరేషన్ మాధవరెడ్డి' మొదలు పెట్టినట్లు తెలిసింది. ఢిల్లీలో మాధవరెడ్డి..వైసీపీలోని పెద్ద తలకాయల సంరక్షణలో ఉన్నట్లు తెలిసింది. దీంతో రాష్ట్రస్థాయిలో కీలకమైన అధికారుల పర్యవేక్షణలో మాధవరెడ్డి కోసం రహస్యంగా వేట కొనసాగుతున్నట్లు సమాచారం. గత ఆదివారం రాత్రి పదకొండు గంటల సమయంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం మంటల్లో చిక్కుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆర్డీవో మీడియాతో చెప్పారు. అయితే ఉదయానికంతా షార్ట్ సర్క్యూట్ కహానీలో అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్ ఆదివారం రాత్రి పదకొండు గంటల వరకు ఆఫీసులో ఉన్నాడని, అక్కడ వాచ్‌మెన్‌గా విధుల్లో ఉన్న వీఆర్ఏ రమణయ్య బయటపెట్టారు. దీంతో ఈ సంఘటనపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. సోమవారం ఉదయమే కలెక్టర్, ఎస్పీలు సంఘటనాస్థలానికి వచ్చి విచారణ ప్రారంభించారు. సాయంత్రానికి డీజీపీ, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ అక్కడకు చేరుకున్నారు. అదుపులో ఉన్న గౌతమ్‌తేజ్, రమణయ్యతో పాటు ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్‌ను విచారించారు. మరుసటి రోజు మంగళవారం మధ్యాహ్నం పోలీసులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్యఅనుచరుడైన మాధవరెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు. అతను అక్కడ లేడు. సుమారు రెండు బస్తాల డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే మాధవరెడ్డి మాత్రం పరారయ్యాడు. దీని వెనుక కొందరు స్థానిక పోలీసుల సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. సంఘటన జరిగిన తర్వాత గంటల వ్యవధిలోనే.. దీనివెనుక. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు, బినామీల ప్రమేయం ఉందని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. అయితే సుమారు ఒకటిన్నర రోజు వరకు మాధవరెడ్డి కోసం పోలీసులు ప్రయత్నించకపోవడంతో... అతను దర్జాగా మదనపల్లె దాటేశాడు. మాధవరెడ్డితో గత కొన్నేళ్లుగా అంటకాగిన కొందరు పోలీసులే...ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించారని చెబుతున్నారు.


మదనపల్లె సబ్‌కలెక్టరేట్ గేటు వద్ద బాధితులతో మాట్లాడుతున్న రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా

సిబ్బందికి నోటీసులు..

సంఘటన జరిగిన రోజునుంచీ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చెందిన సిబ్బందిని సెక్షన్ల వారీగా పోలీసులు విచారిస్తున్నారు. శుక్రవారం వారిలో ఘటనాస్థలంలో ఉన్నవారిని ఉంచుకుని, మిగతావారందరినీ పోలీసులు పంపించివేశారు. పిలిస్తే తిరిగి విచారణకు రావాల్సి ఉంటుందని వారికి నోటీసులు అందించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో అనుమాతుల విచారణ కొనసాగుతోంది. రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ స్పెషల్ సెక్రటరీ సిసోడియా శుక్రవారం ఉదయం విజయవాడకు బయలుదేరారు. సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ గురువారం రాత్రే విజయవాడ చేరుకున్నారు.

రెండో రోజూ భూబాధితుల వినతులు

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లోని రెవెన్యూ రికార్డులు దహనమైన నేపథ్యంలో రెండోరోజు కూడా రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా... ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. శుక్రవారం ఉదయం విజయవాడకు బయలుదేరిన సిసోడియాకు సబ్‌కలెక్టరేట్ గేటు వద్ద పెద్ద సంఖ్యలో బాధితులు వినతులు అందజేశారు. గురువారం, తొలిరోజు 400 మంది తమ సమస్యలపై ఆయనకు అర్జీలు అందజేశారు. ఇక, రెండోరోజు ఎక్కువగా భూకబ్జాలకు సంబంధించిన వినతులే అందటం గమనార్హం. దీనిపై సిసోడియా మీడియాతో మాట్లాడుతూ.. "ఫ్రీహోల్డ్ అయిన రెండు లక్షల ఎకరాల భూమిలో 4,500 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరిగింది. జబర్దస్తీగా స్వాధీనం చేసుకున్న వాటిపైనే చాలా ఫిర్యాదులు వచ్చాయి. కొన్నింటిపై కోర్టు కేసులు నడుస్తున్నాయి. సబ్‌కలెక్టరేట్‌లో దహనం అయిన ఫైళ్లన్నీ రీక్రియేట్ చేస్తాం. వాటి తాలూకు ఫైళ్లు ఆయా మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో ఒక కాపీ, కలెక్టరేట్‌లో ఇంకో కాపీ ఉంటాయి. కాబట్టి, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని తెలిపారు.

రూ.70కోట్ల భూమిని రూ.3 కోట్లకే లాక్కొన్నారు



"మా మామకు 20 ఏళ్ల ముందు ప్రభుత్వం మదనపల్లె బీకేపల్లె గ్రామం సర్వే నంబర్ 552లో 4.85 ఎకరాల మిలిటరీ పట్టా ఇచ్చింది. ఇప్పుడు మా మమ లేరు. నా భర్త, ఆయన అన్న కూడా చనిపోయారు. ఇప్పుడు ఆ భూమి పక్కనే బైపాస్ రోడ్డు పోతుండటంతో భూవి ు రేట్లు బాగా పెరిగాయి. దీంతో పెద్దిరెడ్డి కన్ను మా భూమి మీద పడింది. పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి మా దాయాదులను బెదిరించి రూ.70 కోట్ల భూమిని రూ.3 కోట్లకే కొన్నాడు. విక్రయానికి సంబంధించి నేనెలాంటి సంతకమూ చేయలేదు." - ఆకుల అన్నపూర్ణ, మదనపల్లె

టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- మున్సిపల్ కమిషనర్లతో సమీక్షలో మంత్రి నారాయణ

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసేలా చూడాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎనిమిది మున్సిపల్ కార్పొరేషన్‌లకు కొత్తగా నియమించిన కమిషనర్లతో మంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా కార్పొరేషన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, టిడ్కో ఇళ్లపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... 'నగరాల్లో పార్కులు, సెంట్రల్ డివైడర్లు, రోడ్ల గుంతలు పూడ్చడం, డ్రైన్లలో పూడిక తొలగింపుపై దృష్టి పెట్టాలి. రోడ్లపై సెంట్రల్ డివైడర్‌లలో ఎలాంటి ఫ్లెక్సీలు ఉన్నా వెంటనే తొలగించాలి' అని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ డైరెక్టర్ హరినారాయణ, టిడ్కో ఎండీ సాయికాంత్ వర్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు పాల్గొన్నారు.

నెల్లూరు విద్యార్థి మృతిపై విచారం

నెల్లూరులోని కేఎన్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి మృతిపై మంత్రి నారాయణ విచారణ వ్యక్తం చేశారు. పాఠశాల గోడకూలి 9వ తరగతి చదువుతున్న గురుమహేంద్ర మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. ఘటనపై విచారణకు నెల్లూరు జిల్లా డీఈఓకు ఆదేశాలిచ్చారు.

త్వరలో మహాశక్తి పథకం

- మంత్రి సంధ్యారాణి

రాష్ట్రంలో 18 సంవత్సరాలు దాటిన మహిళలకు ఆర్థిక సాయాన్ని అందజేసేందుకు మహాశక్తి అనే కొత్త పథకాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని అందుకు అవసరమైన మార్గదర్శకాలను త్వరలోనే జారీ చేస్తామని రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

కేసీఆర్‌తో జగన్ కుమ్మక్కు

- పోలవరం ఎత్తు తగ్గించారు: మంత్రి నిమ్మల

పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించాలని 2022 జనవరి 10న అప్పటి సీఎం జగన్ కేంద్రానికి లేఖ రాశారని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం కోసం కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించి ప్రాజెక్టు పూర్తి చేయకుండా వదిలేశారని ఆరోపించారు. అప్పటి కేసీఆర్‌తో జగన్ కుమ్మక్కై పోలవరం ఎత్తును 41.15 మీటర్లకే తగ్గించారని మంత్రి తెలిపారు.

'నిప్పు' వెనుక నిజమిదేనా?!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఏకంగా నాడు 2.19లక్షల ఎకరాలకు నిషేధ విముక్తి

- అందులో అసైన్డ్ 1.82 లక్షల ఎకరాలు
- చుక్కల భూములు 26,465 ఎకరాలు
- నిషేధ విముక్తిలో అన్నమయ్య జిల్లా టాప్
- 98,978 ఎకరాలను అక్కడ విడిపించారు
- అందులో సగం మదనపల్లె సబ్ డివిజన్‌లోనే..
- భారీగా భూములు భోంచేసిన పెద్దిరెడ్డి, అనుచరులు
- సిసోడియా విచారణలో రట్టు అవుతున్న గుట్టు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అన్నమయ్య జిల్లాలో అత్యంత కీలకమైన డివిజన్ మనదపల్లి. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని రికార్డులనే ఏరికోరి ఎందుకు తగలబెట్టారో స్పష్టత వస్తోంది. అన్నమయ్య జిల్లా మదనపల్లి డివిజన్‌లోనే గత ఏడాదికాలంలో 35వేల ఎకరాల అసైన్డ్ భూమిని నిషేధ జాబితా నుంచి తొలగించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాను విభజించి కొత్తగా అన్నమయ్య, తిరుపతి జిల్లాలను 2022లో ఏర్పాట చేసిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా పరిధిలో నిషేధ జాబితా నుంచి 2.19 లక్షల ఎకరాల భూములను బయటకుతీశారు. అందులో ఒక్క అన్నమయ్య జిల్లాలోనే 98,978 ఎకరాల భూమి ఉంది. ఇందులో 43వేల ఎకరాల భూమి ఇక్కడ మదనపల్లి డివిజన్‌లోనే ఉంది. నిప్పు రాజేయడం వెనక ఉన్న అసలు గుట్టు ఇదే! మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను తగలెబట్టిన తర్వాత సర్కారు అప్రమత్తమై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియాను అక్కడికి పంపించిన సంగతి తెలిసిందే. నాలుగురోజుల పాటు జిల్లాలోనే ఉన్న ఆయన భూముల వ్యవహారాలను నిశిత పరిశీలన చేశారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, సబ్‌కలెక్టర్‌లు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, జిల్లా, సబ్ రిజిస్ట్రార్‌లతో ఆయన వరుస సమీక్షలు చేశారు. కీలకమైన ఫైళ్లు తెప్పించుకొని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మూడు ప్రాంతాల్లో 22(ఏ) నుంచి తొలగించిన భూముల వివరాలను సేకరించారు. ప్రభుత్వ, ప్రభుత్వ ఆసక్తికలిగిన, దేవదాయ, అసైన్డ్, చుక్కల, షరతుగల పట్టా భూముల వివరాలను జిల్లా, డివిజన్‌ల వారీగా లెక్కతీశారు. ఈ సందర్భంగా గత ఏడాది కాలంలో 22(ఏ) నుంచి 2,19, 136.18 ఎకరాలను తొలగించినట్లు గుర్తించారు. నిజంగా ఇవి విస్మయంగొలిపే గణాంకాలు. ఇందులో అసైన్డ్ భూమినే 1,82,553.199 ఎకరాలున్నాయి. 26, 465.64 ఎకరాలు చుక్కల భూమి, ఇతర భూములు 8,899.915 ఎకరాలు, షరతుగల పట్టా భూములు 1217.44 ఎకరాలున్నాయి.

రాష్ట్రంలో ఇంత వేగంగా నిషేధ విముక్తి ఒక్క ఉమ్మడి చిత్తూరులో తప్ప మరెక్కడా జరగలేదు. ఇక్కడే ఎందుకు జరిగిందనుకుంటున్నారా?..ఇక్కడి భూములపై పెద్ద పుష్పల కన్ను ఉండటమే కారణమని గుర్తించారు. ఇందులో రిజిస్ట్రేషన్ అయిన భూములు 4,433.54 ఎకరాలు అని తేల్చారు. అయితే, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సరైన సమాచారం ఇవ్వని కారణంగానే రిజిస్టర్ అయిన భూముల సంఖ్య తక్కువగా నిర్ధారణ అయింది.

ఐదు నెలల్లో 1.82 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్

రాష్ట్రంలో అసైన్ చేసిన భూములకు 20 ఏళ్ల కాల పరిమితి దాటిన తర్వాత శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించేలా జగన్ సర్కారు గత ఏడాది అక్టోబరులో అసైన్డ్ భూముల చట్టం-1977(పీఓటీ) సవరణ చేసిన సంగతి తెలిసిందే. ఈచట్టం అమలు కోసం గత ఏడాది డిసెంబరు 19న జీఓ 596 జారీ చేశారు. ఈ జీవోను అడ్డంపెట్టుకొని వైసీపీ నేతలు, భూ కబ్జాదారులు, అక్రమార్కులు విచ్చలవిడిగా అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు అంటే ఎన్నికల షెడ్యూల్ వచ్చేనాటికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎవరూ ఊహించని రీతిలో 1,82,553.199 ఎకరాలను 22(ఏ) నుంచి తొలగించారు. ఇందులో చిత్తూరు జిల్లాలో 84,378 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 74,374.199 ఎకరాలు, తిరుపతి జిల్లాలో 23,801 ఎకరాలను 22(ఏ) నుంచి తొలగించారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఒక్క మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో 35 వేల ఎకరాల భూమికి నిషేధ జాబితా నుంచి విముక్తి కలిగించారు.

ఆ అధికారులపై చర్యలు

లక్షలాది ఎకరాల భూములను సరైన కారణాలు, హేతుబద్ధత లేకుండా నిషేధ జాబితా నుంచి తొలగించినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. మదనపల్లెలో నాలుగు రోజుల పర్యటన, విచారణ అంశాలపై రెవెన్యూశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి ఆర్‌పి. సిసోడియా త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. జీవో 596 మార్గదర్శకాలకు వ్యతిరేకంగా భూములను 22(ఏ) నుంచి తీశారని ఆయన నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో తహసిల్దార్ నుంచి ఆర్డీవో, డీఆర్వో, కలెక్టర్ల వరకు పాత్ర ఉందని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సిసోడియా సిఫారసు చేయనున్నారు. తొలుత రెవెన్యూ అధికారులు తహసీల్దార్, ఆర్‌డీవో, డీఆర్‌వోలపై క్రమశిక్షణా చర్యలకు ఆయన సిఫారసు చేయనున్నారు. గతంలో మదనపల్లి ఆర్‌డీవోగా పనిచేసిన మురళి, ప్రస్తుత ఆర్డీవో, తహసిల్దార్, రేణిగుంట, యేర్పేడు (విక్రుతమాల భూములు), పుంగనూరు (రాగనిపల్లె భూములు), తిరుపతి తదితర మండలాల అధికారులతోపాటు రిజిస్ట్రేషన్‌శాఖ అధికారుల పాత్రపై విచారణతోపాటు క్రమశిక్షణా చర్యలకు సిఫారసు చేయనున్నట్లు తెలిసింది.


సీఎం చంద్రబాబుతో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్ జనరల్ పాండియన్, ఇతర ప్రతినిధులు

ఎన్‌డీబీ ప్రతినిధులతో చంద్రబాబు సమావేశం

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): అమరావతి అభివృద్ధి కోసం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. ఎన్‌డీబీ డైరెక్టర్ జనరల్ డీజే పాండియన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి అమరావతి రాజధాని అభివృద్ధికి సంబంధించి పలు కీలకమైన అంశాల్లో చేయూతనందిస్తామని తెలిపారు. రాజధాని నిర్మాణానికి సంబంధించి మౌలిక వసతుల కల్పన, ముఖ్యంగా గ్రామీణ రోడ్ల కనెక్టివిటీ, మేజర్ ప్రాజెక్టులైన పోర్టులు, గ్రీన్ ఎనర్జీ తదితర వాటికి సహకారమందిస్తామని సీఎంకు తెలిపారు.

పోర్టులకు రూ.3,300 కోట్లతో ప్రతిపాదనలు

- ఏపీ ప్రత్యేక సాయం కోరింది.. లోక్‌సభలో కేంద్రం

విశాఖపట్నం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఏపీలో భావనపాడు, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల అభివృద్ధికి ప్రధాన మంత్రి గతిశక్తి కింద ఏపీ ప్రభుత్వం ప్రత్యేక సాయం కోరిందని, ఈ మేరకు రూ.3,300 కోట్లతో ప్రతిపాదనలు వచ్చాయని పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. కొత్త జెట్టీలు, హార్బర్ల నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదానికి పంపించామన్నారు. లోక్‌సభలో శుక్రవారం ఎంపీ కృష్ణప్రసాద్ ఏపీ పోర్టుల అభివృద్ధి గురించి ప్రశ్నించగా మంత్రి ఇలా స్పందించారు.

సీఎం సహాయ నిధితో ఆదుకోరూ..!

- టీడీపీ నేతలను వేడుకున్న అనారోగ్య బాధితులు

అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు సాయం చేయాలని పలువురు అనారోగ్య బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తిరుపతికి చెందిన నరసింహయాదవ్, పాయకాపురానికి చెందిన తాతినేని రవి తన కుమారుడు నాగసాయికి, విజయవాడకు చెందిన రాంబాబు, బ్రెయిన్‌స్ట్రోక్‌తో బాధపడుతున్న యలమంచిలికి చెందిన చెల్లూరి సత్యయ్యతో పాటు మరికొందరు సీఎంఆర్‌ఎఫ్ కింద తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2019లో టీడీపీ ప్రభుత్వం నియమించిన కల్యాణ మిత్రలను వైసీపీ ప్రభుత్వం తొలగించిందని, తమకు మళ్లీ అవకాశం ఇవ్వాలని 50మంది కల్యాణమిత్రలు కోరారు. హైకోర్టులో మాజీ హోంగార్డులను విధుల్లోకి తీసుకోవాలని కోర్టు తీర్పు చెప్పినా.. గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదని మాజీ హోంగార్డులు వాపోయారు. విశాఖలో డ్వాక్రా బజార్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని, నరేగా కింద పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించాలని, ఇంకా అనేక అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి కేశవ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. కాగా, అర్జీలు సుకున్న నేతలు స్పందించిన తీరుపై బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

వైసీపీ అవినీతిపై సీబీఐ విచారణ జరపాలి: గిడుగు

న్యూఢిల్లీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. లిక్కర్, మైనింగ్ కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. ఇక్కడి ఏపీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వ అవినీతిపై ఏపీసీఐడీకి బదులుగా సీబీఐతో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. మొన్నటివరకు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్‌కు వ్యవస్థలపై నమ్మకం ఉంటే అసెంబ్లీకి వెళ్లాలని హితవు పలికారు.

నేనింకా రెడ్ బుక్ తెరవ లేదు!

- అప్పుడే జగన్ ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెడుతున్నారు
- ఆయన అసెంబ్లీకి వస్తే వాస్తవాలు వివరిస్తాం: లోకేశ్

అమరావతి, జులై 26 (ఆంధ్రజ్యోతి): తాను ఇంకా రెడ్ బుక్ తెరవనేలేదని టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ అన్నారు. దాన్ని తెరవకముందే వైసీపీ నేత జగన్ ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో శుక్రవారం ఆయన మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు ముచ్చటించారు. 'నా దగ్గర రెడ్ బుక్ ఉందన్న విషయం రహస్యమేమీ కాదు. మేం చట్టాన్ని చేతుల్లోకి తీసుకోం. ఆయన అధికారంలో ఉన్న ఐదేళ్లలో రెండే సార్లు విలేకరుల సమావేశం పెట్టారు. ఎన్నికల్లో ఓడిపోయాక నెల రోజుల వ్యవధిలోనే ఐదుసార్లు ప్రెస్‌మీట్‌లు పెట్టారు. జగన్ తాను బయట చెబుతున్న అసత్యాలను అసెంబ్లీకి వచ్చి ప్రస్తావిస్తే వాస్తవాలు ఏమిటో మేం వివరంగా చెబుతాం.' అని అన్నారు. కాగా, మండలి ఉప సభాపతి, వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖనమ్ శుక్రవారం అసెంబ్లీ లాబీలో మంత్రి లోకేశ్‌ను కలిశారు. ఆమె త్వరలో టీడీపీలో చేరబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. నామినేటెడ్ పోస్టుల ఆశావహులతో అసెంబ్లీ లాబీలోని లోకేశ్ చాంబర్ శుక్రవారం కిటకిటలాడింది. ఆశావహులు భారీగా క్యూ కట్టడంతో అక్కడ రద్దీ నెలకొంది. లోకేశ్ తన కుటుంబంతో కలిసి శుక్రవారం జైపూర్ బయల్దేరి వెళ్లారు. ఇది ఆయన వ్యక్తిగతపర్యటన అని, ఆగస్టు 3న రాష్ట్రానికి తిరిగొస్తారని టీడీపీవర్గాలు తెలిపాయి.

విద్యా కానుక కొనసాగిస్తాం

- గత ప్రభుత్వంలో విద్యాకానుక నిధుల దుర్వినియోగం
- శాసన మండలిలో విద్యాశాఖ మంత్రి లోకేశ్



అమరావతి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాకానుక పథకాన్ని కొనసాగిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. అమరావతి సచివాలయంలోని శాసన మండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో విద్యా కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని, టెండర్లు పిలవకుండానే విద్యా కానుక కిట్ల పేరిట కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని అన్నారు. కిట్లు నాసిరకంగా ఉన్నాయని, వాటి కొనుగోళ్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యాకానుక కిట్ల పంపిణీని కొనసాగిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వం గతేడాది విద్యాకానుక టెండర్లకు ఆర్థిక అనుమతులు లేకుండానే టెండర్లను ఫైనల్ చేసిందన్న విషయం శుక్రవారమే బయటకు వచ్చిందన్నారు. పిల్లలకు పుస్తకాలు ఎక్కువ బరువు ఉన్నాయని, ఈ అంశంపై ఏం చేయాలనేది ఆలోచన చేస్తున్నామని అన్నారు. విద్యార్థుల బ్యాగులు, పుస్తకాల బరువును తానే స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. బైజూస్ కంటెంట్ అంశంపై కూడా సమీక్షిస్తామన్నారు. ఈ పథకం కింద విద్యార్థులకిచ్చే బూట్ల సైజుల్లో తేడాలు ఉంటే అదే పాఠశాలలోగానీ, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గానీ మార్చుకునే వెసులుబాటు కల్పిస్తామని, విద్యాకానుక కింద ఇచ్చే బ్యాగ్‌ల నాణ్యతపై కూడా ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు.

తల్లికి వందనంపై దుష్ప్రచారం

తల్లికి వందనం కార్యక్రమంపై స్పష్టత ఇచ్చినా కొందరు దుష్ప్రచారం చేయడం తగదని లోకేశ్ అన్నారు. ఈ కార్యక్రమం అమలు కోసం విధి విధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల్లో చెప్పినట్లుగానే సూపర్ సిక్స్ హామీలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. విద్యా కానుక కిట్లపై పార్టీల రంగులు ఉండకూడదన్నారు. ట్యాబ్‌ల పంపిణీపై ఫిర్యాదులు వచ్చిన దృష్ట్యా ఏం చేయాలనే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని దానికి కట్టుబడి ఉన్నామని లోకేశ్ చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం 2.3 లక్షల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని, సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు, స్వయం ఉపాధి ద్వారా 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చే ప్రక్రియను సీఎం ఇప్పటికే చేపట్టారని, రాష్ట్రానికి కావాల్సింది ఫ్యాన్సీ కంపెనీలు కాదని యువతకు ఉద్యోగాలిచ్చే కంపెనీలు రావాలని చెప్పామని అన్నారు. ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఢిల్లీలో చంద్రబాబుకు ఘన స్వాగతం

వన్‌టౌన్, జూలై 26: ప్రధాని మోదీ అధ్యక్షతన శనివారం నిర్వహించే నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారం రాత్రి ఢిల్లీ వెళ్లిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఘనస్వాగతం పలికారు. పోలవరం, కొత్త డయాఫ్రంవాల్ తదితరల అంశాలను సమావేశంలో చంద్రబాబు ప్రస్తావిస్తారని చిన్ని తెలిపారు.


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ కేశినేని చిన్ని

నిడమానూరు ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించండి

● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కేశినేని చిన్ని వినతి

వన్‌టౌన్: మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కోరారు. ఫ్లై ఓవర్ నిర్మాణంపై ఢిల్లీలో గడ్కరీని చిన్ని కలిశారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంబంధించిన వివరాలతో కూడిన మెమోరాండం అందజేశారు. ఈనెలాఖరు కల్లా డీపీఆర్ సమర్పించేలా జాతీయ రహదారుల సంస్థను ఆదేశించాలని కోరారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని చిన్నికి గడ్కరీ హామీ ఇచ్చారు.


కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

ఐ-టీడీపీ నేత సమస్యపై స్పందించిన లోకేశ్

గన్నవరం, జూలై 26: తన సోదరుడు కిషోర్ అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని మంత్రి నారా లోకేశ్ దృష్టికి ఐ-టీడీపీ నాయకుడు లావు వంశీ తీసుకెళ్లారు. శుక్రవారం జైపూర్ వెళ్లేందుకు గన్నవరం విమానాశ్రయానికి మంత్రి లోకేశ్ వచ్చినప్పుడు సమస్యను చెప్పారు. వెంటనే లోకేశ్ స్పందించి వ్యక్తిగత కార్యదర్శితో హాస్పిటల్‌కు ఫోన్ చేయించారు. కిషోర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. లోకేశ్‌కు వంశీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రత్యేక విమానంలో లోకేశ్ జైపూర్ వెళ్లారు.


లోకేశ్‌కు తన సోదరుడి ఆరోగ్య పరిస్థితిని వివరిస్తున్న లావు వంశీ

టీటీడీ నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయలు

భారతీనగర్, జూలై 26: రాజీవ్ గాంధీ హోల్‌సేల్ కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో టీటీడీ నిత్యాన్నదాన పథకానికి 10 టన్నుల కూరగాయలను వితరణగా ఇచ్చారు. కూరగాయల లారీని శుక్రవారం కరెన్సీనగర్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నిర్వాహకులు మరడ నాగేంద్రరావు(నాగు), అయ్యప్ప ట్రావెల్స్ అధినేత చిట్టిబాబు, మండవ శ్రీనివాస్, బి.దుర్గాప్రసాద్, ఆర్.సోమేశ్వరరావు, ఎం.నాగు, శీలంశెట్టి చిన్న, వర్రె అప్పారావు, ద్వారనాథ్, మేడిచర్ల వెంకట్రావు పాల్గొన్నారు.


జెండా ఊపి కూరగాయల లారీని సాగనంపుతున్న అచ్చెన్నాయుడు

న్యూ ఆర్ఆర్‌పేటలో స్థల వివాదం

అజిత్‌సింగ్‌నగర్, జూలై 26: న్యూ రాజరాజేశ్వరిపేట అపార్ట్‌మెంట్స్ వెనుక ఓ స్థలం వ్యవహారంలో మాజీ మేయర్ తాడి శంకుతలకు, ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగి సుబ్బన్నకు మధ్య శుక్రవారం వివాదం తలెత్తింది. స్థలంలో సుబ్బన్న ఫెన్సింగ్ వేస్తుండగా తాడి శంకుతల అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అపార్ట్‌మెంట్స్ వెనుక 252 గజాల ప్రైవేట్ స్థలం ఉంది. సుబ్బన్న ఆ స్థలంలో శుక్రవారం ఫెన్సింగ్ వేసేందుకు పనులు ప్రారంభించాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న తాడి శంకుతల స్థలం తనదని ఫెన్సింగ్ పనులను నిలుపుదల చేయాలని ఆయనతో వాగ్వివాదానికి దిగారు. స్థలం తన కష్టార్జితంతో కొన్నానని, స్థలంలో ఫెన్సింగ్ వేసుకుంటే తప్పేంటని సుబ్బన్న సమాధానమిచ్చాడు. ఇద్దరి మధ్య కొంత వాగ్వి వాదం జరగగా సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరుపుతున్నారు.


రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి సుబ్బన్న, తాడి శంకుతల మధ్య వాగ్వివాదం

పోరాటయోధుడు గోరా

పటమట, జూలై 26: "గోరా ఓ పోరాట యోధుడు. ఆయన జీవితమంతా పోరాటమే. అప్పుడు, ఇప్పుడు ఆయన భావజాలాన్ని అందరూ అంగీకరిస్తారు. అదే పాజిటివ్ ఎథీజం గొప్పతనం. పాజిటివ్ ఎథీజం అన్ని రంగాల్లోను సమానత్వానికి, సంఘం సుఖానికి, సామరస్యానికి చక్కని ఆచరణ మార్గం చూపింది." అని సామాజికవేత్త, రచయిత్రి డాక్టర్ చల్లపల్లి స్వరూపారాణి పేర్కొన్నారు. వర్తమాన కాలపరిస్థితుల్లో గోరా ప్రతిపాదించిన పాజిటివ్ ఎథీజంకు ఎంతో విలువ ఉందన్నారు. శుక్రవారం బెంజిసర్కిల్ వద్ద నాస్తిక కేంద్రంలో ఏర్పాటు చేసిన గోరా 49వ వర్ధంతి సదస్సులో గోరా ఒక సామాజిక విప్లవకారుడు అనే అంశంపై ఆమె మాట్లాడారు. కులోన్మాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మనుషుల మధ్య విభేదాలు సృష్టించి పబ్బంగడుపుకొనే అభ్యుదయ వ్యతిరేకశక్తులు సమాజంలో విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు తమను ఎన్నుకున్న ప్రజలకు సేవకులమని మర్చిపోయి పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. డాక్టర్ సమరం అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో చెన్నుపాటి వజీర్, సకల, ట్రాఫిక్ ఏసీపీ జనార్దన్, డాక్టర్ మారు, నియంత, రశ్మీలు పాల్గొన్నారు.


గోరా వర్ధంతి సదస్సులో మాట్లాడుతున్న సామాజికవేత్త, రచయిత్రి చల్లపల్లి స్వరూపారాణి

ఖమ్మంలో బెజవాడ లారీ డ్రైవర్ మృతి

చుంచుపల్లి, జూలై 26: విజయవాడ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ జేమ్స్(60) గుండెపోటుతో నిద్రలోనే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. మండలంలోని పెనగడప ప్రాంతంలో ఉదయం వాకింగ్ చేశాక ఏపీ16టీఎస్3338 నెంబర్ 14 టైర్ల లారీ ఎక్కి జేమ్సు నిద్రపోయాడని స్థానికులు తెలిపారు. తర్వాత చూస్తే విగత జీవిగా లారీలోనే పడుకుని ఉండడం, ముక్కు నుంచి రక్తం రావడాన్ని గుర్తించి కొత్తగూడెం టూటౌన్ పోలీసు లకు సమాచారమిచ్చారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గుండెపోటుతో లారీలోనే మృతి చెందిన డ్రైవర్ జేమ్స్


మహంకాళి అమ్మవారు

మహంకాళి బోనాల జాతరకు దుర్గగుడి ఆషాఢ సారె

వన్‌టౌన్, జూలై 26: హైదరాబాద్‌లో మహంకాళి జాతర సందర్భంగా ఉమ్మడి ఆలయాల్లో అమ్మవార్లకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున కొందరు అధికారులు, అర్చకులు శుక్రవారం ఆషాఢ సారె, పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక అర్చనల అనంతరం అక్కడి ఆలయాల ఆచారాల మేరకు అధికారులు అర్చకులను సత్కరించారు. మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల కమిటీ చైర్మన్ ఆహ్వానం మేరకు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున సారె సమర్పించారు. ఈఈ లింగం రమాదేవి, ఏఈవో రమేష్ బాబు, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు. ఉప్పుగూడలోని మహంకాళీ దేవాలయం, లాల్ దర్వాజాలోని సింహవాహిని మహంకాళి దేవాలయం, గౌలిపురలోని మహంకాళి దేవాలయం, సుల్తాన్ సాహిలోని జగదాంబ దేవాలయం, హరిబౌలిలోని బేల ముత్యాలమ్మ దేవాలయం, బంగారు మైసమ్మ దేవాలయం, అక్కన్న మాదన్న దేవాలయం, మీరాల మండిలోని మహంకాళేశ్వర ఆలయాల్లో సారె సమర్పించారు.


అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ఆషాఢ సారె తీసుకెళుతున్న దుర్గగుడి బృందం

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

పోరాటానికి టీడీపీ ముందుకు రావాలి: సీపీఎం

గవర్నర్‌పేట, జూలై 26: కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఎం ఆరోపించింది. అన్యాయంపై పోరాడేందుకు టీడీపీ ముందుకు రావాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు శుక్రవారం లెనిన్‌సెంటర్‌లో నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. "రాజధాని అమరావతి నిర్మాణానికి అప్పుగా కాకుండా రూ.15వేల కోట్లు గ్రాంట్‌గా ఇవ్వాలి. విభజన హామీల అమలుకు నిధులు కేటాయించాలి. ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలి. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని మోసం చేసిన బీజేపీ డౌన్, డౌన్" అంటూ సీపీఎం నాయకులు నినాదాలు చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై అన్ని పార్టీలు ఏకమై పోరాడాలని, అందుకు సీపీఎం సిద్ధమని నాయకులు స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించలేదని, సామాన్యులపై భారాలు వేసి, కార్పొరేట్లకు వరాలు ప్రకటించారని దుయ్యబట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు దోనేపూడి కాశీనాథ్, నేతలు కె.దుర్గారావు, టి.ప్రవీణ్, పి.కృష్ణ, మురహరి, పి.చంద్రశేఖర్, వి.గురుమూర్తి, కె.రమణ, వై.సుబ్బారావు, బోయి సత్తిబాబు ప్రసంగించారు.



లెనిన్‌సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


మాట్లాడుతున్న ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ పోలవరపు ఫణిధర్

వైద్యుల రక్షణకు చట్టం తేవాలి

గవర్నర్‌పేట, జూలై 26: వైద్యులు, ఆస్పత్రులపై దాడుల నుంచి రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) డిమాండ్ చేసింది. శుక్రవారం ఏలూరు రోడ్డులోని ఐఎంఏ హాలులో మీడియా సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, జనరల్ సెక్రటరీ డాక్టర్ పోలవరపు ఫణిధర్ మాట్లాడారు. వైద్యులు వృత్తి ధర్మాన్ని నిర్వర్తించడంలో అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య వృత్తిని నేరాల పరిధి నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులపై దాడుల నిరోధానికి కేంద్రం చట్టం చేసేలా పార్లమెంటు సభ్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. వైద్య చికిత్స సమయంలో మరణాలు హత్యల కిందకు రావని, వైద్యంలో నిర్లక్ష్యం అనేది నేరం కాదని వారు పేర్కొన్నారు. న్యాయం కోసం వైద్యుల ప్రచార ఉద్యమాన్ని ఐఎంఏ చేపట్టిందన్నారు. ఐఎంఏ నేతలు డాక్టర్ ఎంఏ రహమాన్, డాక్టర్ ఎస్.దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

పాయకాపురం, జూలై 26: ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విభాగంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఎన్టీఆర్ వైద్యసేవా ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ గోవింద్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవా పథకాన్ని బీమా సంస్థలకు అప్పగించే యోచనలో ఉందని ఆయన పేర్కొన్నారు. వైద్యసేవా పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, డిస్ట్రిక్ట్ మేనేజర్లు, ఓఏల 17 ఏళ్ల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ట్రస్ట్ పరిధిలో విలీనంచేసి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు.

ప్రైవేట్ బస్సుల దోపిడీని అరికట్టాలి

● మంత్రి రాంప్రసాద్ రెడ్డికి సీపీఐ నేత ఈశ్వరయ్య వినతి

బస్సుస్టేషన్, జూలై 26: రాష్ట్రంలో ప్రైవేట్ బస్సుల దోపిడీని అరికట్టాలని రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య కోరారు. విజయవాడలోని మంత్రి నివాసంలో శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. విమానచార్జీలకు దీటుగా ప్రైవేట్‌బస్సులు చార్జీలు వసూలు చేస్తున్నాయని, రవాణాశాఖ అనుమతులు లేనప్పటికీ పలు సర్వీసులు నడుస్తున్నాయని మంత్రి దృష్టికి ఈశ్వరయ్య తెచ్చారు. విజయవాడ నుంచి కడపకు రూ.1900 చార్జీ వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్‌లో ఏ బస్సు ఎక్కినా రూ.1000కి పైనే చార్జీలు ఉంటున్నాయని, వారాంతాలు, సంక్రాంతి వంటి పండుగ రోజుల్లో ట్రావెల్స్ దోపిడీకి అంతే ఉండదన్నారు. గతంలో ఆర్టీఏ అధికారులు దాడులు చేసేవారని, ఇప్పుడు వారి పేరుపైనే ఉచిత టికెట్లు రిజర్వ్ అవుతున్నాయని మంత్రికి తెలిపారు. నెలవారీ మామూళ్లు కూడా యాజమాన్యాలు ముట్టచెబుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయని వివరించారు.


రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్యాకర్స్, మూవర్స్ సంఘం ప్రతినిధులు

ప్యాకర్స్, మూవర్స్ సమస్యలు పరిష్కరించండి

బస్సుస్టేషన్: రాష్ట్రంలో ప్యాకర్స్, మూవర్స్ సమస్యలను పరిష్కరించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ప్యాకర్స్ మూవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. విజయవాడ, గుంటూరు ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీకే ప్రసాద్, సభ్యులు కోరారు. కృష్ణాజిల్లా లారీ యజమానుల సంఘం ట్రక్కర్స్ ప్రాజెక్ట్ మేనేజర్ వీవీ సాంబశివరావు, కోటేశ్వరరావు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. మంత్రిని వారు సత్కరించారు.

మర్యాదపూర్వకంగా..

కేంద్రమంత్రి అజయ్‌తాత్మను కలిసిన న్యాయాధికారి నరసింహారావు

విజయవాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర జాతీయ రహదారుల, రవాణా శాఖ సహాయ మంత్రి అజయ్ తాత్మను విజయవాడ మొదటి, స్పెషల్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి దేవు నరసింహారావు ఢిల్లీలో శుక్రవారం కలిశారు. కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను శాలువాతో సత్కరించారు. తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఉండవల్లి కృష్ణారావు, కోఆర్డినేటర్ పి.అనుప్రసాద్ తదితరులు ఉన్నారు.


అజయ్‌తాత్మను సత్కరిస్తున్న నరసింహారావు


స్పీకర్ అయ్యన్నపాత్రుడికి పూలే చిత్రపటాన్ని అందిస్తున్న బీసీ సంఘం నేతలు

టీడీపీ ప్రజాప్రతినిధులను కలిసిన బీసీ సంఘ నేతలు

విజయవాడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రజా ప్రతినిధు లను 93 బీసీ కులాల ఐక్యవేదిక, వెలమ సంఘ నేతలు శుక్ర వారం కలి శారు. స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావును కలిశారు. వారికి జ్యోతిరావుపూలే చిత్రపటాన్ని అందజేసి, సత్కరించారు. అనంతరం కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 93 బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణే ష్‌బాబు, వెలమాంధ్ర ఫౌండేషన్ చైర్మన్ ఎంవీఆర్ మూర్తి, విజయవాడ వెలమ సంఘ నాయకుడు మూకల గణేష్‌నాయుడు, హైదరాబాద్ బీసీ సంఘం నేతలు గేదెల శ్రీనివాసరావు, లింగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హరిచరణ్‌ను కలిసిన వెలగా జోషి

విజయవాడ కల్చరల్, జూలై 26: వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరికిరణ్ ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూని వర్సిటీ ఓఎస్‌డీ డాక్టర్ వెలగా జోషి, జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర సచివాలయంలో మర్యాద పూర్వ కంగా కలిశారు. హరికిరణ్‌కు ప్రపంచ మేధావుల చిత్రపటాన్ని అందించి సత్కరించారు.


హరికిరణ్‌ను సత్కరిస్తున్న వెలగా జోషి, శ్రీనివాసరెడ్డి

విశ్వవేదం మహాగ్రంథం పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, జూలై 26: సమాజంలో మతసామరస్యం పెరగడానికి విశ్వవేదం మహాగ్రంథం పుస్తకం దోహదపడుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రచయిత, పరిశోధకుడు తాడికొండ శివాజీ రచించిన విశ్వవేద మహాగ్రంథం పుస్తకావిష్కరణ కార్యక్రమం గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బుద్ధప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. తాడికొండ శివాజీ 50 సంవత్సరాల పరిశోధన ఫలితమే ఈ గ్రంథమని పేర్కొన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు గ్రంథ సమీక్ష చేశారు. తన రచన అవాస్తవం అని నిరూపించగలిగిన వారికి రూ.లక్ష బహుమతి ఇస్తానని సభా వేదికపై రచయిత తాడికొండ శివాజీ ప్రకటించారు. కామ్రేడ్ జీ ఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, మాజీ ఐపీఎస్ అధికారి ఎం.రవీంద్రనాథ్, ఏపీ విప్, ఓఎస్‌డీ, డాక్టర్ ఎం.ప్రభాకరరావు, రూపస్ కొలికపూడి, మహ్మద్ యూసుఫ్, బొంతపురి రవిప్రకాష్, అన్నవరపు బ్రహ్మయ్య, మల్క్యాపురం కనకారావు, ఎంవీఎస్ నాగరాజు, జి.ఉమామహేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

దుర్గగుడిలో అన్నవితరణకు రూ.లక్ష విరాళం

వన్‌టౌన్, జూలై 26: దుర్గగుడిలో అన్న వితరణకు విజయవాడ కృష్ణలంక గుంటూరు వారి వీధికి చెందిన కోట వేణుగోపాల్, ఆయన కుటుంబ సభ్యులు శుక్ర వారం రూ.1,00,116 చెక్కును విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ప్రసాదం శేష వస్త్రం ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందించారు.

రేపు త్వైకాండో చాంపియన్‌షిప్

భవానీపురం, జూలై 26: నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాలలో ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎం.అంకమ్మరావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11, సబ్ జూనియర్, క్యాడెట్-17 జూనియర్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు అర్హత పత్రాలతో పోటీల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

రికార్డు రూం ప్రారంభం

విజయవాడ లీగల్, జూలై 26: సిటీ సివిల్ కోర్టుల సమీపంలోని జిల్లా వినియోగదారుల ఫోరం-2లో రికార్డు రూంను శుక్రవారం రాష్ట్ర వినియోగదారుల ఫోరం పరిష్కృత చైర్మన్ దొమ్మేటి శ్రీనివాస్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం రిజిస్ట్రార్ ఎస్.శ్రీనివాస్ ప్రారంభించారు. బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, చేకూరి శ్రీపతిలు రాష్ట్ర ఫోరం చైర్మన్ దొమ్మేటి శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా సత్క రించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల ఫోరం -2 చైర్మన్ నేలపూడి చిరంజీవి, సభ్యులు ఏవీ రమణ, శశి కళ, న్యాయవాది నరహరిశెట్టి శ్రీహరి పాల్గొ న్నారు.

హజరత్తయ్య గుప్తాకు అల్లూరి అవార్డు

విజయవాడ కల్చరల్, జూలై 26: ఏపీ అమరా వతి సాంస్కృతిక క్రీడా సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం గాంధీనగర్‌లోని కౌతా కళా వేదికపై నిర్వహించారు. ఝుమ్మంది నాదం పేరిట నిర్వ హించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరిం చింది. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తాకు అల్లూరి సీతారామరాజు జయంతి అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శేషగిరి, సతీష్, జ్యోతిష్యులు లక్ష్మీ శ్రీని వాసరెడ్డి, వెంకన్న పైడిపాటి, కువైట్‌కు చెందిన మురళి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


హజరత్తయ్య గుప్తాకు అల్లూరి సీతారామరాజు జయంతి అవార్డు అందజేస్తున్న శేషగిరి, సతీష్

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

● సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

ధర్నాచౌక్, జూలై 26: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతర పోరాటం చేస్తోందని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తెలిపారు. దాసరిభవన్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ బాధితుల సమస్య పరిష్కరించాలని, కొండపల్లి పారిశ్రామిక ప్రాంతంలో పారిశ్రామిక కాలుష్యం నుంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతూ ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర ఆగస్టు 21, 22, 23 తేదీల్లో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎ.కొండూరు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎ.కొండూరు, గంపలగూడెం ప్రాంతాలు మరో ఉద్దానంలా తయారయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. జగ్గయ్యపేటలో సిమెంట్ ఫ్యాక్టరీల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలకు అధికారుల పర్యవేక్షణ లోపం, పారిశ్రామిక చట్టాలను అమలు చేయకపోవడమే కారణమన్నారు. ఈనెల 27న క్వారీల పరిశీలన, 30న ఇబ్రహీంపట్నంలో రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ నాయకులు బుట్టి రాయప్ప, కొట్టు రమణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ నేత కార్తీక్ పాల్గొన్నారు.


మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న తమిళ సెటిలర్లు

బీసీ హోదా కల్పించండి

ధర్నాచౌక్, జూలై 26: తమిళనాడు నుంచి 70 ఏళ్ల క్రితం వచ్చి రాష్ట్రంలోని చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, గుంటూరు ప్రాంతాల్లో స్థిరపడిన 8 లక్షల మంది పిరమలై కలర్ తమిళ సెటిలర్లకు బీసీ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని తమిళ సెటిలర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ తేవర్ కోరారు. ఈ మేరకు సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రులు సవిత, సంధ్యారాణి, నిమ్మల రామానాయుడును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమిళనాడులో తాము బీసీలుగా ఉన్నామని, రాష్ట్రంలోనూ బీసీ హక్కు కల్పించాలని ఆయన కోరారు. ఉపాధ్యక్షుడు సుప్పదేవర కృష్ణ, ప్రధానకార్యదర్శి నటరాజ్ వెంకటేష్ పాల్గొన్నారు.

తపాలా శాఖ అంతర్జాతీయ సేవలపై అవగాహన

రాణిగారితోట, జూలై 26: తపాల శాఖ డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రాల ద్వారా నగదు చెల్లించి ప్రజలు తక్కువ సమయంలో విదేశాలకు తమ పార్శిళ్లను సురక్షితంగా పంపొచ్చని పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ జగదీష్ పై తెలిపారు. చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణలంకలోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ కార్యాలయంలో ఎగుమతిదారుల అవగాహన సమావేశం నిర్వహించారు. పోస్టల్ శాఖ అందిస్తున్న అంతర్జాతీయ సేవలను జగదీష్‌పై వివరించారు. ఎగుమతి విధానాలు, వాణిజ్య సౌలభ్యంపై మెరుగైన అవగాహన తపాలశాఖ కల్పిస్తుందని, అంతర్జాతీయ వాణిజ్యం కోసం పోస్టల్ నెట్వర్క్ మాధ్యమం ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. సీ అండ్ ఈపీ జాయింట్ డైరెక్టర్ జీఎస్ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్‌బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ జి.రఘునాథబాబు, ఎస్ఎస్‌పీవోలు గజేంద్రకుమార్ మీనా, ఎం.నరసింహస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ జగదీష్ పై

ఆర్టీసీ ఉద్యోగులకు పరిమితిలేని వైద్య సేవలందించాలి

బస్సుస్టేషన్, జూలై 26: ఆర్టీసీ ఉద్యోగులకు పరిమితిలేని వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబును ప్రజారవాణా సంస్థ ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం కృష్ణబాబును ఆయన చాంబర్‌లో శ్రీనివాసరావు కలిశారు. రేయింబవళ్లు విధులు నిర్వహించే ఆర్టీసీ ఉద్యోగులు అనారోగ్యాల బారిన పడితే సొంత డబ్బులు ఖర్చు చేసి వైద్యం చేయించుకోలేక పోతున్నారన్నారు. దీంతో కొందరు ఉద్యోగులు మృతి చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.


ఎంటీ కృష్ణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు



అగ్నిగుండంపై నమాజ్ చేస్తున్న దృశ్యం

నిప్పుల గుండంపై నమాజ్

అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలో చిన్నపీర్ల పండుగలో భాగంగా నిప్పుల గుండంపై శుక్రవారం నమాజ్ నిర్వహించారు. స్థానిక 10వ వార్డులోని హుసేన్, హసేన్ పీర్లను అలంకరించి, చావిడిలో కొలువుదీర్చారు. శుక్రవారం తెల్లవారుజామున పీర్ల అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ముజావర్ షఫీవుల్లా అగ్నిగుండంలో కూర్చుని 25 సెకన్లపాటు నమాజ్ చేశారు. కొన్నేళ్లుగా ఈ ఆచారం కొనసాగుతోందని స్థానికులు తెలిపారు. - ఉరవకొండ

భక్తులకు పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యం

తిరుమలలో ఆహార భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక శిక్షణ: టీటీడీ ఈవో

తిరుమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడమే టీటీడీ లక్ష్యమని ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి అన్నప్రసాద సిబ్బందికి, తిరుమలలోని పెద్ద హోటళ్లు, జనతా క్యాంటీన్ల నిర్వాహకులకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే ప్రతి హోటల్‌లో ప్రమాణాలను మెరుగుపరుచుకునేందుకు ఆగస్టు 5వ తేదీ వరకు సమయం ఇస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో ఫుడ్ సేఫ్టీ విభాగం డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై శుక్రవారం పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు.

లోకేశ్ చొరవతో ఎడారి చెర వీడింది

స్వదేశానికి మరో ప్రవాసాంధ్రుడు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



ఖతర్ నుంచి భారత్‌కు వచ్చే ముందు ఎయిర్‌పోర్టులో వీరేంద్రకుమార్ (రెడ్ టీ షర్ట్)

ఖతర్‌లోని ఒక అరబ్బు ఇంట్లో పనిచేయడానికి వచ్చి మోసపోయి సౌదీ అరేబియాలోని సువిశాల ఎడారిలో ఒంటెల కాపరిగా మారిన ఓ ప్రవాసాంధ్రుడు మంత్రి నారా లోకేశ్ చొరవ, అరబ్బు తెగ ల ప్రయత్నంతో ఎట్టకేలకు శుక్రవారం స్వదేశానికి చేరుకున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన సారెళ్ల వీరేంద్రకుమార్ కొన్నాళ్ల క్రితం ఒక సంపన్న అరబ్బు కుటుంబానికి చెందిన ఫాంహౌస్‌లో వంటమనిషిగా పనిచేయడానికి ఖతర్ వచ్చాడు. అయితే ఆ యజమాని అతన్ని పొరుగున ఉన్న సౌదీ అరేబియాలోని ఎడారికి తీసుకొచ్చి ఒంటెల క్షేత్రంలో పని అప్పగించాడు. ఎడారిలో, మండుటెండలో ఒంటెల కాపరిగా జీవనం సాగించడం వీరేంద్రకుమార్‌కు కష్టమైంది. దీంతో ఎడారిలో ఒంటెల మధ్యన తాను ఎదుర్కొంటున్న కష్టాలను వీరేంద్రకుమార్ సెల్ఫీ వీడియో ద్వారా వివరిస్తూ తనను స్వదేశానికి రప్పించాలని వేడుకున్నాడు. ఈ విషయం మంత్రి నారా లోకేశ్ దృష్టికి రావడంతో ఆయన వీరేంద్రకుమార్‌కు సా యం చేయాలని తెలుగుదేశం గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధకృష్ణకు సూచించారు. తెలుగుదేశం ఎన్నారై విభాగం అధ్యక్షుడు వేమూరి రవి ఈ విషయమై ఇటు పార్టీ వర్గాలు అ టు అధికార వర్గాలతోనూ చర్చించారు. ఉపాధి ఒప్పందంపై వచ్చిన వీరేంద్రకుమార్‌కు గడువుకు ముందే వీసా రద్దు అంశం, సౌదీ అరేబియా, ఖతర్ దేశాల మధ్య ఉన్న వీసా నియమాలు అవరోధంగా మారాయి. దీంతో రాధాకృష్ణ సౌదీ అరేబియాలోని నారియా అనే ఎడారి అరబ్బు తెగల ప్రముఖుల సహాయం కోరగా, వారు ఖతర్‌లోని అదే తెగ వారితో సంప్రదించి వీరేంద్రకుమార్‌ను వెనక్కి పంపించాలని కోరారు. దీనికి వారు అంగీకరించడంతో వీరేంద్రకుమార్ భారత్‌కు తిరిగిరావడానికి మార్గం సుగమమైంది. సౌదీ అరేబియాలోని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా.. ఖతర్ సరిహద్దులోని నారియా ఎడారి నుంచి వీరేంద్రకుమార్‌ను తీసుకురావడంతో పాటు హైదరాబాద్ వరకు విమానం టికెట్‌ను సమకూర్చారు.

జగన్ ఢిల్లీకి ఎందుకెళ్లాడో ఆయనకే తెలియదు: డొక్కా

గుంటూరు, జూలై 26: 'ఎన్నికల్లో ఓటమి తరువాత మాజీ సీఎం జగన్ మానసిక స్థితిపై ప్రజలకు అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ఢిల్లీలో ధర్నాకు ఆయన ఎందుకు వెళ్లాడో ఆయనకే తెలియదు' అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. గుంటూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మాజీ సీఎం జగన్ ఢిల్లీ పర్యటన సింగడు అద్దంకి పోనూ పోయాడు.. రానూ వచ్చాడు అన్న చందంగా ఉంది. ఢిల్లీలో ధర్నాతో ఆయనకు ఒరిగింది ఏమిటో అర్థం కావటం లేదు. కొందరు పనికిమాలిన సలహాదారుల మాటలు విని ఆయన ఢిల్లీలో ధర్నా చేసి రాష్ట్రాభివృద్ధిని, రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు రాకుండా అడ్డుకునేలా ఉన్నారు.' అని డొక్కా అన్నారు.

రౌడీషీటర్ హత్యపై ఢిల్లీలో నాటకాలు

జగన్ హయాంలో అరాచకాలకు అంతే లేదు

దీనిపై అఖిలేశ్, ఇతర నేతలకు లేఖలు రాస్తా: హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 26: ఒక రౌడీషీటర్ హత్య జరిగితే దేశ రాజధాని ఢిల్లీలో జగన్ నాటకాలాడటం సిగ్గుచేటని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక రౌడీషీటర్ హత్య జరిగితే ఆంధ్రప్రదేశ్‌లో ఏదో జరిగిపోయిందన్నట్టుగా జగన్ ఢిల్లీలో ఒక నటుడిలా యాక్ట్ చేశాడని విమర్శించారు. అదే ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన అరాచకాలు, అఘాయిత్యాలకు లెక్కేలేదన్నారు. పక్కి. శ్రీను మొదలుకొని డాక్టర్ సుధాకర్, పేరిచర్ల కిరణ్‌కుమార్, వీధి సుబ్రహ్మణ్యం వరకు జరిగిన హత్యలపై ఏనాడైన జగన్ స్పందించాడా అని ప్రశ్నించారు. కనీసం బాధితులకు యాక్ట్ ప్రకారం చెల్లించాల్సిన నష్టపరిహారం కూడా ఇవ్వలేదన్నారు. శిరోముండనం కేసులో వరప్రసాద్‌కు కూడా న్యాయం చేయలేదన్నారు. ఆయా కేసుల్లో ఇప్పటికే నిందితులపై చర్యలు లేవని తెలిపారు. జగన్ హయాంలో జరిగిన అప్రజాస్వామిక పాలన గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదన్నారు. పైగా ఇప్పుడు నిస్సిగ్గుగా ఢిల్లీ వెళ్లి ప్రదర్శన చేశాడని దుయ్యబట్టారు. అతడిని కలిసిన అఖిలేశ్ యాదవ్ మొదలుకొని అందరికీ తాను వ్యక్తిగతంగా లేఖలు రాస్తానన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో ఎన్ని దారుణాలు జరిగాయో వారికి తెలియజేస్తానన్నారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు విషయంలో చాలా లోపాలు ఉన్నాయని, జ్యుడిషియల్ కమిటీ వేశాక మాత్రమే కేంద్రం నిధులు కేటాయించాలని కోరుతున్నామన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రులపై అసభ్యకర పోస్టులు

వైసీపీ నేత, రేషన్ డీలర్స్ రాష్ట్ర అధ్యక్షుడిపై కేసు

విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్), జూలై 26 : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లతో పాటు హోంమంత్రి వంగలపూడి అనితపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్న వైసీపీ నేత, రాష్ట్ర రేషన్ డీలర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు మండాది వెంకట్రావుపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కొంత కాలంగా మండాది వెంకట్రావు ఫేస్‌బుక్‌తో పాటుగా ఇతర సోషల్ మీడియాలో మంత్రులపై అసభ్యకరంగా పోస్టులతోపాటు, తీవ్ర అభ్యంతరకరమైన కామెంట్లను పెడుతున్నాడు. దీనిపై సెంట్రల్ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, తేళ్ల భవానీ తదితరులు అజిత్‌సింగ్‌నగర్ సీఐ గురుప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు.

రేషన్ మాఫియాతోనూ సంబంధాలు

మండాది వెంకట్రావు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. నగరం నుంచి వివిధ రేషన్ డిపోల నుంచి బియ్యాన్ని అక్రమంగా కాకినాడ పోర్టుకు తరలించిన రేషన్ మాఫియాతో కూడా సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరంలో బినామీల పేరుతో రెండు నుంచి మూడు రేషన్ డిపోలను నడుపుతూ ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గం ద్వారా అమ్మకాలు జరిపినట్టు తెలుగు మహిళలు ఆరోపించారు.

బాలికపై లైంగిక దాడి

కుక్కునూరు/జంగారెడ్డిగూడెం, జూలై 26: ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో ఏడేళ్ల బాలికపై సమీప బంధువు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుక్కునూరు ఎస్సై రామకృష్ణ కథనం మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధితురాలికి సమీప బంధువైన మడకం వెంకటేశ్వరరావు గురువారం సాయంత్రం పునుగులు కొనిస్తానంటూ తీసుకువెళ్లాడు. సమీప గోడౌన్ దగ్గర లైంగిక దాడికి పాల్పడి ఇంటి దగ్గర వదిలి వెళ్లిపోయాడు. బాలిక ఏడుస్తూ తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బాలికను వైద్యపరీక్షల నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సుందర్ పిచాయ్‌కు ఐఐటీ ఖరగ్‌పూర్ డాక్టరేట్



న్యూఢిల్లీ, జూలై 26: గూగుల్, ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. భారత్‌లోని ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఒకటైన ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ వీకే తివారీ చేతుల మీదుగా ఆయన 'హానరరీ డాక్టర్ ఆఫ్ సైన్స్' పట్టాను అందుకున్నారు. కాగా, కెమికల్ ఇంజనీరింగ్‌లో సాధించిన విజయాలకు గానూ సుందర్ పిచాయ్ సతీమణి అంజలి పిచాయ్ కూడా విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డు అందుకున్నారు. ఈ విషయాన్ని సుందర్ పిచాయ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. 'నేను ఈ స్థాయికి చేరుకోవడానికి సహకరించిన నా పూర్వ సంస్థ ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఈ గౌరవ డాక్టరేట్ అందుకోవడం ఆనందంగా ఉంది' అన్నారు.

2034 నాటికి ఉద్యోగాల తీరే మారిపోతుంది!

సంప్రదాయ పనివేళలు ఉండవు

లింక్‌డిన్ సహ వ్యవస్థాపకుడు హాఫ్‌మన్



వాషింగ్టన్, జూలై 26: మరో పదేళ్లలో.. 2034 నాటికి సంప్రదాయ పని వేళలు(ఉదయం 9-5 తరహా) ఉండవని.. ఉద్యోగాలు, పనివేళలు పూర్తిగా మారిపోతాయని ప్రఖ్యాత ఆన్‌లైన్ సేవల సంస్థ లింక్‌డిన్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హాఫ్‌మన్ అంచనా వేశారు. కృత్రిమ మేధో(ఏఐ) రంగంలో చోటు చేసుకునే మార్పులతో గిగ్ ఎకానమీ అనూహ్యంగా విస్తరిస్తుందని పేర్కొన్నారు. వ్యక్తులు డిమాండ్‌కు అనుగుణంగా అప్పటికప్పుడు సేవలు అందించి డబ్బులు సంపాదించుకోవటం, శాశ్వత ఉద్యోగాలనే భావన మటుమాయం కావటం గిగ్ ఎకానమీ లక్షణాలు. ఈ తరహా ఆర్థిక వ్యవస్థ విస్తరించి, వ్యక్తులు ఒకే రంగానికి పరిమితం కాకుండా వేర్వేరు రంగాలలో తమకు నచ్చిన పనులు(ఉద్యోగాలు) చేస్తుంటారని, కాబట్టి, ఆఫీసుకు వెళ్లటం క్రమంగా అంతరించిపోతుందన్నారు.

మన నేతన్నల పొట్టగొట్టి!

కమీషన్ల కక్కుర్తితో పొరుగు రాష్ట్రాలకు దుప్పట్ల ఆర్డర్లు.. జగన్ సర్కారు ఒప్పందం.. బాబు ప్రభుత్వంలో అమలు

గిరిజన సంక్షేమశాఖ తీరుపై నేతన్నల మండిపాటు

ఆర్డర్ రద్దు చేసి తమను ఆదుకోవాలని వినతి

వైసీపీ సర్కారు 'కమీషన్ కొనుగోళ్ల'పై విచారణకు డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు కోట్ల ఖర్చుతో దుప్పట్లు, బెడ్ షీట్లు ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. అయితే మన రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలు, ఆప్కో ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంది. అలా కాకపోతే టెండర్లు ఆహ్వానించి చేనేత జౌళిశాఖ ద్వారా లేదా, తక్కువ ధరకు ఎవరు సరఫరా చేస్తే వారికైనా ఆర్డర్ ఇవ్వాలి. కానీ కోట్లాది రూపాయల దుప్పట్ల కొనుగోలు ఆర్డరు తెలంగాణకు చెందిన ఒక ప్రైవేటు వ్యాపారికి ఏపీ గిరిజన సంక్షేమ శాఖ గుట్టుచప్పుడు కాకుండా ఇచ్చేసింది. ఈ విద్యాసంవత్సరానికి గానూ రూ.40కోట్ల విలువైన దుప్పట్లు కొనుగోలుకుగాను మొదటి విడతగా రూ.8.50కోట్ల దుప్పట్ల సరఫరాకు హైదరాబాద్‌లోని నింబోలి అడ్డాలో ఉన్న వస్త్ర వ్యాపారికి ఆర్డర్ ఇచ్చింది. చేనేతకు అన్ని విధాలా చేయూత అందించే చంద్రబాబు ప్రభుత్వంలోని ఒక సంక్షేమ శాఖ ఇలా చేయడం తీవ్ర ఆక్షేపణీయమంటూ నేతన్నలు మండిపడుతున్నారు.

వైసీపీ ప్రభుత్వ నిర్ణయమే ఇప్పటికీ..

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కొందరు అధికారులకు పాత వాసనలు ఇంకా పోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. గడచిన ఐదేళ్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులు, ఇప్పుడూ అదే పద్ధతి అవలంబిస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో హైదరాబాద్‌కు చెందిన వస్త్ర వ్యాపారితో గిరిజన సంక్షేమ శాఖ దుప్పట్ల సరఫరాకు ఒప్పందం కుదుర్చుకుంది. అదిగో.. ఇదిగో.. అనే లోపు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి రాష్ట్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. జూన్ 12న మంత్రివర్గం ఏర్పడగా రెండు వారాలు తిరక్కుండానే జూన్ 25న గిరిజన సంక్షేమ శాఖమంత్రితో జగన్ ప్రభుత్వంలో ఒప్పందానికి ఆమోద ముద్ర వేయించారు. మొదటి విడతలో భాగంగా 62,103 దుప్పట్లు సరఫరా చేయాలంటూ ఈ నెల 1న ఆర్డర్ ఇచ్చారు.

'చేనేతను బలోపేతం చేస్తాం.. ఆప్కోను ప్రక్షాళన చేస్తాం'.. అంటూ రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత భరోసా ఇస్తుండగే.. 'ధర్మవరంలో చేనేతలకు క్లస్టర్లు కావాలి.. వారి అభివృద్ధికి కేంద్రం సాయం చేయాలి'.. అంటూ మంత్రి సత్యకుమార్ కేంద్ర పెద్దలకు ఢిల్లీలో వినతులిస్తున్నారు. 'నన్ను ఇంత భారీ మెజారిటీతో గెలిపించారు.. నేను ఎప్పటికీ మీ(చేనేత) వాడినే' అంటూ మంగళగిరి నేతన్నలకు మంత్రి నారా లోకేశ్ మాటిచ్చారు!. అయితే ఇవేవీ గిరిజన సంక్షేమశాఖకు వినిపించినట్లు లేదు. నేతన్నలకు చేయూత ఇవ్వాల్సిన ఆ శాఖ.. కమీషన్ల కోసం పొరుగు రాష్ట్రాల బాటపడుతోంది! మన రాష్ట్రంలోని పలు సొసైటీల్లో దుప్పట్లు నిల్వ ఉన్నా వాటిని కొనుగోలు చేయకుండా రూ.కోట్లు ఖర్చు చేసి పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తోంది. కేవలం కమీషన్ల కోసం కక్కుర్తిపడి మన నేతన్నల పొట్టగొడుతోంది!!.

కమీషన్ బాధ్యత ఉత్తరాంధ్ర దళారీదే..

కాగా, జగన్ ప్రభుత్వం ఇప్పుడు లేనందున కమీషన్లు ఇప్పించే బాధ్యత ఉత్తరాంధ్రకు చెందిన ఒక దళారీ తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా నుంచి వలస వెళ్లి విశాఖపట్నంలో స్థిరపడ్డ ఆ దళారీ ఆప్కో, ఇతర చేనేత వస్త్రాలకు సంబంధించిన కొనుగోళ్లలో వేలు పెడుతుంటాడు. ఐఏఎస్ అధికారులతో పరిచయాలు పెంచుకుని వారి పేరు చెప్పి సరఫరాదారులతో లబ్ధి పొందుతుంటాడు. ఆ వ్యక్తే గిరిజన సంక్షేమ శాఖ ఆర్డర్లో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. వెంటనే ఆర్డర్ రద్దు చేసి మన చేనేతను ఆదుకోవాలంటూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించేందుకు చేనేత సంఘాల ప్రతినిధులు సిద్ధమవుతున్నారు.

పొరుగు వస్త్రం కొనుగోళ్లన్నీ కమీషన్ల కోసమే!

ఆంధ్రప్రదేశ్‌లో లక్షన్నర వరకూ చేనేత మగ్గాలుంటే సుమారు 800 చేనేత సహకార సంఘాలున్నాయి. వాటి ద్వారా ఉపాధి పొందే నేతన్నను ఆదుకోవడానికి గత ప్రభుత్వాలు నూలు, పట్టు, ఇతర ముడిసరుకు రాయితీపై సరఫరా చేసి కార్మికులను ఆదుకునేవి. సహకార సంఘాల నుంచి ప్రభుత్వానికి అవసరమైన వస్త్రాన్ని కొనుగోలు చేసి చేనేతకు ఊతమిచ్చేవి. ఆప్కో వస్త్రాల విక్రయాలకు తోడ్పాటు అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కోసం చంద్రబాబు ప్రభుత్వం గట్టిగా శ్రమించింది. అయితే జగన్ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఇచ్చే యూనిఫామ్ కోసం కోట్లాది మీటర్ల వస్త్రం అవసరం కాగా మన రాష్ట్రంలోని ఒక్క చేనేత సంఘానికి లేదా కార్మికుడికి నూలు ఇచ్చిన పాపాన పోలేదు. కానీ జగన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ మన చేనేతల వద్దే కొనుగోలు చేయాలంటూ ఆదేశించినట్లు బహిరంగంగా చెప్పారు. ఆరా తీస్తే పొరుగు రాష్ట్రాల నుంచి కమీషన్ల కోసం వస్త్రాలు కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. టెక్స్‌టైల్స్ కవిటీ ద్వారా కొన్నామని పైకి అధికారులు చెప్పినా.. నాణ్యతను నిర్ధారించే 'రైట్స్' వద్దన్నా కొనుగోలు చేయడం వెనుక కోట్లాది రూపాయల కమీషన్లు చేతులు మారినట్లు బలమైన వాదన వినిపిస్తోంది. ఈ బాగోతంతో పాటు తాజాగా గిరిజన సంక్షేమశాఖ ఇచ్చిన ఆర్డర్‌పై విచారణ జరిపించాలని నేతన్నలు ప్రభుత్వాన్ని కోరనున్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణపై సానుకూలం: మంత్రి కేశవ్



అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ జీవోలో ఉన్న నిబంధనలకు అనుకూలంగా లేకపోవడంతో కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణలో జాప్యం జరిగింది. ఏజీ సలహా కోసం లేఖ రాశాం. కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ అంశంపై ప్రభుత్వం సానుకూల దృక్పథంలోనే ఉంది. క్రమబద్ధీకరణలో ప్రధానంగా నాలుగు సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించే దిశగానే ఏజీకి లేఖ రాశాం. ఆయన ఇచ్చే అభిప్రాయాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటాం' అని పయ్యావుల తెలిపారు.

నిరుద్యోగ భృతి హామీ అమలుకు చర్యలు: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చే హామీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని యువజన, క్రీడలు, రవాణా శాఖ మంత్రి ఎం రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని, వారి గౌరవవేతనం పెంచే ప్రతిపాదనలు కూడా ప్రగతిలో ఉన్నాయని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు.

పంచాయతీరాజ్ పాలనను గాడిలో పెట్టండి

కమిషనర్ కృష్ణతేజకు 'మండలి' మాజీ సభ్యుల వినతి

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'పంచాయతీల్లో చేసిన ఉపాధి పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా నిలిపేసింది. దీంతో 50 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు' అని రాష్ట్ర ఉపాధి హామీ మండలి మాజీ సభ్యులు వీరంకి వెంకటగురుమూర్తి, మొవ్వ లక్ష్మి సుభాషిణి, పోతుగంటి పేరయ్య అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ గాడి తప్పిందని, పాలనను గాడిలో పెట్టాలని కోరుతూ ఆ శాఖ కమిషనర్ కృష్ణతేజను కలసి వారు వినతిపత్రం అందించారు. కోర్టు తీర్పును ధిక్కరించి ఉపాధి పనులకు బిల్లులు చెల్లించలేదని వివరించారు. ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంగా ఒకే పనిపై మూడు పర్యాయాలు విచారణ వేసి చట్టానికి తూట్లు పొడిచారని వారు పేర్కొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు టెట్‌లో ఉచిత శిక్షణ: మంత్రి ఫరూక్



అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనార్టీ విద్యార్థులకు టెట్ పరీక్ష కోసం మైనార్టీ సంక్షేమ శాఖ, ఏపీ ప్రభుత్వ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 25 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ శిక్షణ కోసం 19 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

నేహారెడ్డి వ్యాజ్యం సింగిల్ జడ్జి విచారించడమే సబబు

ఆమేరకు చర్యలు తీసుకోండి... రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశం

అధికారుల ఉత్తర్వులు చట్టాలకు లోబడి లేకుంటే కోర్టులో సవాల్ చేసే హక్కు పిటిషనర్‌కు ఉంది

కేసులో ప్రతివాదిగా చేరేందుకు మూర్తి యాదవ్‌కు వెసులుబాటు

'పిల్'పై విచారణ 4 వారాలకు వాయిదా

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి సముద్రానికి అతిసమీపంలో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసేందుకు జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఈ నెల 18న తుది ఉత్తర్వులను జారీ చేశారు. వాటిని సవాల్ చేస్తూ వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి విచారించడమే సబబు అని సీజే నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం అభిప్రాయపడింది. సీఆర్‌జడ్ ప్రాంతంలో జరుపుతున్న శాశ్వత నిర్మాణాలను నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని, యంత్రాలను సీజ్ చేయాలని తాము ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగానే అధికారులు అక్రమ నిర్మాణాల తొలగింపు కోసం ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేసింది. అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు సంబంధిత చట్టాలకు లోబడి లేకుంటే వాటిని న్యాయస్థానం ముందు సవాల్ చేసే హక్కు పిటిషనర్‌కు ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్ వేసిన వ్యా జ్యాన్ని సింగిల్ జడ్జి విచారించడమే సబబు అని పేర్కొంది. సీఆర్‌జడ్ ప్రాం తంలో నిర్మాణాలను సవాల్ చేస్తూ పిల్ దాఖలు చేసిన జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌కు, నేహారెడ్డి దాఖలు చేసిన రిట్‌లో ప్రతివాదిగా చేరేందుకు వెసులుబాటు కల్పించింది. పిల్‌పై విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. నేహారెడ్డి వ్యాజ్యం సింగిల్ జడ్జి వద్ద విచారణకు వచ్చేలా చూడాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

'ప్రతిపక్ష నేత హోదా' వ్యాజ్యం విచారణ 30కి వాయిదా

ప్రతిపక్ష నేతగా గుర్తించాలంటూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యం విచారణార్హతపై అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ అభ్యంతరం లేవనెత్తారు. శుక్రవారం వ్యాజ్యంపై విచారణ ప్రారంభమైన వెంటనే ఏజీ స్పందిస్తూ... 'వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న శాసన వ్యవహారాలు, న్యాయ శాఖ కార్యదర్శి తరపున హాజరౌతున్నా. ప్రత్యక్షంగా హాజరై వాదనలు వినిపిస్తా. విచారణను వాయిదా వేయండి' అని కోరారు. జగన్మోహన్‌రెడ్డి తరపున న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... 'వ్యాజ్యంలో ఇతర ప్రతివాదులు కూడా ఉన్నారు. వారి వైఖరి ఏంటో తెలుసుకోవాలి' అని కోరారు. ఏజీ శ్రీనివాస్ స్పందిస్తూ పిటిషన్ విచారణార్హతను మొదట తేల్చాలని కోరారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

జగన్‌పై పరువు నష్టం దావా వేస్తా: జీవీ

మీడియాపాయింట్‌లో మాజీ సీఎంపై నేతల విసుర్లు



అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీడియతో మాట్లాడారు. జగన్ తీరుపై వారు విరుచుకుపడ్డారు. జగన్ ఈసారైనా అసెంబ్లీకి రావాలని వారు విజ్ఞప్తి చేశారు. వినుకొండ టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, 'నా కుటుంబంపై అసత్యాలు చెప్తున్న జగన్‌రెడ్డిపై పరువు నష్టం దావా వేస్తా. నా కుటుంబం గురించి మాట్లాడితే సహించేది లేదు. జగన్‌లా మేం అక్రమార్జనలు చేయలేదు. నీతిగా ప్రజాసేవ చేస్తున్నాం. వివేకా హంతకులు జగన్ భార్యతో ఫొటోలు దిగలేదా? జగన్‌తో ఫోటోలు దిగిన వారిలో ఏదోక కేసులో నిందితులుగా ఉన్న వారు లేరా? ఈ లెక్కన జగన్‌పై ఎన్ని కేసులు పెట్టాలి?' అని ప్రశ్నించారు. నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ... ఐదేళ్లలో జగన్ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ మాట్లాడుతూ, దోచుకుని, దాచుకోవడమే తెలిసిన జగన్ ప్రజా సమస్యలపై చర్చకు అసెంబ్లీకి రాకపోవడాన్ని ప్రజలు గమనించాలని అన్నారు.

జగన్ ఈసారైనా అసెంబ్లీకి రావాలి: వాసు

'మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాసమస్యలపై పోరాడాం. నువ్వూ పోరాడు. జగన్ అసెంబ్లీలో ఉండాలి. నువ్వు రాకపోతే ఊరుకోం' అని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు వ్యాఖ్యానించారు. 'శ్వేతపత్రం అంటే తెలియని జగన్... ఫ్యాక్ట్స్ అంటూ ఆర్థిక వ్యవస్థపై ప్రెస్‌మీట్ పెట్టడం ఏంటి? ఒక ఫ్యాక్షనిస్టు ఫ్యాక్ట్స్ అంటే ఎవరు నమ్ముతారు? ఐదేళ్లలో చేసిన అరాచకం సరిజేయాలంటే ఐదేళ్లు చాలవు. ప్రతిపక్ష హోదా లేకపోయినా చంద్రబాబు గౌరవంగా చూశారు. ఈసారైనా అసెంబ్లీకి రా. రావాలి జగన్.. కావాలి జగన్ అంటూ నీ కోసం వేయికళ్లతో ఎదురు చూస్తాం' అని అన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చిన తనకు సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన శ్వేతపత్రాలతో అనేక విషయాలు తెలిశాయని, జగన్ అసెంబ్లీ రాకపోవడం సరికాదని అన్నారు.

బీజేపీ వైపు చూస్తున్న వైసీపీ నేతలు: సోమిరెడ్డి

జగన్ బీజేపీలో చేరాలనే ప్రయత్నం బెడిసికొట్టిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. అధికారం కోసం, కేసుల నుంచి తప్పించుకోవటానికి వైసీపీ నేతలు బీజేపీ వైపు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. జగన్ ఇండియా కూటమిలో చేరకపోవచ్చని చెప్పారు. మంత్రి లోకేశ్ రెడ్‌బుక్‌లో మొదటి పేరు జగన్‌రెడ్డిదేనని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చెప్పారు.

అత్యాచారం చేస్తే కఠిన శిక్షలు పడాలి: పీడీఎఫ్

చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు అన్నారు. చిన్నారులపై అఘాయిత్యాలు పునరావృతం కాకుండా పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు బాధితులకు సత్వర సాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం నిర్వాసితులకు పక్కగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అమలు చేయాలని, భూ హక్కులు కోల్పోతున్న గిరిజనులకు న్యాయం చేయకపోతే.. ప్రాజెక్టుకే అర్థం లేదని వ్యాఖ్యానించారు. మరో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 5 వేల ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు.

కార్గిల్ వీరగాథలను రాబోయే తరాలకు చెప్పాలి: మంత్రి సత్యకుమార్



కార్గిల్ వీరజవాన్లకు నివాళులర్పిస్తూ అఖండ జ్యోతి వెలిగిస్తున్న సత్యకుమార్

తాడేపల్లి, జూలై 26: కార్గిల్ జవాన్ల వీరగాథలను రాబోయే తరాలకు చెప్పాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కేఎల్‌యూలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఎన్‌సీసీ 22, 10 ఆంధ్ర బెటాలియన్‌ల సహకారంతో ఏర్పాటు చేసిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'దేశ సరిహద్దుల్లో పహరా కాస్తున్న వీర జవాన్ల త్యాగాలు మరువలేనివి. ఎన్‌డీఏ ప్రభుత్వ ఆధ్వర్యంలో భారత్‌కు సైనిక ఆయుధ బలం పెరిగింది. ఆర్టికల్ 370 రద్దు చేసి వేర్పాటు వాదుల నోరు మూయించిన మోదీ... సర్జికల్ స్ట్రైక్స్ వంటి సాహసోపేతమైన చర్యలతో దేశ ప్రజల మన్ననలు పొందారు. అగ్నివీర్ వంటి పథకాల ద్వారా యువత సైన్యంలో సులువుగా చేరే అవకాశాన్ని కల్పించారు' అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో కేఎల్‌యూ రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, వీసీ సారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేను నోరు విప్పితే... జగన్ జైలుకే: విష్ణుకుమార్

అమరావతి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'నేను నోరు విప్పితే జగన్, ఆయన మంత్రులూ జైలుకు పోయే పరిస్థితి ఉంది' అని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. జగన్‌కు ధన దాహం ఎందుకో అర్థం కావట్లేదని, టిడ్కో ఇళ్లు కట్టిన బిల్లులు ఇవ్వకపోవడం వల్ల కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. 'దిక్కుమాలిన జగన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో తొలి రెండేళ్లు డబ్బులివ్వకుండా కాంట్రాక్టర్లను సర్వనాశనం చేశాడు. తర్వాత ఇచ్చినా.. పాత రేట్ల ప్రకారం ఇచ్చి, పనులు చేయించుకుని చివరిలో డబ్బులివ్వలేదు. జగన్ హయాంలో మొత్తం దోపిడీ జరిగింది. అడిగితే కేసులు పెట్టి, విచారణలతో వేధించారు. 36 మందిని చంపేశారంటున్న జగన్.. వారి వివరాలు ఇవ్వాలని నేనూ విజ్ఞప్తి చేస్తున్నా. జగన్ ఓడిపోయినప్పటి నుంచి శవ రాజకీయాలు చేస్తున్నారు.' అని విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు.

ఆర్థిక విధ్వంసం జరిగింది: బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం చూస్తుంటే.. గత ప్రభుత్వంలో ఎంత ఆర్థిక విధ్వంసం జరిగిందో తెలుస్తుందని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి వ్యాఖ్యానించారు. 'సీఎం చంద్రబాబు విడుదల చేసిన ఆర్థిక శ్వేతపత్రం చూశాక ఎమ్మెల్యేలకు నిరాశ కలిగింది. రూ.100 ఆదాయం వస్తే.. కనీస అవసరాలకు రూ.113 ఖర్చు అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యేలు ఏదైనా అభివృద్ధి పని చేయాలంటే కేంద్రం సాయం లేకుంటే ముందుకెళ్లడం కష్టం' అని వ్యాఖ్యానించారు.

ఏపీకి రెండు పారిశ్రామిక నగరాలు

బిహార్‌కు ఒకటి.. మొత్తంగా 12 కొత్త నగరాల ఏర్పాటుకు సంసిద్ధం: డీపీఐఐటీ

న్యూఢిల్లీ, జూలై 26: ఏపీలో రెండు కొత్త పారిశ్రామిక నగరాలను ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర పరిశ్రమల ప్రోత్సాహకం, అంతర్గత వాణిజ్య విభాగం(డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్‌కుమార్ సింగ్ వెల్లడించారు. ఏపీలో రెండు, బిహార్‌లో ఒకటి ఇలా మొత్తం 12 నగరాలు అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. స్వదేశీ ఉత్పత్తులకు భారీ ఊతమిచ్చేలా ఇవి దోహదపడనున్నాయని వివరించారు. ఇప్పటికే యూపీలోని నోయిడా, గుజరాత్‌లోని ధొలేరాలో ఏర్పాటు చేస్తున్న నగరాల మాదిరిగానే కొత్తవి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కొత్తగా ప్రకటించిన 12 నగరాల్లో ఇప్పటికే 8 చోట్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన వంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు. ధొలేరా(గుజరాత్), ఔరిక్(మహారాష్ట్ర), విక్రమ్ ఉద్యోగ్‌పురి(మధ్యప్రదేశ్), కృష్ణపట్నం(ఏపీ)లలో భారీ మౌలిక సదుపాయాలను కల్పించామని, పరిశ్రమలకు భూముల కేటాయింపు కూడా జరుగుతోందని రాజేశ్‌కుమార్ వివరించారు. అదేవిధంగా మరో నాలుగు నగరాల్లో స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ) కింద రహదారుల అనుసంధానం, నీటి సదుపాయం, విద్యుత్ సరఫరా కల్పన వంటివి జరుగుతున్నాయని తెలిపారు.

ఫేక్ ఇన్‌స్టా ఐడీతో టోకరా

మెకానికల్ ఇంజనీర్ నుంచి 28 లక్షలు దోపిడీ

ఎండాడ (విశాఖపట్నం), జూలై 26: ఆన్‌లైన్‌లో డేటింగ్ వెబ్‌సైట్ ద్వారా పెళ్లికాని యువకులను పరిచయం చేసుకుని, వారి నుంచి డబ్బులు గుంజుతున్న మోసగాడిని విశాఖపట్నం సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ స్టేషన్ సీఐ కె.భవానీప్రసాద్ అందించిన వివరాల ప్రకారం...హైదరాబాద్‌కు చెందిన కొమ్మగోని లోకేష్ డేటింగ్ వెబ్‌సైట్ ద్వారా పలువురికి అమ్మాయిగా పరిచయం అవుతాడు. ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసి అందులో కొంతకాలం చాట్ చేస్తాడు. అందమైన అమ్మాయిల ఫొటో పంపి దగ్గరైనట్టు మెసేజ్‌లు పెడతాడు. ఆ తర్వాత అత్యవసరమంటూ డబ్బులు గుంజుతాడు. ఈ విధంగా నగరానికి చెందిన అవివాహిత మెకానికల్ ఇంజనీర్‌కు వల వేశాడు. దఫదఫాలుగా రూ.28 లక్షలు రాబట్టుకున్నాడు. తాను మోసపోయానని గుర్తించిన మెకానికల్ ఇంజనీర్ నగరంలోని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సాంకేతికతను వినియోగించి నిందితుడు హైదరాబాద్‌కు చెందిన లోకేశ్‌గా గుర్తించి అరెస్టు చేశారు.